ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ


epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

మహబూబ్‌నగర్ : fb.com/vaartha Digital

Published from Mahabubnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

24-1-2026 శనివారం సంపుటి: 31 సంచిక: 353 పేజీలు: 10+4 వెల: 6.50


జపాన్ పార్లమెంటు రద్దు
కాశ్మీర్‌లో మంచువాన
కేరళలో మార్పు అనివార్యం: ప్రధాని మోడీ
5లో







శుక్రవారం సిట్ విచారణకు వచ్చిన కెటిఆర్

భయం లేదు.. ఎన్నిసార్లయినా విచారణకు వస్తా: కెటిఆర్

## కోట్లాది విలువైన ఎలక్టోరల్ బాండ్లు ఎలా వచ్చాయి?

### కొందరి ఫోన్లు ఎలా ట్యాప్ అయ్యాయి?

### కెటిఆర్‌ను ప్రశ్నించిన సిట్ అధికారులు

### 7 గంటలపాటు కొనసాగిన విచారణ

**హైదరాబాద్, జనవరి 23, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్‌ను సిట్ అధికారులు శుక్రవారం నాడు ఏడు గంటల పాటు విచారించారు. ఇదే కేసులో మంగళవారం నాడు మరో బిఆర్ఎస్ నేత హరీష్ రావును సుధీర్ఘంగా విచారించిన పోలీసులు తాజాగా కెటిఆర్‌ను అదే విధంగా ప్రశ్నించారు. కాగా కెటిఆర్ విచారణలో బిఆర్ఎస్‌కు అందిన కోట్లాది రూపాయల ఎలక్టోరల్ బాండ్లు ఎలా అందాయనే దానిపై సిట్ అధికారులు ప్రశ్నించినట్లు తెలిసింది. దీంతోపాటు అప్పట్లో రాజకీయనేతలు, వ్యాపారుల ఫోన్ ట్యాపింగ్‌పైనా ప్రశ్నించినట్లు సమాచారం. వీటితో పాటు సిరిసిల్లా కేంద్రంగా జరిగిన ఫోన్ ట్యాపింగ్‌పైనా ప్రశ్నలు సంధించినట్లు తెలిసింది. కాగా విచారణ అనంతరం బిఆర్ఎస్ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో >>2


సిట్‌వద్ద ఆందోళన జరిపిన కార్యకర్తలను అరెస్టుచేస్తున్న పోలీసులు

### విచారణ పారదర్శకం.. అవసరమైతే కెటిఆర్‌ను మళ్లీ పిలుస్తాం: సిపి సజ్జనార్



## విద్యార్థిగా అమెరికాలో సిఎం రేవంత్ రెడ్డి

### హార్వర్డ్ వర్సిటీలో లీడర్‌షిప్ కోర్సు

### ఫిబ్రవరి 1న తిరిగి రాక

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి23:** తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆమెరికాకు చేరుకున్నారు. అక్కడ హార్వర్డ్ యూనివర్సిటీలో లీడర్ షిప్ కోర్సు చేయనున్నారు. దావోస్‌లో మూడు రోజుల పర్యటన పూర్తి చేసుకున్న రేవంత్ రెడ్డి గురువారం సాయంత్రం అమెరికాకు వెళ్లారు. ఈనెల 25 నుంచి 30 వరకు అమెరికాలో సిఎం పర్యటన కొనసాగనుంది. సిఎం రేవంత్ రెడ్డి విద్యార్థిగా మారి.. హార్వర్డ్ యూనివర్సిటీలో లీడర్ షిప్‌పై సర్టిఫికెట్ కోర్సు చేయనున్నారు. హార్వర్డ్ యూనివర్సిటీ నుంచి సర్టిఫికెట్ కోర్సు చేయబోతున్న తొలి సిఎంగా అరుదైన ఘనత దక్కించుకోనున్నారు. హార్వర్డ్ యూనివర్సిటీలోని కెనడీ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌లో లీడర్‌షిప్ 21 సెంచరీ అనే కోర్స్‌కు సిఎం హాజరు కాబోతున్నారు. ఐదు ఖండాల >>2

## భారీ పెట్టుబడులతో లక్ష్యం చేరువలోకి

### 2047 నాటికి 3 ట్రిలియన్ ఎకానమీగా తెలంగాణ

### హామ్‌రోడ్ల పాలసీతో 6వేల కి.మీ రహదార్ల అభివృద్ధి

### ఏస్‌టెక్ 2026 సదస్సులో మంత్రి కోమటిరెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 23:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తమ ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ 2047 అనే స్పష్టమైన విజన్‌తో పనిచేస్తుందని రోడ్డు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం హైటెక్స్‌లో ఎఎస్ టెక్ 2026 ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి ప్రసంగించారు. మంచి రోడ్లు, స్ట్రాంగ్ బిల్డింగ్స్, ప్లాన్డ్ సిటీస్, మోడ్రన్ కనెక్టివిట ఇవన్నీ మా ప్రభుత్వ ఫస్ట్ ప్రైయారిటీలు. ఈ డెవలప్‌మెంట్‌లో కన్‌స్ట్రక్షన్, డిజైన్ రంగాల పాత్ర చాలా ఇంపార్టెంట్ అని పేర్కొన్నారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ ఎకానమీగా మార్చడమే మా టార్గెట్ అని చెప్పారు.
ఈ దిశలోనే గత ఏడాది భారత్ ఫ్యూచర్ సిటీలో చేసిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ - 2025 చాలా పెద్ద సక్సెస్‌అయింది. దాని ద్వారా దాదాపు రూ. 5.75 లక్షలకోట్ల ఇన్వెస్ట్‌మెంట్స్ వచ్చాయన్నారు. ఇప్పుడు డావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరం - 2026లో కూడా తెలంగాణ విజన్ 2047 గురించి మాట్లా >>2


సదస్సును జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న మంత్రి కోమటిరెడ్డి

## మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌కు స్పీకర్ నోటీసులు

### రూ.10 కోట్ల పరిహారంతోపాటు బహిరంగ క్షమాపణ చెప్పాలి

### ఆనంద్ ఆరోపణలు పూర్తిగా నిరాధారం: స్పీకర్ ప్రసాద్ కుమార్


స్పీకర్ గడ్డం ప్రసాద్


మాజీ ఎమ్మెల్యే ఆనంద్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి23:** తనపై నిరాధార ఆరోపణలు చేసి వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగించారని ఆరోపిస్తూ వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌కు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ లీగల్ నోటీసులు పంపించారు. మానసికంగా క్షోభ పెట్టినందుకు పది కోట్ల రూపాయల నష్టపరిహారం చెల్లించడంతో పాటుగా వారం రోజుల్లో బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని స్పీకర్ ఆ నోటీస్‌లో పేర్కొన్నారు. లేకపోతే చట్టం ప్రకారం న్యాయస్థానాల ద్వారా తగు చర్యలు తీసుకుంటామని తన లాయర్ ద్వారా పంపిన నోటీస్‌లో పేర్కొన్నారు. జనవరి జనవరి 14, జనవరి 19 తేదీలలో మీడియా సమావేశాలలో నిరక్ష్యంగా మాట్లాడుతూ తనపై నిరాధార, తప్పుడు, అసత్య, అభూత కల్పనలు, కట్టు కథలతో కూడి అవినీతి ఆరోపణలతో పాటుగా తన వ్యక్తిగత జీవితానికి, గౌరవానికి భంగం కలిగించే విధంగా మెతుకు ఆనంద్ వ్యాఖ్యలు చేశారని లీగల్ నోటిసులో స్పీకర్ పేర్కొన్నారు.
జనవరి 19న మీడియా సమావేశంలో ఆనంద్ మాట్లాడుతూ శాసన వ్యవస్థలో అత్యున్నతమైన శాసన సభాపతి పదవిని అవమానించే విదంగా శాసనసభ్యుల అనర్హత అంశంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వందల కోట్లు లంచంగా తీసుకున్నారని తీవ్ర ఆరోపణలు చేశారని తప్పుపట్టారు. ఇది రాజ్యాంగ బద్ధమైన పదవిని అవమానించడమే. అదేవిధంగా వికారాబాద్ >>2

## ఇరాన్‌పై యుద్ధ మేఘాలు

### అణ్వాయుధ తయారీకి ఇరాన్ ప్రయత్నిస్తే సైనిక చర్య జరుపుతాం: ట్రంప్

**వాషింగ్టన్,జనవరి 23:** మధ్యప్రాచ్యంలో మరోసారి యుద్ధ మేఘాలు అలుముకుంటు న్నాయి. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్‌లో పాల్గొన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్ లక్ష్యంగా మరోసారి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఇరాన్ తమ అణు కార్యక్రమాన్ని పునరుద్ధరిస్తే, అమెరికా నుంచి మరోసారి భీకర దాడులను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన స్పష్టంచేశారు. అణు ఆయుధాల తయారీకి ఇరాన్ ప్రయత్నిస్తే సహించేది లేదని, అవసరమైతే సైనిక చర్యకు వెనుకాడబోమని ట్రంప్ తేల్చిచెప్పారు. ట్రంప్ హెచ్చరికలకు తగ్గట్టుగానే క్షేత్రస్థాయిలో అమెరికా సైనిక కదలికలు వేగవంతమయ్యాయి. అత్యాధునిక యుఎస్ఎస్ అబ్రహం లింకన్ ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ స్ట్రైక్ గ్రూప్‌ను అమెరికా అరేబియన్ సముద్రం, పర్షియన్ గల్ఫ్ దిశగా తరలించింది. ఎఫ్15ఈ స్ట్రైక్ ఈగల్ జెట్‌లు, గగనతలంలోనే ఇంధనం నింపే కెసి135 ఎయిర్‌క్రాఫ్ట్‌లను అమెరికా సిద్ధం చేసింది. ఇరాన్ >>2

## కెటిఆర్ నిజాలు చెప్పాలి

### ఫోన్ ట్యాపింగ్‌పై ఆయన ఆత్మపరిశీలన చేసుకోవాలి

### వాటాల పంపకంలో తేడాలవల్లే కెసిఆర్ కుటుంబంలో తగాదాలు: పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి23:** ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభుత్వంపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ చేస్తున్న విమర్శలపై పిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఘాటుగా స్పందించారు. శుక్రవారం గాంధీభవన్‌లో మీడియా చిట్‌చాట్‌లో మాట్లాడిన ఆయన... వ్యక్తిగత హననం జరుగుతోందని కెటిఆర్ అనడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. రాజ్యాంగ పరిధిలోనే విచారణ సాగుతోందని స్పష్టం చేశారు. రాజకీయ కక్ష సాధింపు ధోరణి ఉంటే అధికారంలోకి రాగానే చర్యలు ఉండేవని వ్యాఖ్యానించారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కెటిఆర్ ముందు ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. ఇద్దరి మధ్య సంభాషణ వినడం వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించడమేనని అన్నారు. కెటిఆర్ వ్యాఖ్యలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉన్నాయని కీలక వ్యాఖ్యలు చేశారు. కెసిఆర్ కుటుంబం అలీబాబా 420 దొంగల మాదిరిగా దోపిడీకి పాల్పడిందని మహేశ్ గౌడ్ తీవ్రవిమర్శలు గుప్పించారు.
బిఆర్ఎస్ స్టువర్ట్‌పురం దొంగల బ్యాచ్‌లా మారిందన్నారు. ఆరనీకుమా ఈకార్తీకదీపం అనే ముందు, మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ దీపం ఆరిపోకుండా చూసుకోవాలని సెటైర్లువేశారు. ఫోన్ ట్యాపింగ్‌పై కెటిఆర్ మాట్లాడటం పూర్తిగా హాస్యాస్పదమన్నారు. తోడబుట్టిన చెల్లెలు కవిత ఫోన్ ట్యాప్ చేశారని గగ్గోలు పెడుతుంటే ఇప్పటివరకు సరైన సమాధానం చెప్పలేదని గుర్తు చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసు చాలాతీవ్రమైనదని, దీనిని ఉద్యమ కేసులతో పోల్చడం సరికాదని స్పష్టం చేశారు. అధికారులకు కూడా పరిమితులు ఉంటాయని అన్నారు.కాళేశ్వరం అవినీతిపై కెసిఆర్ కుటుంబంపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని బండి సంజయ్‌ను తాను నేరుగా ప్రశ్నిస్తున్నానని చెప్పారు. అలాగే బిజెపి నేతలపై ఉన్న ఇడి కేసులు ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయో చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా మహేశ్ గౌడ్ కీలక ప్రశ్న లేవనెత్తారు. దేశ భద్రతకు ముప్పుగా మారే శక్తులపై మాత్రమే ఫోన్ ట్యాపింగ్ జరుగుతుందని, అలాంటప్పుడు సినిమావాళ్లఫోన్లు ట్యాప్ చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. నక్సలైట్లతో లావాదేవీలు జరుగుతున్నాయన్న అనుమానంతో తన ఫోన్‌ను కూడా ట్యాప్ చేశారని తెలిపారు. కెసిఆర్ కుటుంబంలో తగాదాలకు అసలు కారణం వాటాల పంపకంలో తేడాలేనని సంచలన వ్యాఖ్యలు చేశారు. బిఆర్ఎస్ పాలనలో కేవలం మూడు నెలల్లోనే 547 ఫోన్లు ట్యాప్ అయ్యాయని ఆరోపించారు. తన మిత్రుడి ఫోన్ కూడా ట్యాప్ అయ్యిందని తెలిపారు.

## ఇక షోరూమ్‌ల వద్దే వాహనాల రిజిస్ట్రేషన్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి23:** షోరూంల వద్దే వాహనాల రిజిస్ట్రేషన్ శుక్రవారం నుంచి ప్రారంభమయ్యింది. ప్రయోగాత్మకంగా హైదరాబాద్ పరిధిలోని ఓ షోరూంలో దీనిని రవాణా శాఖ అధికారులు దగ్గరుండి పర్యవేక్షించారు. వాహనాల యజమానులు రిజిస్ట్రేషన్ కోసం రవాణా శాఖ కార్యాలయానికి వెళ్లకుండా డీలర్ వద్దే వాహనాలు రిజిస్ట్రేషన్ అయ్యే విధంగా రవాణా శాఖ ఈనెల 8వ తేదీన విధాన పర నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. అందుకు అనుగుణంగా రవాణా శాఖ అధికారులు సాఫ్ట్‌వేర్‌ను 15 రోజుల్లో సిద్ధం చేశారు. ఈ నేపథ్యంలో సంబంధిత సాఫ్ట్‌వేర్ ఆధారంగా ప్రయోగాత్మకంగా శుక్రవారం శ్రీ కృష్ణ ఆటోమోటివ్స్ షో రూంలో డీలర్ వాహనాన్ని రిజిస్ట్రేషన్ చేసే విధానాన్ని విజయవంతంగా అధికారులు నిర్వహించారు. ఈ విధానం విజయవంతం కావడంతో >>2

## మీ ఇంట్లో ఏం ఉన్నాయి! ఏం తింటున్నారు?




### జనగణన తొలిదశ నోటిఫికేషన్ విడుదల

### 33 ప్రశ్నలను సంధించిన కేంద్రం

**న్యూఢిల్లీ, జనవరి 23:** దేశ వ్యాప్తంగా ఏప్రిల్ 1 నుండి జనాభా లెక్కల సేకరణ తొలి దశ ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. అలాగే జనగణనలో పౌరులను అడగబోయే 33 ప్రశ్నలను ప్రభుత్వం నోటిపై చేసింది. ఈ నోటిఫికేషన్ పరిశీలిస్తే, ఈసారి జనాభా లెక్కలు కేవలం మీ ఇంటి నిర్మాణం, మీరు వాడే వస్తువులు నుంచి మీరు తినే తిండి వరకు పూర్తి వివరాలు సేకరించబోతున్నారు. ఈ మేరకు జనాభా లెక్కల నోటిఫికేషన్‌ను విడుదల చేస్తూ, మొదటి దశలో ఇండ్ల గణన కోసం అడిగే 33 ప్రశ్నల జాబితాను వెల్లడించింది. డిజిటల్ పద్ధతిలో జరగనున్న ఈ భారీ ప్రక్రియ కోసం యంత్రాంగం ఇప్పటికే సిద్ధమైంది. >>2

## మహా జాతరకు 4వేల ప్రత్యేక బస్సులు

### రేపటి నుంచి ఫిబ్రవరి 1 వరకు స్పెషల్ సర్వీసులు

### మహిళలకు ఉచిత ప్రయాణం యధాతథం



**హైదరాబాద్, ప్రభాతవార్త, జనవరి 23:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మేడారం జాతరకు ప్రత్యేక బస్సులను నడపనుంది. మేడారం జాతరకు 4వేల ప్రత్యేక బస్సులను నడపాలని ఆర్‌టిసి నిర్ణయించింది. మేడారం జాతర ఈ నెల 28 నుంచి 31 వరకు జరగనున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో టిజిఆర్టీసీ మేడారంలో తాత్కాలిక బస్ స్టేషన్‌ను ఏర్పాటు చేసి, వివిధ స్టేషన్ల నుండి బస్సులను నడుపుతోంది. ఈ నెల 25 నుంచి ప్రత్యేక సర్వీసులను ప్రారంభించి ఫిబ్రవరి 1 వరకు నడపనుంది. గత ఏడాది 2024లో కార్పొరేషన్ 3,491 బస్సులను నడిపి, 16.82 లక్షల మంది ప్రయాణికులను (రానుపోను) రవాణా చేసిందని ఆర్‌టిసి ప్రకటించింది. మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించే మహాలక్ష్మి పథకం అమలుతో ఈనెల 25 ఫిబ్రవరి 1వరకు దాదాపు 20 లక్షల మంది యాత్రికులు ఆర్‌టిసి బస్సులలో ప్రయాణిస్తారని >>2

## ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసు రూల్స్‌లో మార్పులు

**హైదరాబాద్, జనవరి 23, ప్రభాతవార్త :** ప్రభుత్వ ఉద్యోగులకు తెలంగాణ సర్కార్ చెక్ పెట్టాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ప్రభుత్వ ఉద్యోగుల నియమ, నిబంధనల్లో మార్పులు తీసుకొచ్చింది. వీటి పర్యవసానంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఏడాదికి పైగా అనధికారికంగా విధుల నుండి గైర్హాజరు అయినట్లయితే ఉద్యోగం కోల్పోనున్నారు. ఈ మేరకు దీనికి సంబంధించి ప్రభుత్వ ఉద్యోగుల రూల్స్‌కు కీలక సవరణలు చేసింది. అధికారులు వెల్లడించిన వివరాల మేరకు సివిల్ సర్వీసెస్ రూల్స్‌లోని రూల్ 9, రూల్25కు సవరణలు చేసినట్లు తెలియవచ్చింది. ఈ క్రమంలో ఏడాదికి పైగా అనధికార గైర్హాజరు అయినట్లయితే సదరు ఉద్యోగి తాము పని చేస్తున్న ప్రభుత్వ విభాగం నుండి తొలిగించబడే అవకాశం ఉంది. అలాగే ఐదేళ్లకు మించి నిరంతర గైర్హాజరు అయినట్లయితే ప్రభుత్వ సేవల నుండి తొలగించబడనున్నారు. అదే విధంగా ప్రభుత్వం అనుమతి లేకుండా విదేశీ పర్యటనలకు వెళ్లినట్లయితే >>2



శుక్రవారం బిఆర్ఎస్ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న కెటిఆర్. చిత్రంలో హరీష్‌రావు తదితరులు

>> మాట్లాడిన కెటిఆర్ డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగానే ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ సాగుతోందని, దీనికి తాను భయపడబోనని తెలిపారు. కాగా కెటిఆర్‌ను విచారించిన తరువాత వెలుగు చూసిన సమాచారం ఆధారంగా ఇదే కేసులో రెండు మూడు రోజుల్లో మరో ఇద్దరు బిఆర్ఎస్ ముఖ్య నేతలకు సిట్ అధికారులు నోటీసులు ఇవ్వనున్నట్లు తెలిసింది.

బిఆర్ఎస్ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్‌పై సిట్ విచారణ మరింత వేగం పుంజుకుంది. 2024 మార్చిలో వెలుగు చూసిన ఫోన్ ట్యాపింగ్‌పై మొదట పంజాగుట్టలో కేసు నమోదు కాగా దీనిపై విచారణకు ఎసిపి స్థాయి అధికారి నేతృత్వంలో సిట్ ఏర్పాటు చేయగా రెండు నెలల క్రితం దీనిపై సిటీ కొత్వాల్ సజ్జన్నార్ నేతృత్వంలో మరో సిట్‌ను ఏర్పాటు చేశారు. మొదటి సిట్ హయాంలో నలుగురు పోలీసు అధికారులు అరెస్టవగా మీడియా అధినేత శ్రవణ్ రావు ముందస్తు బెయిల్ పొంది విచారణకు హాజరుకాగా ఎస్ఐబి మాజీ బాస్ ప్రభాకర్ రావు అమెరికాలో వుండగానే ముందస్తు బెయిల్ పొంది మొదటి సిట్ సమయంలో లేఖలతోనే సరిపుచ్చి రెండవ సిట్ ఏర్పాటయ్యాకే విచారణకు హాజరయ్యారు. ఈ క్రమంలోనే ప్రభాకర్ రావును పోలీసులు కోర్టు అనుమతితో రెండు వారాల పాటు పోలీసు కస్టడీలో వుంచి ప్రశ్నించారు. ప్రభాకర్ రావు విచారణ తరువాత బిఆర్ఎస్ ఎంఎల్‌సి నవీన్ రావును సిట్ అధికారులు విచారించారు. నవీన్ రావును గతంలోనూ ఒకసారి విచారించారు. ఈ కేసులో పోలీసు అధికారుల పాత్రపై వివరాలు సేకరించిన సిట్ అధికారులు రాజకీయ నేతల పాత్ర గురించి ఆధారాలు సేకరించే పనిలో హరీష్ రావును ఈ నెల 20వ తేదీన తొలిసారిగా విచారించారు. హరీష్ రావును ఏడు గంటల పాటు విచారించిన సిట్ అధికారులు ఆయన నుంచి ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన కీలక సమాచారం రాబట్టారని తెలిసింది. అప్పట్లో పిసిసి అధ్యక్షుడుగా వున్న రేవంత్ రెడ్డి ఇంటి వద్ద ప్రత్యేకంగా ఒక వాహనం ఏర్పాటు చేసి ఫోన్ ట్యాపింగ్ జరిగిన తీరుతో పాటు ప్రతిపక్ష నేతల ఫోన్‌లను ఎందుకు ట్యాపింగ్ చేశారనే దానిపైనా సమాచారం రాబట్టారని తెలిసింది. హరీష్ రావు విచారణ తరువాత బిఆర్ఎస్‌కు చెందిన మరికొందరు ప్రముఖులను విచారించే వీలుందని వార్తలు రాగా వీటిని నిజం చేస్తూ కెటిఆర్‌కు గురువారం నాడు సిట్ అధికారులు నోటీసులు జారీ చేసి విచారణకు రావాలని కోరారు. కాగా సిట్ నోటీసులకు స్పందించిన కెటిఆర్ శుక్రవారం ఉదయం 11 గంటలకు జూబ్లీహిల్స్ ఎసిపి కార్యాలయంలో గల సిట్ కార్యాలయానికి వచ్చారు. ఆయన వెంట పెద్ద సంఖ్యలో బిఆర్ఎస్ కార్యకర్తలు రాగా వారిని పోలీసులు పోలీసు స్టేషన్ వద్ద అతి కష్టం మీద అదుపు

# బాండ్లు ఎలా వచ్చాయి?

చేశారు. సిట్ నుంచి ఎస్‌పి స్థాయి అధికారితో పాటు ఎసిపి స్థాయి అధికారి మరికొందరు పాల్గొన్నారు. కెటిఆర్ విచారణలో భాగంగా మొదట బిఆర్ఎస్‌కు అందిన కోట్లాది రూపాయల ఎలక్ట్రోరల్ బాండ్ల గురించి సిట్ అధికారులు ప్రశ్నించినట్లు తెలిసింది. ఇదే విషయమై గతంలో సంధ్య కన్వేన్షన్ ఎండి శ్రీధర్ రావు చేసిన ఫిర్యాదు ఆధారంగా సిట్ అధికారులు కెటిఆర్‌ను ప్రశ్నించారని తెలిసింది. సంధ్య కన్వేన్షన్ ఎండి శ్రీధర్ రావును బెదిరించి బలవంతంగా 12 కోట్ల రూపాయల బిఆర్ఎస్ ఎలక్ట్రోరల్ బాండ్లు కొనిపించినట్లు అందిన ఫిర్యాదుపైనా సిట్ ప్రశ్నించినట్లు తెలిసింది. ఇందులో మాజీ డిసిపి రాధాకిషన్ రావు పాత్రపైనా విచారించారని తెలిసింది. దీంతో పాటు వ్యాపారుల నుంచి కూడా కోట్లాది రూపాయల ఎలక్ట్రోరల్ బాండ్లు ఖరీదు చేయించినట్లు అందిన ఫిర్యాదులపైనా విచారించినట్లు సమాచారం. అప్పట్లో ప్రతిపక్ష రాజకీయ నేతలతో పాటు బిఆర్ఎస్ అసంతృప్తుల ఫోన్‌లను ట్యాపింగ్ చేయించినట్లు అందిన ఫిర్యాదులపైనా కెటిఆర్‌ను సిట్ అధికారులు ప్రశ్చించినట్లు తెలిసింది. ఇందులో నిజం లేదని కెటిఆర్ చెప్పినట్లు తెలిసింది. అయితే ఇదే విషయమై అరెస్టయిన నలుగురు పోలీసు అధికారులతో పాటు ఎస్ఐబి మాజీ బాస్ ప్రభాకర్ రావు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా కెటిఆర్‌ను పదేపదే సిట్ ప్రశ్నించినట్లు తెలిసింది. దీంతో పాటు గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో సిరిసిల్లా కేంద్రంగా జరిగిన ఫోన్ ట్యాపింగ్ గురించి కూడా సిట్ అధికారులు సుధీర్ఘంగా ప్రశ్నించినట్లు తెలిసింది. ఇందులో నిజం లేదని కెటిఆర్ చెప్పినట్లు తెలిసింది. అయితే దీనికి సంబంధించిన ఆధారాలను ఆయన ముందుంచి సమాధానం చెప్పాలని కోరగా మౌనం వహించినట్లు తెలిసింది. సిట్ అధికారుల ప్రశ్నలకు కెటిఆర్ సరైన సమాధానాలు ఇవ్వలేదని, కొన్నింటికి మౌనం వహించినట్లు సమాచారం. ఈ కేసులో అవసరం అయితే మరోసారి విచారణకు పిలుస్తామని సిట్ అధికారులు కెటిఆర్‌కు చెప్పినట్లు తెలిసింది. కాగా కెటిఆర్‌ను విచారించిన సమయంలో వెలుగు చూసిన సమాచారం ఆధారంగా మరో ఇద్దరు బిఆర్ఎస్ ప్రముఖులకు రెండు మూడు రోజుల్లో సిట్ అధికారులు తాఖీదులు జారీ చేసే వీలుందని తెలిసింది. సాయంత్రం ఆరు గంటలకు కెటిఆర్ విచారణ తరువాత బయటకు వచ్చారు.

**ఫోన్ ట్యాపింగ్ విచారణ సీరియల్‌ను తలపిస్తోంది, ఎన్నిసార్లయినా విచారణకు వస్తా... కెటిఆర్ వెల్లడి**

ఇదిలావుండగా ఫోన్ ట్యాపింగ్ విచారణ సీరియల్‌ను తలపిస్తోందని కెటిఆర్ తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ విచారణలో వేధింపులు తప్ప ఏమీలేదని, ఇదంతా అటెన్షన్ డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగమని ఆయన అన్నారు. బిఆర్ఎస్ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ ఫోన్ ట్యాపింగ్ వల్ల తమ కుటుంబాలు ఎంతో వేధన పడుతున్నాయని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి తాను భయపడడం లేదని, ఎన్నిసార్లయినా విచారణకు వస్తానని ఆయన చెప్పారు. ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి మీడియాలో వస్తున్న వార్తలు తనను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నాయని ఆయన అన్నారు. వి చారణలో ఒకటి జరిగితే మీడియాలో మరొకటి వస్తోందని, దీనివల్ల తమ కుటుంబ సభ్యులు తీవ్రంగా కలత చెందుతున్నారని కెటిఆర్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం లీకుల సర్కారుగా పేరొందిందని ఆయన విమర్శించారు. శుక్రవారం నాడు జరిగిన విచారణలో నేను తప్ప ఏ 'రావు' లేరు, ఇప్పుడు మా ఫోన్లు ట్యాప్ కావటం లేదా అని సిట్‌ను అడిగానని చెప్పారు. తాను సూటిగా సమాధానాలు చెప్పానని, ఎక్కడా భయపడలేదని ఆయన వెల్లడించారు. తన విచారణ సందర్భంగా ఈ కేసులో అరెస్టయిన ఏ పోలీసు అధికారి తన ఎదుట వుంచి ప్రశ్నించలేదని కెటిఆర్ తెలిపారు. అవసరం అయితే మరోసారి విచారణకు రావలసి వుంటుందని సిట్ అధికారులు చెప్పారని, తాను సరేనని సమాధానం ఇచ్చానని కెటిఆర్ తెలిపారు. కేవలం ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపుతున్నందుకే సర్కారు తమపై కక్ష గట్టిందని, వీటికి భయపడేది లేదని, ఎన్నిసార్లు విచారణకు పిలిచినా వస్తానని ఆయన స్పష్టం చేశారు.




రిపబ్లిక్‌డే కోసం శుక్రవారం న్యూఢిల్లీలో సైనిక శకటాల రిహార్సల్స్ దృశ్యం

# 4వేల ప్రత్యేక బస్సులు

>> అంచనా వేస్తోంది. మేడారం జాతర స్పెషల్ బస్సుల్లోనూ మహాలక్ష్మీ పథకం అమలు చేస్తూ.. మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేయనున్నట్లు ప్రకటించింది. అన్ని జిల్లాలతోపాటు హైదరాబాద్ నగరం నుండి 4 వేల బస్సులను నడపడానికి కార్పొరేషన్ ఏర్పాట్లు చేసింది. మేడారంకు ప్రత్యేక బస్సులను నడపడానికి వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, ఖమ్మం 4 ఉమ్మడి జిల్లాల్లో, హైదరాబాద్ నుండి 51 ప్రయాణికుల రద్దీ కేంద్రాలను ఆర్‌టిసి గుర్తించింది. మేడారం నుండి యాత్రికులను రవాణా చేయడానికి, జిల్లా యంత్రాంగం కేటాయించిన 50 ఎకరాల భూమిలో తాత్కాలిక బస్ స్టేషన్ ఏర్పాటు చేయబడింది. యాత్రికులు తమ గమ్యస్థానాల ప్రకారం సులభంగా బస్సులు ఎక్కడానికి వీలుగా మొత్తం 9 కిలోమీటర్ల పొడవు వరకు విస్తరించి ఉన్న 50 క్యాలైన్లు ఏర్పాటు చేయబడ్డాయి. ఈ క్యూలైన్లలో ఒకేసారి సుమారు 20000 మంది ప్రయాణికులకు వసతి కల్పించవచ్చు. తాత్కాలిక బస్ స్టేషన్‌లో ప్రయాణికుల నిరీక్షణ ప్రాంతం, సిబ్బంది విశ్రాంతి గదులు, నిర్వహణ కార్యకలాపాలు మొదలైన వాటి కోసం 1.10 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో తాత్కాలిక షెడ్లను ఆర్‌టిసి ఏర్పాటు చేసింది. సుమారు 1,000 బస్సుల పార్కింగ్ కోసం మేడారం, కమారంలో 25.76 ఎకరాల్లో పార్కింగ్ ప్రాంతం అభివృద్ధి చేయబడినట్టు ఆర్‌టిసి ప్రకటించింది. బస్సుల చిన్నపాటి నిర్వహణ సమస్యలను, మార్గమధ్యంలో ఏవైనా బస్సులు పాడైతే వాటిని సరిచేయడానికి 13 డిపార్ట్‌మెంటల్ గూడ్స్ రవాణా వాహనాలను, 2 క్రేన్‌లను, 1 ట్రాక్టర్‌ను ఏర్పాటు చేశారు. మార్గమధ్యంలో 7 ప్రదేశాలలో ప్రైవేట్ పెట్రోల్ బంకులలో బస్సులకు హెచ్‌ఎస్‌డి ఆయిల్ నింపడానికి ఏర్పాట్లు చేయబడ్డాయి. మేడారం తాత్కాలిక బస్ స్టేషన్‌లో 51 ట్రాఫిక్ రద్దీ ప్రదేశాలలో ట్రాఫిక్‌ను నిరంతరం పర్యవేక్షించడానికి 7వేల మంది డ్రైవర్లు, 1811 మంది కండక్టర్లు, 759 మంది భద్రతా సిబ్బందితోపాటు ఇతర నిర్వహణ సిబ్బందిని ఆర్‌టిసి ఏర్పాటు చేసింది. పెట్రోలింగ్ కోసం 12 జీపులు, 8 మోటార్ సైకిళ్లను ఏర్పాటు చేశారు. మేడారం తాత్కాలిక బస్ స్టేషన్‌లో ట్రాఫిక్ ప్రవాహాన్ని నిరంతరం పర్యవేక్షి ంచడానికి మేడారంలో ఒక కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేయబడింది. కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించబడిన 76 క్లోజ్డ్ సర్క్యూట్ కెమెరాలను తాత్కాలిక బస్ స్టేషన్‌లో ఏర్పాటు చేస్తున్నారు. గ్రామీణ నీటి సరఫరా శాఖ సమన్వయంతో తాత్కాలిక బస్ స్టేషన్‌లో తగినన్ని మంచినీటి కుళాయిలు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయబడ్డాయి. పూర్తి సదుపాయాలు గల అంబులెన్స్‌లు, మందులతో కూడిన వైద్యులతో వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలోని జిల్లాలతోపాటు హైదరాబాద్ నగరంలో ఆర్‌టిసి ఆధ్వర్యంలో నడుస్తున్న 4వేల మేడారం జాతర స్పెషల్ బస్సుల మూలంగా ఈ నెల 25 నుంచి ఫిబ్రవరి 1 వరకు జిల్లాలతోపాటు హైదరాబాద్‌లో సాధారణ ప్రజలకు బస్సు సర్వీసుల సంఖ్య తగ్గనున్నట్టు ఆర్‌టిసి ప్రకటించింది.

# లక్ష్యం చేరువలోకి

>> దుతూ, ఐటీ, ఎఐ, లైఫ్ సైన్సెస్, మాన్యుఫ్యాక్చరింగ్ లాంటి సెక్టార్స్‌లో ఇంకా ఎక్కువ ఇన్వెస్ట్‌మెంట్స్ తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నామన్నారు.. 2047 లోపు 3 ట్రిలియన్ టార్గెట్ రీచ్ చేయాలి.దానికి కావాల్సిన ప్లాన్ మీద ఇప్పటికే పని జరుగుతోంది,ఈ టార్గెట్ మేం తప్పకుండా అచీవ్ చేస్తామన్న నమ్మకం ఉందన్నారు. హైదరాబాద్ అన్ని రంగాల్లో పురోగమిస్తోందని, రియల్ ఎస్టేట్ అద్భుతంగా ఉందని, ఇటీవల జరిగిన వేలంలో ఎకరం రూ.174 కోట్లు పలికిందని గుర్తు చేశారు. ఎసిఇ-టెక్ లాంటి ఈవెంట్స్ వల్ల ప్రపంచంలో ఏం జరుగుతోంది అన్నది తెలుస్తుందన్నారు. గీన్ బిల్డింగ్స్, సస్టైనబుల్ కన్‌స్ట్రక్షన్, స్మార్ట్ మెటీరియల్స్ ఇవన్నీ ఫ్యూచర్‌కి చాలా ఇంపార్టెంట్.రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖలు చూస్తున్న మంత్రిగా,ఈ రంగాలను ఇంకా బెటర్‌గా తీసుకెళ్లడమే నా కమిట్‌మెంట్.ఇక్కడ ఉన్న మీ అందరి ఎక్స్‌పీరియన్స్, ఐడియాస్ మాకు చాలా ఉపయోగపడతాయి.మన లక్ష్యం కేవలం ఈరోజు వరకే కాదు.ఫ్యూచర్ జనరేషన్స్‌కి కూడా మంచి లివింగ్ కండిషన్స్ ఇవ్వాలి.బెటర్ లైఫ్, మోర్ జాబ్స్, స్ట్రాంగ్ ఎకానమీ కావాలంటేట్రాన్స్‌పోర్ట్ చాలా కీలకమైన విషయం.అందుకే ప్రభుత్వం హామ్ (హైబ్రిడ్ యాన్యుటీ మోడ్) రోడ్ల పాలసీ తీసుకొచ్చింది.ఫస్ట్ ఫేజ్‌లో 6,000 కిలోమీటర్ల రోడ్లు,దాదాపు రూ. 11,399 కోట్ల ఖర్చుతో డెవలప్ చేయబోతున్నాం.ఈ ఎసిఇ-టెక్ ఎడిషన్‌లో 300కి పైగా ఇండియన్ అండ్ ఇంటర్నేషనల్ బ్రాండ్లు పాల్గొనడం చాలా హ్యాపీగా ఉంది.తెలంగాణ గ్రోత్‌లో భాగం కావాలనుకునే వాళ్లతో ప్రభుత్వం కలిసి పని చేయడానికి రెడీగా ఉంది.ఇది హైదరాబాద్ బిజినెస్, ఇన్వెస్ట్‌మెంట్‌కు ఎంత బెస్ట్ డెస్టినేషన్ అనేదానికి ప్రూఫ్.మీ అందరికీ నా రిక్వెస్ట్ ఏంటంటే..తెలంగాణలో ఉన్న అపర్చునిటీస్‌ని చూడండి,మీ ఐడియాస్ మాతో షేర్ చేయండి,గ్రీన్, స్మార్ట్, బెటర్ సిటీస్‌ని కలిసి నిర్మిద్దాం.ఇన్నోవేషన్, క్వాలిటీ డెవలప్‌మెంట్‌కు మా సపోర్ట్ ఎప్పుడూ ఉంటుంది,.మనందరం కలిసి పని చేస్తే,స్ట్రాంగ్, సస్టైనబుల్ ఇండస్ట్రీని తప్పకుండా నిర్మించగలమని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. పరిశ్రమల స్థాపన,ఉపాధి కల్పన అంశాలపై ప్రధాన దృష్టి సారించాం, పొల్యూషన్ ఫ్రీ సిటీ అంశాన్ని దృష్టిలో పెట్టుకొని ఇక్కడ జరిగిన చర్చపై కేబినెట్‌లో ప్రస్తావిస్తానని వెల్లడించారు.

# ఇరాన్‌పై యుద్ధ మేఘాలు

>> క్షిపణి దాడులను సమర్థంగా ఎదుర్కొనేందుకు థాడ్, పేట్రియాట్ వంటి శక్తివంతమైన యాంటీ మిస్సైల్ సిస్టమ్స్‌ను మధ్యప్రాచ్యంలో మోహరించారు. ఇజ్రాయెల్, ఖతార్ వంటి మిత్రదేశాల్లో కూడా రక్షణ వ్యవస్థలను అమెరికా మరింత పటిష్టం చేయడం గల్ఫ్ ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్తతకు అద్దం పడుతోంది. గత ఏడాది జూన్‌లో అమెరికా ఇరాన్ అణు కేంద్రాలపై దాడులు జరిపిన సంగతి తెలిసిందే. ఫోర్డో అణు కేంద్రంపై జరిగిన బంకర్ బస్టర్ దాడుల తర్వాత అక్కడి నుంచి సుమారు 400 కిలోల సుసంపన్న యురేనియం అదృశ్యమైందన్న వార్తలు ఆందోళన కలిగించాయి. గత ఏడు నెలలుగా అంతర్జాతీయ అణు శక్తి సంస్థ తనిఖీలు నిలిచిపోవడంతో ఇరాన్ రహస్యంగా అణు ఆయుధాలను తయారు చేస్తోందన్న అనుమానాలు బలపడుతున్నాయి. యుద్ధ వాతావరణం కనిపిస్తున్నప్పటికీ, ట్రంప్ బోర్డ్ ఆఫ్ పీస్ అనే కొత్త అంతర్జాతీయ సంస్థను ప్రకటించడం ఆసక్తికరంగా మారింది. గాజా సమస్యతో పాటు ప్రపంచవ్యాప్తంగా శాంతి స్థాపనకు ఈ సంస్థ కృషి చేస్తుందని ఆయన చెప్పారు. అమెరికా హెచ్చరికలకు తోడు ఇజ్రాయెల్ కూడా తమ ఐరన్ డోమ్,యారో సిస్టమ్స్‌తో అప్రమత్తంగా ఉంది.

# వాహనాల రిజిస్ట్రేషన్

>> ఇక నుంచి కొత్త వాహనాలు షోరూంల వద్దే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని రవాణా శాఖ అధికారులు తెలిపారు. 24.01.2026 నుంచి కొన్న వాహనాలకు మాత్రమే ఈ విధానం వర్తిస్తుందని రవాణా శాఖ అధికారులు తెలిపారు.ఈ కొత్త విధానం ప్రకారం డీలర్ శాశ్వత రిజిస్ట్రేషన్ కోసం ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకుంటారు. అవసరమైన పత్రాలు (ఇన్‌వాయిస్, ఫారం21, ఫారం22, బీమా, చిరునామా రుజువు, వాహన ఫొటోలు మొదలైనవి) ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో వచ్చిన పత్రాల ఆధారంగా రవాణా శాఖ అధికారి దరఖాస్తును పరిశీలించి రిజిస్ట్రేషన్ నంబర్ కేటాయిస్తారు. అనంతరం వాహనానికి సంబంధించి ఆర్‌సిని స్పీడ్ పోస్ట్ ద్వారా వాహన యజమానికి పంపిస్తారు. ఈ విధానం అమలుతో ప్రజలకు సమయం ఆదా అవుతుంది. ఈ విధానం గురించి రవాణా శాఖ కమిషనర్ 33 జిల్లాల రవాణా శాఖ అధికారులతో ఆన్‌లైన్ సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. ఆ విధానం అమల్లో షో రూం డీలర్లకు ఏవైనా సందేహాలుంటే సంబంధిత జిల్లా రవాణా శాఖ అధికారులను సంప్రదించి సందేహాలు నివృత్తి చేసుకోవాలని రవాణా శాఖ తెలిపింది.

## ఆయుధాలు వీడకపోతే హమాస్‌పై సైనికచర్యే!
### దావోస్‌లో హెచ్చరించిన ట్రంప్

**దావోస్, జనవరి 22 :** ఆయుధాలు వీడటానికి అంగీకరించకపోతే సైనిక చర్యను ఎదుర్కోవలసి వస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హమాస్‌కు తీవ్ర హెచ్చరికలు జారీచేశారు. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశాల సందర్భంగా గాజాలో శాంతి స్థాపనే లక్ష్యంగా 35 దేశాల మద్దతుతో శాంతి మండలిని (పీస్ బోర్డు) ట్రంప్ లాంఛనంగా ప్రారంభించారు. పలువురు ప్రపంచ నాయకులు, ప్రముఖులు హాజరైన ఈ కార్యక్రమంలో ట్రంప్ ప్రసంగిస్తూ హమాస్ నిరాయుధీకరణ విషయంలో ఎటువంటి రాజీ లేదని స్పష్టం చేశారు. మరో యుద్ధాన్ని పరిష్కరిస్తున్నట్లు ప్రకటించిన ట్రంప్ ఉక్రెయిన్ యుద్ధాన్ని పరిష్కరించడం అత్యంత క్లిష్టంగా మారినట్లు తెలిపారు. హమాస్ నిరాయుధీకరణే తాము కొత్తగా రూపొందించిన శాంతి మార్గదర్శకాల్లో మొదటిదని ఆయన చెప్పారు. ఆయుధాలను వదిలిపెట్టేందుకు హమాస్ అంగీకరించకపోతే సైనిక చర్య తప్పదని ట్రంప్ హెచ్చరించారు. తాను అధికారం చేపట్టిన నాటి నుంచి అనేక యుద్ధాలను ముగించానని, అతి త్వరలోనే మరో పరిష్కారం రానున్నదని ఆయన చెప్పారు. ఆహ్వానం అందినప్పటికీ భారత్ సహా పలు కీలక దేశాలు ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్నాయి. చార్టర్‌పై సంతకం చేసిన దేశాల్లో పాకిస్థాన్ కూడా ఉన్నది.

# విచారణ పారదర్శకం.. అవసరమైతే కెటిఆర్‌ను మళ్లీ పిలుస్తాం: సిపి సజ్జనార్

**హైదరాబాద్, జనవరి 23, ప్రభాతవార్త:** ఫోన్ ట్యాపింగ్ కేసులో శుక్రవారం నాడు మాజీ మంత్రి, బిఆర్ఎస్ నేత కెటిఆర్‌ను సిట్ విచారించిన దానిపై సిటీ కొత్వాల్, సిట్ బాస్‌గా వున్న సజ్జన్నార్ వివరణ ఇచ్చారు. పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో నమోదైన 243/2024 కేసు దర్యాప్తుకు సంబంధించి కెటిఆర్‌ను విచారణకు పిలిచామని, ఈ సందర్భంగా దర్యాప్తులో భాగంగా కీలక అంశాలను రాబట్టడంతో పాటు రికార్డులో వున్న సాక్ష్యాధారాలతో వాటిని విశ్లేషిషణ చేస్తున్నామని ఆయన తెలిపారు. విచారణ అనంతరం కెటిఆర్‌ను సాక్షులను ప్రభావితం చేయవద్దని కోరామని, అవసరం అయితే మరోసారి విచారణకు హాజరు కావాల్సి వుంటుందని చెప్పామని సజ్జన్నార్ తెలిపారు, ఫోన్ ట్యాపింగ్‌లో భాగంగా అప్పట్లో రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, జర్నలిస్టులు, న్యాయమూర్తులతో పాటు ప్రముఖులతో సహా వేలాది మంది పౌరుల ఫోన్లను అనధికారికంగా చట్టవిరుద్ధంగా ఇంటర్‌సెప్షన్ (ట్యాపింగ్) చేయడం, నిఘా వుంచడంపై వచ్చిన తీవ్రమైన ఆరోపణలకు సంబంధించిన కేసు కావడంతో ఈ కేసు విచారణ ప్రాముఖ్యత సంతరించుకుందని ఆయన తెలిపారు. కాగా ఫోన్ ట్యాపింగ్ కేవలం భద్రతా కారణాల వల్ల మాత్రమే జరిగిందని, ఇందులో ఎలాంటి చట్ట వ్యతిరేకత లేదని కొన్ని మీడియా వర్గాలు, కొందరు వ్యక్తులు నిరాధారమైన, ప్రజలను తప్పుదోవ పట్టించే సమాచారాన్ని ప్రచారం చేస్తున్నట్లు పోలీసుల దృష్టికి వచ్చిందని, దర్యాప్తు సంస్థకు ఇటువంటి తప్పుడు కథనాలతో సంబంధం లేదని, ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ చట్ట ప్రకారం, నిష్పక్షపాతం గా, వృత్తిపరమైన ప్రమాణాలతో జరుగుతుందని సజ్జన్నార్ వెల్లడించారు. ఈ సందర్భంగా ధృవీకరించని లేదా తప్పుదోవ పట్టించే సమాచారాన్ని ప్రచారం చేయవద్దని ఆయన ప్రజలను కోరారు. చట్టబద్దమైన అధికారిక మార్గాల ద్వారా వెల్లడించిన వాస్తవాలను మాత్రమే పరిగణలోకి తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు సిపి సజ్జనార్ నోటీసులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి23:** బిఆర్ఎస్ నేత ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్‌కు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ నోటీసులు జారీ చేశారు. తనపై చేసిన ఆరోపణలకు నోటీసులు అందిన 2 రోజుల్లోగా ఆధారాలు ఇవ్వాలని ప్రవీణ్ కుమార్‌ను సిపి ఆదేశించారు.2 రోజుల్లోగా ఆధారాలు ఇవ్వకుంటే క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారు. శుక్రవారం ఉదయం మీడియా సమావేశంలో ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ సిపి సజ్జనార్‌పై 7 ట్యాపింగ్ కేసులున్నాయని,ఆయనపైనే లోతైన విచారణ జరగాలని చెప్పారు. ఆయనను సిట్ చీఫ్‌గా ఎలా నియమిస్తారు. ఆయన ఎలా ట్యాపింగ్ కేసును విచారిస్తారు? అని ప్రశ్నించారు.

## సిఎం రేవంత్ రెడ్డి

>> నుంచి 20 దేశాల ప్రతినిధులు ఈ కోర్సుకు హాజరు కాబోతున్నారు. వీరితో కలిసి రేవంత్‌రెడ్డి తరగతులు, అసైన్‌మెంట్‌లు, హోమ్‌వర్క్‌లు పూర్తి చేసి గ్రూప్ ప్రాజెక్టులు కూడా నిర్వహిస్తారు. ఈ కోర్సుకు ప్రొఫెసర్ టిమ్ ఓ బ్రియాన్ ఛైర్మన్‌గా, ప్రొఫెసర్ కరెన్ మోరిసీ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు.ఈ కోర్సులో భాగంగా ప్రతినిధి బృందాలు ప్రపంచంలోని వివిధ ప్రాంతాలు, కాలాలు, తరాలనుండి కేస్ స్టడీలను విశ్లేషించి, పరిష్కారాలు రూపొందించి తరగతిలో సమర్పిస్తారు. కోర్స్ పూర్తి చేసిన తర్వాత ముఖ్యమంత్రి హార్వర్డ్ యూనివర్సిటీ నుంచి సర్టిఫికెట్ పొందనున్నారు. కాగా, సిఎం రేవంత్‌రెడ్డి అమెరికా నుంచి తిరిగి ఫిబ్రవరి 1న హైదరాబాద్‌కు రానున్నారు.

## రూల్స్‌లో మార్పులు

>> అటువంటి ఉద్యోగిపై చర్యలు తీసుకునే విధంగా నిబంధనల్లో మార్పులు తీసుకొచ్చింది. అయితే ఇదే సమయంలో నిబంధనలు ఉల్లంఘిన ప్రభుత్వ ఉద్యోగిపై చర్యలు తీసుకునే ముందుకు షోకాజ్ నోటీసును తప్పనిసరి చేసింది.

## వారం - వర్జ్యం

24-01-2026, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, శుక్లపక్షం, శ్రావణ కార్తె
షష్ఠి రా. 12.37
ఉత్తరాభాద్ర మ. 2.13
వర్జ్యం : రా. 1.53-3.26
దు.ఉ. 6.40-8.13
రాహుకాలం - ఉ. 9.00-10.30

## వార్తాఫలం

**మేషం:** ముఖ్యమైన వ్యవహారాలలో పెద్దల సలహాలు పాటించండి. దీర్ఘకాలిక సమస్యలు తీరతాయి.శ్రమ అధికం.

**వృషభం:** ప్రయాణాలలో నూతన వ్యక్తుల పరిచయాలు ఏర్పడతాయి. ఆరోగ్యం విషయాలలో జాగ్రత్త అవసరం.

**మిథునం:** కీలక నిర్ణయాలలో జీవిత భాగస్వామి సలహాలు తీసుకుంటారు. ఆర్థిక లావాదేవీలు లాభిస్తాయి.వాహనసౌఖ్యం.

**కర్కాటకం:** మాటపట్టింపుతో ఎంతో కాలంగా దూరమైన సన్నిహితులను కలుసుకుంటారు. వస్త్రాల కొనుగోలు.

**సింహం:** ముఖ్యకార్యక్రమాలు సకాలంలో పూర్తి చేస్తారు. స్త్రీలవలన చిక్కు సమస్యలు ఏర్పడతాయి.విందు, వినోదాలలో పాల్గొంటారు.

**కన్య :** సంఘములోని పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. శుభవార్తలు వింటారు.

**తుల :** హోమియోపతి వైద్యం పట్ల మక్కువ చూపుతారు. రాజకీయ పరపతి పెరుగుతుంది.నూతన పెట్టుబడులకు అనుకూలం.

**వృశ్చికం:** రుచికరమైన ఆహారాన్ని స్వీకరించాలని మనస్సు కోరుకుంటూంది. దైవానుగ్రహాన్ని ఎంతగానో నమ్ముకుంటారు.

**ధనుస్సు:** ప్రజలతో సంబంధాలు మెరుగు పరచుకోవడానికి అవిరళ కృషి చేస్తారు. ప్రయాణాలు.గృహనిర్మాణ ఆలోచనలు కొనసాగిస్తారు.

**మకరం :** ఆర్థిక చిక్కుల నుండి తప్పుకోవడానికి గాను ఆర్థిక వనరులను ఎంతగానో నమ్ముకుంటారు.వస్త్రలాభం.

**కుంభం:** స్థిరాస్తుల కొనుగోలు వాయిదా వేయడం మంచిది. బంధువుల నుండి ఆహ్వానాలు అందుతాయి.

**మీనం:** ఎవ్వరినీ నమ్ముకుండా మీ పనిని మీరే స్వయంగా చేసుకోవడం చెప్పదగినది. వాహనయోగం.వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# చిరంజీవి సినిమాకు హైకోర్టు షాక్
## కలెక్షన్ల వివరాలపై వాణిజ్య పన్నుల శాఖకు ఆదేశం

**హైదరాబాద్, జనవరి 23, ప్రభాతవార్త :** మెగాస్టార్ చిరంజీవి నటించిన 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రానికి టిక్కెట్ ధరల పెంపు విషయంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ చిత్రానికి తెలంగాణ హైకోర్టు షాక్ ఇచ్చింది. మెగాస్టార్ చిరంజీవి సినిమా అంటేనే బాక్సాఫీస్ వద్ద పండుగ వాతావరణం నెలకొంటుంది. అయితే, తాజాగా ఆయన నటించిన మన శంకర వరప్రసాద్ గారు చిత్రం చుట్టూ ఇప్పుడు ఒక ఆసక్తికరమైన న్యాయపోరాటం మొదలైంది. వెండితెరపై కలెక్షన్ల వర్షం కురిపించిన ఈ సినిమా, ఇప్పుడు కోర్టు గడప తొక్కిన వైనం టాలీవుడ్‌లో హాట్ టాపిక్ అయింది. సినిమా విడుదలైన తొలినాళ్లలో (జనవరి 11 నుంచి 18 వరకు) సింగిల్ స్క్రీన్లలో రూ.50, మల్టీప్లెక్స్‌లలో రూ.100 అదనంగా వసూలు చేయడంపై వివాదం చెలరేగింది. ఈ పెంపు నిబంధనలకు విరుద్ధమని డాక్టర్ పాదూరి శ్రీనివాసరెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పెంచిన ధరల ద్వారా సమకూరిన అదనపు ఆదాయం దాదాపు రూ.42 కోట్ల నుంచి రూ. 45 కోట్ల వరకు ఉంటుందని, ఆ మొత్తాన్ని రికవరీ చేయాలని ఆయన కోరారు. ప్రభుత్వం వద్ద ఉండాల్సిన ఈ సొమ్మును వెంటనే ప్రభుత్వ సంచిత నిధికి లేదా లీగల్ సర్వీసెస్ అథారిటీకి జమ చేసేలా చూడాలని కోర్టుకు విన్నవించారు. ఈ పిటిషన్‌ను శుక్రవారం విచారించిన ధర్మాసనం ఈవిషయాన్ని సీరియస్‌గా పరిగణించింది. సదరుతేదీల్లో విక్రయించిన టిక్కెట్ల వాస్తవ గణాంకాలను, వసూలైన మొత్తాన్ని కోర్టుకు సమర్పించాలని వాణిజ్య పన్నుల శాఖ అధికారులను ఆదేశించింది. కేవలం ఈ సినిమా మాత్రమేకాదు, ఇటీవల విడుదలైన మరికొన్ని భారీ చిత్రాల టిక్కెట్ ధరల వ్యవహారం కూడా ఇప్పుడు కోర్టు దృష్టికి వచ్చింది. పుష్ప2, గేమ్ ఛేంజర్, అఖండ2, రాజా సాబ్ చిత్రాలకు సంబంధించిన పాత పిటిషన్లతో కలిపి ఈ కేసును కూడా తదుపరి విచారణలో విచారించనున్నట్లు హైకోర్టు పేర్కొంది. ప్రతివాదులందరికీ నోటీసులు జారీ చేస్తూ, తదుపరి విచారణను వాయిదా వేసింది.

# మెతుకు ఆనంద్‌కు స్పీకర్ నోటీసులు

>> పురపాలక సంఘాన్ని తనకు అనుకూలంగా మార్చుకున్నారనే కట్టు కథలు అల్లారు. జనవరి 14న మీడియా సమావేశంలో మాట్లాడుతూ తనను బుల్లెట్ రాజు అంటూ అవహేళనగా మాట్లాడి వ్యక్తిగతంగా మనసును గాయపరిచారు. అదేవిధంగా ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్టర్ల నుండి లంచాలు వసూలు చేస్తున్నానని తీవ్ర వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో, రాజకీయ వ్యవస్థలో ఇతరులపై విమర్శలు చేసే స్వేచ్ఛ, స్వాతంత్రం రాజ్యాంగం కల్పించింది. కానీ నిరాధార ఆరోపణలు చేయడం మాత్రం అత్యున్నత పదవులను అవమానించడం, వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీయడానికి చేసే ప్రయత్నం అవుతుందన్నారు. ఇలాంటి చర్యలను సమాజంతో పాటుగా, న్యాయస్థానాలు కూడా సమర్ధించవు. భారతీయ న్యాయ సంహిత 2023 లోని సెక్షన్ 499, 500ల ప్రకారం దురుద్ధేశ ఆరోపణలు చేసిన వారు శిక్షార్హులు అని పేర్కొన్నారు. అట్టడుగు స్థాయి నుంచి వచ్చి శాసన వ్యవస్థలో అత్యున్నతమైన శాసన సభాపతి హోదాలో ఉంటూ, నిత్యం ప్రజా సమస్యల పరిష్కారంతో పాటుగా, వికారాబాద్ నియోజకవర్గ అభివృద్ధి కోసం నిధులను మంజూరు చేయిస్తున్న గడ్డం ప్రసాద్ కుమార్‌పై ఇలాంటి అసత్యమైన ఆరోపణలు చేయడం వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగించడమేనని పేర్కొన్నారు.

# ఏం ఉన్నాయి! ఏం తింటున్నారు?

>> తొలి దశలో మీ ఇంటి పరిస్థితి, కుటుంబ సభ్యుల వివరాలు, వసతులపై దృష్టి సారించనున్నారు. సర్వేయర్లు అడిగే ప్రశ్నల జాబితా ఇలా ఉంది

**ఇంటి నిర్మాణం:** ఇంటి గోడలు, పైకప్పు, ఫ్లోరింగ్‌కు వాడిన పదార్థాలు ఏంటి?

**నివాస వివరాలు:** ఇంటి సంఖ్య, ఇంటి యాజమాన్య స్థితి, కుటుంబంలో నివసిస్తున్న వివాహిత జంటల సంఖ్య, గదుల సంఖ్య.

**కుటుంబ పెద్ద వివరాలు:** యజమాని పేరు, వారు షెడ్యూల్డ్ లేదా ఇతర వర్గాలకు చెందినవారా అనే సమాచారం.

**కనీస వసతులు:** తాగునీటి వనరు, నీటి లభ్యత, కరెంటు సౌకర్యం, మరుగుదొడ్డి రకం, డ్రైనేజీ వ్యవస్థ వివరాలు.

**వంటగది:** వంటకు వాడుతున్న ఇంధనం, వంటగది సౌకర్యం ఉందా లేదా?

**డిజిటల్ ఆస్తులు - ఇతర వస్తువుల వివరాలు:** రేడియో ట్రాన్సిస్టర్, టెలివిజన్. ఇంటర్నెట్ సౌకర్యం, ల్యాప్‌టాప్, కంప్యూటర్. మొబైల్ ఫోన్, స్మార్ట్‌ఫోన్ వివరాలు.సైకిల్, స్కూటర్, కారు లేదా వ్యాన్ వివరాలు.ప్రధానంగా వినియోగించే తృణధాన్యాల వివరాలు

**ఎంతమందికి ఒక సర్వేయర్?**

ఈ బృహత్తర కార్యాన్ని నిర్వహించడానికి భారత రిజిస్ట్రార్ జనరల్ కఠిన నిబంధనలను రూపొందించారు.

**సర్వేయర్లు:** 1990 జనాభా లెక్కల చట్టం ప్రకారం ఉపాధ్యాయులు, ప్రభుత్వ గుమస్తాలు, స్థానిక అధికారులను ఎన్యూమరేటర్లుగా నియమిస్తారు.

**పని భారం:** ప్రతి సర్వేయర్‌కు 700 నుండి 800 మంది జనాభాను లెక్కించే బాధ్యత అప్పగిస్తారు.

**పర్యవేక్షణ:** ప్రతి ఆరుగురు సర్వేయర్లకు ఒక సూపర్‌వైజర్ ఉంటారు. అత్యవసర పరిస్థితుల కోసం 10శాతం అదనపు సిబ్బందిని రిజర్వ్‌లో ఉంచుతారు.

**అధికారులు:** జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్లు, మేజిస్ట్రేట్లు ఈ ప్రక్రియను పర్యవేక్షి స్తారు. మొదటి దశ గృహ గణన పూర్తయిన తర్వాత, రెండవ దశలో అసలైన జనాభా గణన ఉంటుంది. దీనికి సంబంధించిన ప్రత్యేక షెడ్యూల్, నోటిఫికేషన్ తర్వాత విడుదల చేస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది.


కార్యక్రమంలో మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

# సాగుకు వెన్నుదన్ను వ్యవసాయ కళాశాల

## వసంత పంచమి రోజున శంకుస్థాపన శుభసూచకం

## లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకోవడం భగవత్ సంకల్పం

## హుజూర్నగర్ నియోజకవర్గ పర్యటనలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

**ప్రభాతవార్త, నడిగూడెం,(సూర్యాపేట):** వ్యవసాయం ఒక విజ్ఞానమని" ఇప్పటివరకు ఉన్న జై జవాన్, జై కిసాన్, జై విజ్ఞాన్ నినాదం ప్రస్తుతం జై జవాన్, జై కిసాన్, జై విజ్ఞాన్ ,జై అనుసంధాన్ గా మారిందని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు.శుక్రవారం ఆయన సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం, మట్టపల్లి లోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామిని సతీ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ అర్చకులు, వేద పండితులు,అధికారులు గవర్నర్ కు పూర్ణకుంభంతో స్వాగతం పలికి వేదాశీర్వచనం ఇచ్చి ప్రసాదం అందజేశారు.దేవాలయ ఆవరణలో వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్ ని సందర్శించి లబ్ధిదారులు, విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. ఆ తర్వాత వేదిక వద్ద హుజూర్నగర్ సమీపంలోని ముగ్దుమ్ నగర్ వద్ద 100 ఎకరాలలో 150 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న వ్యవసాయ కళాశాలకు శంకుస్థాపన చేశారు .అంతేగాక కోదాడ సమీపంలో 50 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న జవహర్ నవోదయ విద్యాలయానికి శంకుస్థాపన చేయడమే కాక, మట్టపల్లి లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో కోటి రూపాయల వ్యయంతో నిర్మించనున్న యాత్రికా సదన్, నూతన కిచెన్ షెడ్ కు, మరో కోటి రూపాయల వ్యయంతో నిర్మించే డార్మెటరీ బిల్డింగులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ మాట్లాడుతూ వసంత పంచమి రోజున పవిత్ర కృష్ణానది తీరాన ఉన్న మట్టపల్లి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకోవడం సంతోషమని అన్నారు. అలాగే రైతులకు ఉపయోగపడే వ్యవసాయ కళాశాలకు, విద్యార్థులకు ఉపయోగపడే నవోదయ పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన చేయడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. "వ్యవసాయం ఒక విజ్ఞానమని", ఇంతకు పూర్వం దేశంలో జై జవాన్, జై కిసాన్, నినాదం ఉండేదని, ఆ తర్వాత జై జవాన్, జై కిసాన్, జై విజ్ఞాన్ నినాదం వచ్చిందని,ప్రస్తుతం ఇది జై జవాన్ ,జై కిసాన్, జై విజ్ఞాన్, జై అనుసంధాన్ గా మారిందని తెలిపారు. గంగ ,యమునా, సరస్వతి లాగే కృష్ణ, గోదావరి, కావేరి నదులు ఉండడం, మట్టపల్లిలో స్వయంభు లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం ఉండడం ఇక్కడి ప్రజల అదృష్టమని అన్నారు. జిల్లాలో పెద్ద ఎత్తున వ్యవసాయం సాగు చేయడం, ప్రత్యేకించి పామాయిల్ పెంపకం చేపట్టడం అభినందనీయం అన్నారు. హుజూర్నగర్ నియోజకవర్గ కేంద్రంలో నెలకొల్పుతున్న వ్యవసాయ కళాశాల రైతాంగానికి వెన్నుదన్నుగా నిలుస్తుంది అన్నారు. వ్యవసాయ అభివృద్ధికి వ్యవసాయ కళాశాల ఎంతగానో ఊతమిస్తుందని పేర్కొన్నారు. పరిశోధనలకు, విజ్ఞానానికి వ్యవసాయంతో అవినాభావ సంబంధం ఉందన్నారు. వ్యవసాయాధారిత ప్రాంతంలో కళాశాల ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి దంపతుల ఆహ్వానంతో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకోవడం మహాభాగ్యంగా భావిస్తున్నట్లు గవర్నర్ తన అనుభూతిని వ్యక్తపరిచారు. అత్యంత ప్రాముఖ్యత కలిగిన మట్టపల్లి లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకోవడం భగవత్ సంకల్పం అన్నారు. అవకాశం కల్పించిన ఉత్తం దంపతులకు వేదిక ద్వారా గవర్నర్ కృతజ్ఞతలు తెలిపారు. స్వామి దర్శనం తో పాటు పవిత్ర కృష్ణా నదిని చూడటం గొప్ప అనుభూతిని మిగిల్చిందని అన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తరహాలో ఇంతటి ప్రజాభిమానాన్ని చురగొన్న నేత అరుదుగా ఉంటారని అన్నారు. ఆరుసార్లు శాసనసభ్యుడిగా ఒకసారి లోక్సభ సభ్యుడిగా గెలవడం అంటే అనన్య సామాన్యమైన విషయమని అభివర్ణించారు. సైన్యంలో చేరి పైలెట్గా రాణించి రాజకీయాల్లోకి ప్రవేశించి అభివృద్ధి కోసం ఫైటర్ గా మారాడని గవర్నర్ వ్యాఖ్యానించారు.సందర్భంగా రాష్ట్ర గవర్నర్ రైతులకు రెండు కోట్ల 47 లక్షల రూపాయల విలువ చేసే వ్యవసాయ యంత్ర పరికరాల ప్రొసీడింగ్స్ ను అందజేశారు. అంతేకాక స్వయం సహాయక మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ కింద 504 కోట్లు, ఆదాయ వనరుల ను పెంపొందించేందుకు మరో 89 కోట్ల రూపాయల చెక్కులను అందజేశారు.రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నల్లమాద ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ స్వతంత్ర భారతదేశంలో ఏ రాష్ట్రంలో పండించని విధంగా తెలంగాణ రాష్ట్రంలో అత్యధికంగా వరి ధాన్యాన్ని పండిస్తున్నామని, దేశంలో ఎక్కడా లేనివిధంగా 85!! మందికి ఉచితంగా సన్న బియ్యం ఇస్తున్నామని తెలిపారు. మట్టపల్లి అభివృద్ధికి తన వంతు శాయ శక్తుల ఇదివరకే కృషి చేశానని, భవిష్యత్తులో మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. హుజూర్నగర్ నుండి మట్టపల్లి

# ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి వైదొలగిన అమెరికా!

## అయితే రూ.2,382 కోట్లు బకాయిపడిన పెద్దన్న

**వాషింగ్టన్, జనవరి 23:** కరోనా మహమ్మారిని అదుపు చేయడంలో, సం స్కరణలను అమలు చేయడంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) విఫలమైందని ఆరోపిస్తూ అమెరికా ఆ సంస్థ నుంచి వైదొలగింది. ఈ మేరకు అమెరికా ఆరోగ్య, మానవ సేవల విభాగం ప్రకటిం చింది. ఇక నుంచి డబ్ల్యూహెచ్ఓకు అమెరికా నుంచి వెళ్లే అన్ని రకాల నిధులను నిలిపివేస్తున్నామని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న కార్యాలయాల నుంచి తమ దేశ సిబ్బందిని వెనక్కి పిలిపించినట్లు తెలిపింది. డబ్ల్యూహెచ్ఓ సంస్థకు సంబంధించిన సాంకేతిక కమిటీలు, వర్కింగ్ గ్రూపుల నుంచి కూడా వైదొలుగుతున్నట్లు అమెరికా స్పష్టం చేసింది. అయితే, పరిమిత పరిధిలో డబ్ల్యూహెచ్ఓతో కలిసి పని చేయడానికి అవకాశం ఉంటుందని అమెరికా ఆరోగ్య శాఖ అధికారులు వెల్లడించారు. ట్రంప్ రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఈ సంస్థ నుంచి వైదొలుగుతామని పలు మార్లు హెచ్చరించారు. తాజాగా, అమెరికా అధికారికంగా డబ్ల్యూహెచ్ఓ నుంచి వైదొలుగుతూ కీలక నిర్ణయం తీసుకుంది. కాగా ప్రపంచ ఆరోగ్యసంస్థ నుంచి అమెరికా వైదొలిగే సమయానికి ఆ సంస్థకు భారీ మొత్తంలో బకాయి పడింది. 260 మిలియన్ డాలర్ల బకాయిలను అమెరికా డబ్ల్యూ హెచ్ఓకు చెల్లించాల్సి ఉందని ఆంగ్లమీడియా నివేదిక ఉటంకించింది. ఇది




భారతీయ కరెన్సీలో సుమారు రూ.2,382 కోట్లు. ఈ బకాయిని పూర్తిగా చెల్లించే వరకు డబ్ల్యూహెచ్ఓ నుంచి అమెరికా ఉపసంహారణ పూర్తి కాదని ఆ సంస్థ అధికారులు పేర్కొన్నారు. సంస్థ నుంచి వైదొలగడానికి ముందు బకాయిలు చెల్లించాలనే నిబంధన ఏమీ లేదని అమెరికా అధికారులు చెపుతుండటం గమనార్హం.

# డ్రంకన్‌డ్రైవ్‌లో పట్టుబడిన వారిపై కఠినచర్యలు తీవ్రతరం

## మందుబాబుల వివరాలు కాలేజీలు, కార్యాలయాలకు పంపనున్న పోలీసులు

**హైదరాబాద్, జనవరి 23, ప్రభాతవార్త:** జంట నగరాలు, శివారు ప్రాంతాలలో డ్రంకన్ డ్రైవ్ దాడులను మరింత కఠినతరం చేసేందుకు పోలీ సులు నిర్ణయించారు. ఇప్పటివరకు డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన మందుబాబులకు జరి మానా లు, డ్రైవింగ్ లైసెన్స్‌ల రద్దు లేదా జైలు శిక్షల వరకే పరిమితం కాగా ఇకముందు దీనిని మరిం తగా విస్తరించేందుకు పోలీసు శాఖ నిర్ణయించింది. మందుబాబులు ఎవరు పట్టుబడినా వారు విద్యా ర్థులయితే కాలేజిలు, ఉద్యోగులయితే వారి కార్యాలయాలకు లేఖలు రాయ లని పోలీసులు నిర్ణయించారు. లేఖలు రాయడంతోపాటు మందు బాబులపై చర్యలు తీసుకోవాలని కోరనున్నారు. గత డిసెంబర్ నెల చివరి వారంలో డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వారిలో 270 మందికి కోర్టు జైలు శిక్ష విధించగా వీరి గురించి కాలేజిలు, కార్యాలయాలకు పోలీసులు లేఖలు రాయను న్నారు. మందు బాబుల్లో మార్పులు తెచ్చేందుకే ఇలా చేస్తున్నామని సిటీ ట్రాఫిక్ జాయింట్ పోలీసు కమిషనర్ ట్రై కమిషనరేట్ల ట్రాఫిక్ విభాగం నోడల్ ఆఫీసర్ జోయల్ డేవిస్ తెలిపారు. మందుబాబుల వల్ల జరిగే రోడ్డు ప్రమాదాలు అనేక మందిని బలి తీసుకుంటు న్నా యని, ఈ కారణంగా ఎన్నో కుటుంబాలు నష్టపోతున్నాయని ఆయన తెలిపారు. డ్రంకన్ డ్రైవ్ దాడులు ఇక ముందు నిరంతరం ఉంటాయని, పోలీసు దాడుల్లో పట్టుబడే మందు బాబులకు కఠినశిక్షలు పడేలా చూస్తామని ఆయన వెల్లడిం చారు. ఈ విషయంలో ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు.

# సస్పెండెడ్ జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ వద్ద రూ. 7.83 కోట్ల అక్రమాస్తులు

**హైదరాబాద్, జనవరి 23, ప్రభాతవార్త:** అవినీతి ఆరోపణలతో సస్పెండ్ అయిన జాయింట్ సబ్ రిజిస్ట్రార్‌పై ఎసిబి అధికారులు ఆదాయానికి మిం చిన ఆస్తుల కేసును నమోదు చేసిన ఎసిబి అధికారులు ఆయన వద్ద రూ.7.83 కోట్ల రూపా యల ఆస్తులను గుర్తించారు. ఈ సందర్భంగా సదరు జాయింట్ సబ్ రిజిస్ట్రార్‌తో పాటు అతని కుటుంబ సభ్యుల వద్ద కోట్లాది రూపాయల స్థిరచరాస్తులు లభ్యమయ్యాయి. దీనికి సంబం ధించిన వివరాలను ఎసిబి డిజి చారు సిన్హా



శుక్రవారం మీడియాకు వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా జాయింట్ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసి అవినీతి ఆరోపణలపై సస్పెండ్ అయిన కందాడి మధుసూదన్‌రెడ్డి (50)పై ఎసిబికి అందిన ఫిర్యాదుల మేరకు ఆ విభాగం అధికారులు శుక్రవారం ఉదయం నుంచి కాప్రాలోని ఆయన ఇంటితో పాటు నగరంలోని వేరు వేరు ప్రాంతాలలో గల బంధువుల ఇళ్లలో దాడులు నిర్వహించారు.

ఈ సందర్భంగా కాప్రాలోని భవాని న గర్‌లో 300 గజాలలో వున్న మూడంతస్తుల భవనం, ఇబ్రహీంపట్నంలోని చింతపల్లిగూడలో ఒక ప్లాట్, ఇదే ప్రాంతంలో గల మంగల పల్లిలో ఖ రీదైన మరో ప్లాట్, పరిగిలోని నస్కల్‌లో 27 ఎకరాల వ్యవసాయ పొలం, నస్కల్‌లో ఈతకొల నుతో వున్న ఒక ఎకరా ఒక ఫాం హౌస్ (దీని విలు వ కోటీ 24 లక్షల రూపాయలు), తొమ్మిది లక్షల రూపాయల నగదు, 1.2 కిలోల బంగారు నగలు, ఇన్నోవా కారు, ఒక వోల్వో కారు, మరో వోక్స్‌వాగన్ కారు, ఇంకో జిటి ప్లస్ కారు వెలుగు చూసింది. వీటి విలువ ఏడు కోట్ల 83 లక్షల 35 వేల 302 రూపాయలుగా తేలింది. దీంతో పాటు మధుసూదన్ రెడ్డి ఏఆర్‌కె స్పిరిట్ అనే కంపెనీలో మద్యం వ్యాపారంలో 80 లక్షల రూపాయలు పెట్టుబడిగా పెట్టినట్లు గుర్తించారు. ఇది షెల్ కంపెనీగా గుర్తించారు.

మధుసూదన్‌రెడ్డిని ఎసిబి అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అక్రమాస్తుల కేసులో విచారణ సాగుతోందని ఎసిబి డిజి చారుసిన్హా తెలిపారు. కాగా సర్కారీ విభాగాల్లో అక్రమాలపై ఎసిబికి టోల్ ఫ్రీ 1064కు ఫిర్యాదు చేయాలని ఆమె కోరారు.

# తెలంగాణ భవన్, జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ వద్ద ఉద్రిక్తత

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), జనవరి 23, ప్రభాతవార్త:** ఫోన్ ట్యాపింగ్ వ్యవ హారంలో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ను సిట్ విచారణకు పిలిచిన నేపథ్యంలో తెలంగాణ భవన్, జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ వద్ద శుక్రవారం ఉదయం తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. కేటీఆర్ తోపాటు హరీష్ రావు తదితర బిఆర్ ఎస్ నాయకులతో కలిసి తెలంగాణ భవన్ వద్దకు చేరుకున్నారు. అప్పటికే బిఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున పార్టీ కార్యాలయానికి కేటీఆర్ కు మద్దతు పలుకుతూ చేరుకున్నారు. ఈ క్రమంలో ఇక్కడ బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు బీఆర్ఎస్ శ్రేణులను అడ్డుకున్నారు. భవన్ గేట్లను పోలీసులు బలవంతంగా మూశారు. దీంతో బీఆర్ఎస్ శ్రేణులకు పోలీసులకు మధ్య మాటలు యుద్ధం కొనసాగింది. పార్టీ కార్యాలయం వద్దకు వచ్చిన నేతలను, కార్యకర్తలను పోలీసులు అక్కడినుంచి తరలించేందుకు ప్రయత్నించారు. దీంతో కాసేపు ఇక్కడ ఉద్రిక్తత చోటుచేసుకుంది. మరోవైపు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన సిట్ కార్యాలయానికి కేటీఆర్ విచారణకు హాజరవుతున్న నేపథ్యంలో పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకున్నారు. అప్పటికే జూబ్లీహిల్స్ మండల డీసీపీ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ చుట్టుపక్కల పెద్ద ఎత్తున పోలీసులను మోహరిం చారు. ఎక్కడికి అక్కడ భారీకేడ్లను ఏర్పాటు చేసి ఆందోళనకు తెలియ జేసేందుకు వచ్చే నేతలను అడ్డుకున్నారు.

పోలీస్ స్టేషన్ ముందు ఎలాంటి ఆందోళన చేయకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి అడ్డుకున్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు మద్దతుగా జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ మద్దతుగా నిలిచారు. ఆయన మాట్లాడుతూ ..ప్రజల దృష్టి మళ్లించేందుకే రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అటెన్షన్ డైవర్షన్ డ్రామాలు చేస్తుందని అన్నారు. సింగరేణి నైనీ కోల్ బ్లాక్ టెండర్ల అక్రమాలు, మంత్రుల మధ్య జరుగుతున్న వాటాల పంచాయతీలు బయటపడుతున్న వేళ..వాటినుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు మళ్లీ ఫోన్ ట్యాపింగ్ పేరుతో సిట్ డ్రామా మొదలుపెట్టారనీ అన్నారు


పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన నిర్వహిస్తున్న బిఆర్ఎస్ నేతలు

## ఢిల్లీ రిపబ్లిక్ వేడుకల్లో

# తెలంగాణ, ఎపి శకటాలకు అనుమతి నిరాకరణ

**హైదరాబాద్, జనవరి 23, ప్రభాతవార్త:** దేశ రాజధాని ఢిల్లీలో ఈ ఏడాది రిపబ్లిక్ డే పరేడ్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ శకటాల ప్రదర్శనకు ఈసారి అవకాశం దక్కలేదు. ఈ నెల 26న రిపబ్లిక్ డే వేడుకలు జరగనున్న నేపథ్యంలో ఈ రెండు రాష్ట్రాల శకటాలకు అనుమతి లభించలేదు. కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ అనుసరిస్తున్న రొటేషన్ విధానం ప్రకారం, కొన్ని రాష్ట్రాలను మినహాయిస్తూ పరేడ్‌లో ప్రదర్శనను సమకూర్చడం జరుగుతుంది. ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి అన్ని రాష్ట్రాలకు సమాన అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతో ఈ రొటేషన్ విధానం అమలులో ఉంచబడింది.

కర్తవ్యపథ్‌లో ఈ సంవత్సరం, కేవలం 30 శకటాలు పరేడ్‌లో ప్రదర్శించబడనుండగా, వాటిలో 17 రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాలు, 13 కేంద్ర శాఖల శకటాలు ఉన్నాయి. 2024-2026 రొటేషన్ సైకిల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు, కర్ణాటక, గోవా,జార్ఖండ్, ఢిల్లీ, కొన్ని ఈశాన్య రాష్ట్రాలు కూడా ఎంపిక కాలేదు. ఇక ఈ రెండురాష్ట్రాల శకటాలు పరేడ్‌లో లేకపోయినా, భారత్ పర్వ్ కార్యక్రమంలో ఎర్రకోట వద్ద ప్రదర్శించే అవకాశం ఉంది. రొటేషన్ కారణంగానే ఈ మినహాయింపు జరిగిందని, 2027 తర్వాత మళ్లీ అవకాశం వచ్చే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. రొటేషన్ కారణంగానే ఈ మినహాయింపు జరిగిందని, 2027 తర్వాత మళ్లీ అవకాశం వచ్చే అవకాశముందని అధికారులు వెల్లడిస్తున్నారు.

**పెరేడ్‌లో మారుమోగనున్న తెలంగాణ దరువు**

కాగా ఈ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఢిల్లీలో నిర్వహించే రిపబ్లిక్ డే పరేడ్‌లో తెలంగాణ సాంప్రదాయ డప్పు కళారూపం వినిపించనుంది. కేంద్ర సాంస్కృతిక శాఖ పరిధిలోని నాగపూర్ సౌత్ సెంట్రల్ కల్చర్ జోన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ జాతీయ అవార్డు గ్రహీత అందె భాస్కర్ నేతృత్వంలో 30 మంది డప్పు కళాకారులను ఎంపిక చేశారు. ఈ బృందంలో తారా కళాశాలకు చెందిన పదిమంది డప్పు కళాకారులు ఎంపికయ్యారు. ఈ కళాకారులు ఈనెల 10వ తేదీ నుంచి 24వ తేదీ వరకు ఢిల్లీలో శిక్షణ పొందిన అనంతరం, రిపబ్లిక్ డే పరేడ్‌లో తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించనున్నారు. దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన అత్యుత్తమ కళారూపాల మధ్య తెలంగాణ రాష్ట్ర మట్టి వాసన, ఊపిరి కలిగిన డప్పు దరువును ఢిల్లీ వేదికగా ప్రదర్శించేందుకు అవకాశం లభించడం గర్వకారణం కానుంది.

# వైభవంగా వసంత పంచమి వేడుకలు

## అక్షరాభ్యాసాల కోసం ఆలయాలకు క్యూ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 23:** తెలంగాణ రాష్ట్రంలో వసంత పంచమి వేడుకలు ఘనంగా జరిగాయి. బాసర, వర్గల్‌లోని సరస్వతీ అమ్మవారి క్షేత్రాల్లో పంచమి వేడుకలు శుక్రవారం వైభవంగా జరిగాయి. తెల్లవారు జామునే అమ్మవారికి విశేష పంచామృతాభిషేకం చేసిన అనంతరం విద్యాజ్యోతిగా అలంకరిం చారు. వసంత పంచమినాడు అక్షరాభ్యాసాలకు విశేష ప్రాధాన్యం ఉంది.

అందుకే వేలాది మంది భక్తులు తమ చిన్నారులతో కలిసి ఉదాయన్నే ఆలయానికి వచ్చి అక్షరాభ్యాసాలు చేయించుకున్నారు. చిన్నారులు,భక్తులతో ఆలయాలు నిండిపోయాయి. ఇదే సమయంలో ప్రైవేటు విద్యాసంస్థల్లో ఆడ్మిషన్లు భారీగా జరిగాయి.

# రూ.2 లక్షల లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిన సీనియర్ అసిస్టెంట్

## తహసీల్దార్ కార్యాలయ ఉద్యోగిపై ఎసిబి కేసు

**బజార్‌హత్నూర్, జనవరి 23, ప్రభాతవార్త:** ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ విద్యాసాగర్‌రెడ్డి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా చిక్కారు. రూ.2 లక్షల లంచం తీసుకుం టున్న సమయంలో ఆయనను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ప్రెస్ నోట్‌లో ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫిర్యాదు దారుడి నుంచి లంచం తీసుకుం టున్న సమయంలో విద్యాసాగర్ రెడ్డిని పట్టుకున్నారు. బలాన్పూర్ శివార్ పరిధిలోని సర్వే నెం.11/ఎలో ఉన్న 8.35 ఎకరాల భూమికి సంబంధించిన సదా బైనామా రిజిస్ట్రేషన్ ఫైల్‌ను ప్రాసెస్ చేసి ఫార్వర్డ్ చేయడానికి లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. రూ.2 లక్షలు నగదును నిందితుడి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. అధికారిక విధులను సరిగా నిర్వహిం చకుండా, అక్రమ లాభం పొందాలనే ఉద్దేశంతో నిందితుడు దురుద్దేశపూరితంగా వ్యవహరిం చినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని ఏసీబీ అధికారులు పేర్కొన్నారు. ఈ కేసులో నింది తుడిని అరెస్ట్ చేసి, కరీంనగర్‌లోని ఎస్పీఈ ఏసీబీ ప్రత్యేక న్యాయ స్థానం ముందు హాజరుపరచ నున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కేసు దర్యాప్తు కొనసాగుతోందన్నారు.




# పిల్లల అక్రమ దత్తత కేసులో నిందితుల అరెస్ట్

**లక్షెట్టిపేట జనవరి 23, ప్రభాతవార్త:** మున్సిపాలిటీ పరిధిలోని మోదల గ్రామంలో ఒక చిన్నారిని అక్రమంగా దత్తత తీసుకున్నారనే సమాచారంపై చైల్డ్ హెల్ప్ లైన్ అధికారులు ఫిర్యాదు చేయగా, దాని ఆధారంగా జువెనైల్ జస్టిస్ (కేర్ అండ్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్) యాక్ట్ కింద కేసు నమోదు చేసి గ్రామానికి చెందిన దత్తత తీసుకున్న తల్లిదండ్రులు ఎలుగటి తిరుపతి, ఎలుగటి కళావతిలపై విచారణ ప్రారంభించడమైంది.. విచారణలో భాగంగా అక్రమంగా దత్తత తీసుకున్న మూడేళ్ల బాలికను చైల్డ్ వెల్ఫేర్ అధికారులు రక్షి ంచి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, ఆదిలాబాద్ ఎదుట హాజరుపరచడం జరిగింది.

తదుపరి విచారణలో పరిగిపండ్ల విజయలక్ష్మి, భర్త: వెంకటేశ్వర్లు, వయస్సు: 47 సంవత్సరాలు, కులం: పద్మశాలి, వృత్తి: టైలరింగ్, నివాసం: ఇంటి నెం. 7313, తీగల్ పహాడ్, అల్లూరి సీతారామరాజు కాలనీ, మంచిర్యాల, బొజ్జ స్వరూప, భర్త: శ్రీనివాస్, వయస్సు: 41 సంవత్సరాలు, కులం: పద్మశాలి, వృత్తి: లక్ష్మి నారాయణ ఆస్పత్రి వర్కర్, నివాసం: ఇంటి నెం. 204, మహాలక్ష్మి వాడ, లక్షెట్టిపేట, ప్రస్తుతం నివాసం: సూరారం గ్రామం, లక్షెట్టిపేట మండలంఅనే వారు పిల్లలు లేని దంపతులను ఆసరాగా తీసుకొని, వారి వద్ద భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసి, ఎలాంటి చట్టబద్ధమైన దత్తత నిబంధనలు పాటించకుండా పిల్లలను అక్రమంగా దత్తతకు ఇచ్చినట్లు గుర్తించడం జరిగింది.

పైన పేర్కొన్న నిందితులను అరెస్ట్ చేసి, న్యాయస్థానం ఎదుట హాజరుపరిచి రిమాండ్‌కు తరలించనున్నారు. ఇంకా ఇద్దరు నిందితులు పరారీలో ఉండగా, వారిని పట్టుకునేందుకు గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

తదుపరి విచారణ కొనసాగుతుంది. ఇట్టి కేసులో నిందితులను పట్టుకోవడంలో చాక చక్యంగా వ్యవహరించిన సిబ్బంది శ్రీకాంత్, మల్లేష్, బగ్గని సత్యనారాయణ, ఎంబడి సత్యనారాయణ, మురళి, ప్రవళిక లను అభినందించడం జరిగింది. హెచ్చరిక అక్రమంగా పిల్లలను దత్తత తీసుకున్నా, ఇచ్చినా, రవాణా చేసినా లేదా తరలించినా సంబంధిత వ్యక్తులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డి. రమణ మూర్తిసర్కిల్ ఇన్‌స్పెక్టర్, జి. సురేష్,సబ్

# ఉపాధి హామీని పునరుద్ధరించాలి

- 30 నుండి ఫిబ్రవరి 5 వరకూ ఇంటింటి ప్రచారం
- సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బి.వి. రాఘవులు

**విజయవాడ, జనవరి 23 ప్రభాత వార్త ప్రతినిధి:** ప్రధాని నరేంద్రమోడీ ప్రభుత్వం ప్రజలు ఆలోచించేలోపే వేగంగా నిరంకుశ చట్టాలను అమ ల్లోకి తెస్తోందని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు అన్నారు. ఇందులో భాగంగానే విబిజీరాంజీ, విద్యుత్ చట్టాల సవరణ, లేబర్ కోడ్లు, సీడ్ బిల్లు, మినీ అణువిద్యుత్ ప్లాంటు బిల్లులను ఒకేసారి తీసుకోస్తోందని అన్నారు. శుక్రవారం విజయవాడ బాలోత్సవ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుతో కలిసి రాఘవులు మాట్లాడారు. ఈనెల 16 నుండి 18వ తేదీ వరకు కేరళలో సిపిఎం కేంద్ర కమిటీ సమావేశాలు జరిగాయని, 22, 23 తేదీల్లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశాలు విజయవాడలో జరిగాయన్నారు. వీటిల్లో పలు కీలక అంశాలపైనా, ప్రమాదకరమైన సంస్కరణలపైనా చర్చించినట్లు తెలిపారు. గతంలో ఉన్న ఉపాధి హామీ చట్టాన్నే అమలు చేయాలని కోరుతూ.. ఈ నెల 30వ తేదీ నుండి ఫిబ్రవరి 5వ తేదీ వరకూ ఇంటింటి ప్రచారం నిర్వహిస్తామని తెలిపారు. జనవరి 30 మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఉపాధి హామీ చట్టం పరిరక్షణకు పోరాడతామని ప్రతిజ్ఞ చేస్తామని, రెండో తేదీ వరకూ సంతకాల సేకరణ చేసి గ్రామ సచివాలయాల్లో మహజర్లు సమర్పిస్తామని, ఐదో తేదీ వరకూ విస్తృత ప్రచారం చేసి 5న అన్ని మండల కార్యాలయాల ముందు ధర్నాలు నిర్వహిస్తామని వారు తెలిపారు.



తెలంగాణ ప్రభుత్వం
దేవాదాయ ధర్మాదాయ శాఖ, నిజామాబాద్ జిల్లా
సహాయ కమిషనర్ వారి కార్యాలయము, దేవాదాయ ధర్మాదాయ శాఖ నిజామాబాద్
లేఖ నెం. సి/179/2026 ప్రకటన తేది: 23.01.2026
శ్రీయుత కమిషనర్ దేవాదాయ ధర్మాదాయ శాఖ హైదరాబాద్ గారిచే నూతన పునరుద్ధరణ కమిటీ నియామకము చేయుటకు నోటిఫికేషన్ ఉత్తర్వులు జారీ చేసియున్నారు. కావున శ్రీ చక్రేశ్వర శివ మందిరము బోధన్ పట్టణము నిజామాబాద్ జిల్లా పునరుద్ధరణ కమిటీగాను ఆసక్తిగల వారు తేది: 22.01.2026 నుండి (20) రోజులలోపు తమ తమ దరఖాస్తులను శ్రీయుత సహాయ కమిషనర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ, నిజామాబాద్ గారికి దరఖాస్తు చేసుకోగలరని కోరుచున్నాను.
సం/-. ఎమ్.ఎమ్.డి.క్రిష్ణవేణి, అదనపు కమిషనర్.
DIPR.NO. 14259-PP/CL/ADVT/1/2025-26 తేది: 23.01.2026

తెలంగాణ ప్రభుత్వం
ప్రజారోగ్యం మరియు మునిసిపల్ ఇంజనీరింగ్ విభాగం
టెండర్ N. No. EE/PH/KMM/KMC/Comm/గెస్ట్ హౌస్ కాంపౌండ్‌వాల్/2025-26, తేది: 23.01.2026. 1) పని యొక్క పేరు: ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్‌లో కమిషనర్ అతిథి గృహానికి ప్రహరీగోడ యొక్క నిర్మాణం. ECV: 39,54,481.00. 2) బిడ్ దాఖలు ప్రారంభ తేది: 24.01.2026 ఉ.10.30 గం. నుండి. 3) స్వీకరణకు చివరి తేదీ/సమయం: తేది: 28.01.2026 ఉ.11.00 గం. వరకు. 4) తెరచుట యొక్క తేది: 28.01.2026 ఉ.11.30 గం. వద్ద. 5) సంబంధిత EE యొక్క పేరు మరియు చిరునామా: శ్రీ వి. రంజిత్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పబ్లిక్ హెల్త్ డివిజన్, ఖమ్మం. తదుపరి వివరాలకు ఖమ్మం, పబ్లిక్ హెల్త్ డివిజన్, అసిస్టెంట్ ఇంజనీర్ వారిని సంప్రదించవచ్చును. సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పబ్లిక్ హెల్త్ డివిజన్, ఖమ్మం
DIPR.No.14244-PP/CL/Advt/1/2025-26, తేది: 23.01.2026

తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద ఒక క్రొత్త రాజకీయ పార్టీగా రిజిస్ట్రేషన్ కావడానికి జారీ చేయబడిన నోటీసు
(తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశములతో ప్రచురించబడింది)
Dated: 24/01/2026
రాజకీయ పార్టీల రిజిస్ట్రేషన్ మరియు గుర్తుల కేటాయింపు ఉత్తర్వుల, 2018 యొక్క నిబంధనలకు లోబడి మజ్లిస్ ఇత్తెహాద్ మిల్లత్ (పార్టీ పేరు) అధ్యక్షులు అయిన తహెర్ కమల్ కుంద్‌మిరి తను పార్టీని రిజర్వు గుర్తు లేని రాజకీయ పార్టీగా తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద నమోదు చేసుకొనుటకై అభిలషిస్తున్నట్లు సాధారణ ప్రజానీకానికి తెలియజేసేందుకు ఈ నోటీసు ఇవ్వడమైనది. ఈ పార్టీలో (1) తహెర్ కమల్ కుంద్‌మిరి, అధ్యక్షుడు (2) షఫీ అలి ఖాన్, ఉపాధ్యక్షులు (3) ముజర్ పాషా ప్రధాన కార్యదర్శి (4) సయ్యద్ అలి ముర్తుజా, సంయుక్త కార్యదర్శి (5) సయ్యద్ ఈర్షాద్ మియా, కోశాధికారి మరియు పార్టీ యొక్క ప్రధాన కార్యాలయము 16-2-867/ ఎ, జీవన్ యార్ జంగ్ కాలనీ, సైదాబాద్, హైదరాబాద్., తెలంగాణ, 500059, సదరు పార్టీ రిజిస్ట్రేషనుపై ఎవరికైనా ఏ విధమైన అభ్యంతరాలు ఉన్నట్లయితే, అట్టి అభ్యంతరాలను కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం, మొదటి అంతస్తు, DTCP భవనము, A.C. గార్డ్స్, హైదరాబాద్, 500004 గారికి, ఈ ప్రకటన ప్రచురితమైన పదిహేను రోజుల్లోగా పంపవలెను. నిర్ణీత గడువులోగా అభ్యంతరాలు రానియెడల, తెలంగాణ రాష్ట్రములో పార్టీల పరంగా జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు మజ్లిస్ ఇత్తెహాద్ మిల్లతను ఒక రాజకీయ పార్టీగా నమోదు చేయు ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం చేపడుతుంది.
అధ్యక్షులు
మజ్లిస్ ఇత్తెహాద్ మిల్లత్

వార్త

వజ్రాలు ఇచ్చి వంకాయలు కొనుక్కున్నట్లు, ఆయుష్షు, ఆరోగ్యం ఇచ్చి ఆశలు తీర్చుకుంటున్నాం.

-జాన్ సావంత్

# శునక ప్రస్థానం!

వీధి శునకాల బెడదకు సంబంధించి కోర్టులు వ్యవహరిస్తున్న తీరు ఆ వివాదాన్ని ఎక్కడికో తీసుకెళ్లిపోయాయి. సరైన పరిష్కారం ఇంకా దొరకలేదు సరికదా! కొత్త కొత్త సమస్యలు, మరికొన్ని ఆరోపణలు ప్రత్యారోపణలతో సరిపెట్టుకునే పరిస్థితి వచ్చింది. వీధుల్లో కుక్కలు మొరుగుతూనే ఉన్నాయి. వాహనదారులను భయభ్రాంతుల్ని చేసే తీరులో వాహనాల వెంట పరుగెడుతూనే ఉన్నాయి. లెక్కకు మించి వీధి శునకాలు వెంటబడుతోంటే స్కూళ్లకు వెళ్లే విద్యార్థులు భయభ్రాంతులౌతున్నారు. సుప్రీంకోర్టు తీర్పులన్నీ ఎవరూ పట్టించుకోవడం లేదని అనలేం కానీ వాటన్నిటికీ వక్రభాష్యం చెప్పేవారు ఎక్కువైపోయారు. వీధి శునకాలను పటుకుని షెల్టర్‌లకు చేర్చమనీ, వాటికి కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేసి వదలాలనీ సుప్రీం ఆదేశాలిచ్చింది. దేశంలో వీధి శునకాల బాధ్యత ఆయా పురపాలిక సంఘాలకు, కార్పొరేషన్ల వంటి స్థానిక సంస్థలది కాగా వారు పెద్దగా వాటి సంక్షేమం గురించి కానీ వీటివల్ల ఇబ్బందిపడే పౌరుల భద్రత విషయమై పట్టించుకున్న పాపాన పోలేదు. ఇదేదో చిన్న విషయంగా భావించేందుకు లేదు. కుక్కలపై విషప్రయోగం, సజీవ సమాధి చేసి చంపుతున్న వైనాల్నీ విస్మరించలేము. కొన్ని జంతు హింసా నిషేధ సంఘాల తరపున వారి కార్యకర్తలుకూడా జాగ్రత్తలు తీసుకోకుండా ఇష్టారీతిలో మాట్లాడడాన్నిసుప్రీం ఆగ్రహం వ్యక్తం చేసింది. శునకాన్ని కాలభైరవ స్వరూపంగా భావించి హిందువులు సైతం తమ వెంటపడుతున్న కుక్కల విన్యాసాలను భరించలేకపోతున్నారు. మొన్నా మధ్య ఓ పసిపాపను శునకాలే కాపలా కాసి రక్షించాలన్న వార్తలూ చదివాము. యజమాని చనిపోతే ఆయన అంత్యక్రియలు అయ్యేదాకా కూడా స్మశానానికి విషణ్ణ వదనంతో వెళ్లిన శునకరాజం విశ్వాసాన్నీ మరచిపోలేము. సుప్రీం ఆదేశాలతో కాస్త అత్యుత్సాహంతో రంగారెడ్డి జిల్లా యాచారంలో కోతులు, వీధికుక్కల బెడద అధికంగా ఉందని ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో ప్రజల అభ్యర్థన మేరకు కుక్కలను మాయం చేశారని ఫిర్యాదు. ఇలాంటి పరిస్థితులు ఉత్పన్నం కావ దానికి పలు స్థానిక సంస్థలు వీధికుక్కల విషయంలో వాటిని పట్టుకునేందుకు బడ్జెట్ లేదన్న కారణమే. అంతకుముందు 300కుక్కలను గ్రామీణ ప్రాంతంలో సజీవ సమాధి చేశారన్న సమాచారమూ లేకపోలేదు. చివరికి వీధి కుక్కల అంశంలో తామిచ్చిన తీర్పుకు వ్యాఖ్యానాలు చేసిన కేంద్ర మాజీ మంత్రి మేనకాగాంధీపై తీవ్ర అసహనం వ్యక్తం చేసే స్థాయికి చేరింది. కోర్టులో ప్రస్తావించిన అంశాలు ఎక్కడెక్కడికో వెళ్లిపోయాయి. లక్షలాది వీధి శునకాలను షెల్టర్‌లో పడేయమన్న సుప్రీం తీర్పును తప్పుబడుతూ మాజీ కేంద్ర మంత్రి మేనకా గాంధీ చేసిన వ్యాఖ్యలు కోర్టుధిక్కరణ కిందే వస్తాయని ప్రస్తావించిన ముగ్గురు జడ్జీలు, జస్టిస్ విక్రమ్‌నాథ్ సింగ్, జస్టిస్ సందీప్‌మెహతా, జస్టిస్ ఎన్‌వి అజారియాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. అయితే ఆమె కోర్టుధిక్కరణకు పాల్పడినా కోర్టు ఔదార్యంతో ఆమెపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోలేదు. ఇలా మేనకాగాంధీ పాడ్‌కాస్ట్‌లో వ్యాఖ్యానాలపై కోర్టు అభ్యంతరం తలెత్తింది. ఇదే సందర్భంలో ఆమె తరపు న్యాయవాది వాదనలో మళ్లీ న్యాయమూర్తులు కల్పించుకుని అజ్మల్ కసబ్ లాంటి ఉగ్రవాది సైతం కోర్టు ధిక్కరణకు పాల్పడలేదన్న హెచ్చరిక చేయాల్సి వచ్చింది. విమర్శలు వ్యాఖ్యానాలు చేసే మాజీ కేంద్ర మంత్రి, జంతుహక్కుల కార్యకర్తగా వాటికోసం చేపట్టిన సంక్షేమ పథకాల ప్రస్తావన వచ్చింది. ఆమె హయాంలో జంతువుల సంరక్షణకు ఎంత బడ్జెట్ కేటాయించారు? అని తిరిగి ప్రశ్నించే స్థాయిలో వాదప్రతివాదనలు జరిగాయి. ఏమయితేనేం 'వీధి శునకాల సంరక్షణ, పౌరుల భద్రత' అనే అంశాలపైన సాగవలసిన చర్చ దారిమళ్లింది. జంతు ప్రేమికులు వీధి కుక్కల విషయంలో సానుభూతి చూపడం తప్పు లేదు కానీ, అవసరాన్ని బట్టి కోర్టులకు సానుకూల మార్గాలను సూచించాల్సిందిపోయి కోర్టు తీర్పులను విమర్శించి కోపాన్ని ఆపాదించడం ఏ వర్గానికీ మంచిదికాదు. వీధి శునకాలకు ఆహారం పెట్టి చేరదీసే వారే ఆ కుక్క ఎవరినైనా కాటేస్తే బాధ్యత వహించాల్సి ఉంటుందని తాను చేసిన వ్యాఖ్యలు వ్యంగ్యంగానో కోపంగానో అన్నవి కావని, ఆరోజున బెంచిలో ఉన్న జస్టిస్ విక్రంనాథ్ కూడా సగౌరవ వ్యాఖ్యలుగానే పరిగణించాలని చెప్పుకోవాల్సి వచ్చింది. సుప్రీం ఆదేశాలు ఆచరణాత్మకమైనవి కావని శునకాలపై కారుణ్యం చూపాలని మేనకగాంధీ అన్నంత వరకు మంచిదే కావచ్చు. కానీ కోర్టు తీర్పులకు అనుచిత భాష్యాలు చెప్పడమే, హర్షిందగినవి కావు. ఇదిలా ఉండగా పల్లెల నుంచి నగరాలవరకూ రోజురోజుకీ కుక్కకాటుబాధితుల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోందని, వీధికుక్కల జనాభా నియంత్రణ, ప్రజల్లో అవగాహన పెంపు, అవసరం మేరకు రేబీస్ వ్యాక్సిన్ అందుబాటులో ఉంచితే వీధిశున కాల వలన కలిగే కాట్లను నివారించవచ్చు. ఆహారం పెట్టే వారిపైదాడులు జరుగుతాయనే భయాందోళన లేకపోలే దని జంతు సంక్షేమసంఘాలు అభిప్రాయ పడుతున్నాయి. కుక్కలను నియంత్రించడమే కాదు అవి స్వైరవిహారం చేస్తున్నప్పుడు కానీ పిచ్చిదై జనం మీద పడ్తున్నప్పుడు కానీ వాటిని పట్టుకుని ఆశ్రయాలకు తరలించకపోతే మానవులకు విపరీత ప్రాణాపాయం సంభవించే పరిస్థితి ఉంది. రోజుకి సగటున పదివేల కుక్కకాట్ల కేసులకుపైగా నమోదవుతున్నాయి. వీధి కుక్కలకుఆహారం పెట్టేవారు వాటిని తమ ఇళ్లల్లోనే ఉంచుకోవాలని, దీని వలన శునకాల ద్వారా కలిగే ఇబ్బందులు తొలగుతాయి. ఇకనైనా స్థానిక ప్రభుత్వాలు, వీధి కుక్కల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం అవసరం.

రాపిడి లేనిదే రత్నం ప్రకాశించదు. అలాగే కష్టాలను తట్టుకోలేని మానవుడు ఏ నాటికీ పరిపూర్ణత పొందలేడు.



చార్లెస్ డీగాల్

ప్రపంచం సంపాదించిన విజ్ఞానమంతా మనస్సు నుంచే వచ్చింది. ఈ విశ్వం అనంతమైన గ్రంథాలయం, మన మనస్సులోనే ఉంది.



స్వామి వివేకానంద

# ప్రజావాక్కు



## సినిమా టిక్కెట్ ధరల దోపిడీని అరికట్టాలి

**ఒకప్పుడు** అతి తక్కువ ఖర్చుతో దొరికే వినోదం సినిమా. కానీ, నేడుథియేటర్ దగ్గరకి వెళ్లాలంటే బయపడే పరిస్థితి ఏర్పడింది. దీనికి కారణం సినిమా పెద్దలే! సినిమా రేట్లు అమాంతంగా పెంచి, పేదవాడి జేబులు కొల్లగొట్టి, కోట్ల రూపాయల ఆదాయం పెంచుకుంటూ పండగ చేసుకుంటున్నారు. పైగా మాచిత్రం రికార్డులుతిరగరాసిందని ప్రచారం చేసుకుంటున్నారు. సమాజాన్ని చైతన్యపరిచే చిత్రాలు తీస్తున్నారా అంటే అదీలేదు. టికెట్ల రేట్లు పెంచమని చెప్పిన ప్రభుత్వాలే మళ్ళీటికెట్ల రేట్లుపెంచుకోమని ఉత్తర్వులు జారీచేయడం ఎందుకో ప్రజలకు అర్థం కావడం లేదు. సినిమా ఇప్పుడు వినోదం కాకుండా అదొక ఖరీదైన వ్యసనంగా మారిపోయింది. ఇప్పటికైనా ప్రభుత్వాలు కల్పించుకొని షోల పేరిట జరుగుతున్న దోపిడిని అరికట్టాలి.

- కాయల నాగేంద్ర, హైదరాబాద్

## దృఢంగా వ్యవహరించాలి

ప్రస్తుతఅంతర్జాతీయవాణిజ్యరంగంలో అమెరికా, యూరోపియన్ యూనియన్‌లతో భారత్‌జరుపుతున్న చర్చలు అత్యంత కీలకంగా మారాయి. ముఖ్యంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తీసుకుంటున్న అహేతుకమైన, బాధ్యతారహితమైనటారిఫ్ నిర్ణయాలవల్ల ద్వైపాక్షిక వాణిజ్యంలో భారత్‌కు ఆశించిన ప్రయోజనం చేకూరడం లేదు. వాషింగ్టన్ తన ఇష్టానుసారంగా విధిస్తున్న ఆంక్షలవల్ల తలెత్తిన ప్రతిష్టంభనను అధిగమించడానికి, భారత ప్రభుత్వం ఇతర దేశాలతో ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తోంది. ఇటువంటి క్లిష్ట సమయంలో దేశ ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వం ఎటువంటి స్వార్థపూరిత ఒత్తిడి సమూహాలకు తలొగ్గకుండా దృఢంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## గురుకుల కళాశాలల సంఖ్య పెంచాలి

**తెలంగాణ** రాష్ట్రంలోని33జిల్లాలలో కేవలం 18జిల్లాలలోనే 22 గిరిజన డిగ్రీ కళాశాలలో ఉన్నాయి. అందులో 15కళాశాలలో బాలికలకోసం. కేవలం7కళాశాలలు బాలుర కోసం ఏర్పాటు చేయడం జరిగింది. ఈవిద్యా సంవత్సరం మరో 8 డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేస్తే తెలంగాణ రాష్ట్రంలో 30 డిగ్రీ గురుకుల కళాశాలలు పేద గిరిజన విద్యార్థులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటాయి.

-రాపాక రవీందర్, జనగాం

## మళ్లీ గవర్నర్ల వివాదం

బిజెపి పాలనలో లేని రాష్ట్రాల గవర్నర్లు ఆ రాష్ట్రాల చట్ట సభలలో సంప్రదాయబద్ధంగా నిర్వహించవలసిన కార్యక్రమాలకు విరుద్ధంగా ప్రవర్తించడం ఎంతవరకురాజ్యాంగ సమ్మతం? తమిళనాడు గవర్నరు ఆ ప్రభుత్వానికి సహకరించడం లేదు. మొన్న జరిగిన సభలో తమిళ తల్లి పాట పూర్తయిన తరువాత రాష్ట్ర ప్రభుత్వంరాసిచ్చిన ప్రసంగ పాఠం చదవడానికి ముందుగా జాతీయ గీతాన్ని ఆలాపించాలని ఆయన కోరగా ఆ కార్యక్రమం ప్రసంగం పూర్తయిన తరువాత జరపడం ఆనవాయితి అని స్పీకర్ వివరించగా కోపంతో గవర్నరు గారు సభనుంచి రుసరుసలాడుతూవెళ్ళిపోయారు. కేరళప్రభుత్వంరాసిన ప్రసంగ పాఠంలోకొన్ని పేరాలను ఆ రాష్ట్ర గవర్నర్ చదవనన్నారు. కర్నాటకలో మరో వివాదం రాజుకుంది. రాజ్యాంగ పరంగా గవర్నర్లు రాష్ట్ర మంత్రివర్గం తయారు చేసిన ప్రసంగాలను మార్చక అలాగే చదవాలి.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## ధరల పెరుగుదలపై నియంత్రణ అవసరం

**కేంద్రప్రభుత్వ** ఉద్యోగులకు ఈ డిఏలు పెరగడం అంటే అక్కడకేదో ఒక బంగారు బండాగారం పెరిగి పోయినట్లు వీడియోలు పెట్టడం, పేపర్లలో రాయడం ఒక హాస్యాస్పదంగా ఉంటోంది. ఆరు నెలలనుండి పెరిగిన గాని పెరిగిన ధరలు అలాగే తటస్థముగా ఉండడం వల్ల ప్రభుత్వం పెంచే ఈ డిఏలు ఏ మాత్రం వారి ఖర్చులను తగ్గించగలవో ఆలోచించాలి. అర్థంలేని విశ్లేషణలు చేయకుండా, మరింతగా ధరలు పెరగకుండా ఉండేటట్లు చర్యలు తీసుకోవాలి.

-గార్లపాటి సీతారామయ్య, హైదరాబాద్

## కల్లోల సమయం

**ఉత్తరభారతావని** ముఖ్యంగా దేశ రాజధానిలో పొగచూరడంతో వివిధ రకాల శ్వాస కోశ సమస్యలతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి కావడం తెలిసిందే. అయితే ఈ మరణాలు సంవత్సరంలో సంభవించే మరణాలలో 18శాతం వరకు ఉన్నాయి అంటే పరిస్థితి అర్థం అవుతుంది. ఇది దేశంలో ఉన్న అన్ని సమస్యల కంటే ఇదే ప్రదానం అయింది అని ప్రముఖ ఆర్థికవేత్త స్పష్టం చేసిన నేపథ్యంలో ఢిల్లీలో అమలు చేసిన సరి బేసి విధానం కూడా సఫలీకృతం కాలేదు అని అర్థంచేసుకోవాలి. ఓట్లు వేసి తమకు మంచి పాలన ఇవ్వండి అని చెప్పిన పౌరులకు స్వచ్ఛమైన గాలిని అందించడంలో ప్రభుత్వాల విఫలం అవుతున్నాయి. కనుక ఇది ప్రజాస్వామికంగా కూడా కల్లోల సమయం.

-భారత అవినాష్, జనగామ

**మన వి** ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ప్రగల్భాలతో ధరలు తగ్గవు

**వ్యాపారులు లాభాల కోసం వ్యాపారాలు చేస్తున్నారనేది వాస్తవం. కమీషన్ల కోసమే దళారీ వ్యవస్థ ఉందనేది కూడా నిజం. అలా వ్యవహరిస్తే వారిని పెద్దగా తప్పుపట్టలేం. కానీ ప్రజాసంక్షేమమే తమ ధ్యేయమంటూ వేదికలెక్కి ఉపన్యాసాలిచ్చి, ప్రజా ఓట్లతో పదవులు పొంది, ప్రజలు కట్టే పన్నులతో సర్వసౌకర్యాలు అనుభవిస్తూ ప్రజానాయకులమని పదేపదే చెప్పుకొంటున్న నేతలు ఒక్కసారి మనసు పెట్టి ఆలోచిస్తే వారికే అర్థమౌతుంది. అలాగే ప్రజాసొమ్మును జీతభత్యాల రూపేణ నెలనెలా వేలాది రూపాయలు తీసుకొంటున్న అధికారగణం కూడా ఒక్కసారి ఆత్మపరిశీలన చేసుకోవాలి.**

దామెర్ల సాయిబాబ

'దగ్గరికి వస్తే చస్తావ్, లేస్తే బతకవు' అంటూ దారిన పోయేవారందరిని బెదరించి వెనుకటికి ఒకాయన కాలం గడుపుకునేవాడట. ఒకరోజు ఒక వ్యక్తి ధైర్యం చేసి ఆయన దగ్గరకు వచ్చి లేచి నిలబడు, ఏం చేస్తావో చేయి చూద్దాం అన్నాడట. తీరా చూస్తే ఆయనకు రెండు కాళ్లు లేవట. ఆ విషయం అందరికి తెలిసిపోవడంతో తమను ఇంతకాలం అతను ఊరికే ఇలా బెదరించాడని, తమ భయమంతా ఒట్టి భ్రమేనని తేలిపోయింది. ఆ తర్వాత ఆయన మాటను కాని, ఆయనను కానీ పట్టించుకునేవారే లేకుండా పోయారు. అలా ఉంది మన పాలకుల వ్యవహారశైలి. పెరుగుతున్న ధరలపై ఉక్కుపాదం మోపుతాం, ఎస్మా చట్టం ప్రయోగిస్తాం, కఠిన చర్యలు తీసుకుంటామంటూ ఉత్తర కుమార ప్రగల్భాలు పలుకుతున్న పాలకుల తీరు చూసి సామాన్యుడు సైతం ముక్కున వేలేసుకుంటున్నాడు. ఇప్పటి ప్రభుత్వాలే కాదు, గతంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా ధరలు పెరగడం, వాటిని నియంత్రిస్తామని చెప్పడం, అక్రమ నిల్వలు చేసినవారిపై చర్యలు తీసుకొని జైళ్లకు పంపుతామని బెదరించడం రివాజుగా మారిపోయింది. ఈ విషయంలో ఎప్పుడూ చర్యలు తీసుకోవడం లేదని చెప్పడం లేదు. రకరకాల చట్టాలు తెచ్చారు. బ్లాక్ మార్కెటీర్లను జైళ్లకు పంపారు. ప్రభుత్వమన్నా, అందులో పనిచేసే అధికారులన్నా అక్రమార్కులు గడగడలాడిన సందర్భాలు లేకపోలేదు. గతంలో వరంగల్ జిల్లాలో పనిచేసిన ఒక జాయింట్ కలెక్టర్ నల్లబజారుదారుల గుండెల్లో నిద్రపోయారు. ఆయన పేరు చెబితేనే బ్లాక్ మార్కెటీర్లు గడగడలాడారు. అలాంటి అధికారులు నేడు లేరని కాదు. వారి విధులను వారు స్వేచ్ఛగా చేయనీవ్వడం లేదు. అన్నింటిలో మితిమీరిన రాజకీయ జోక్యం, దానిని మించిన అవినీతి పెరిగిపోయింది. తమ సిఫారసులకు, ఒత్తిళ్లకు లొంగని సమర్థులైన అధికారులను బదలీవేటుతో శంకరగిరి మాన్యాలు పట్టిస్తున్నారు. నల్లబజారు వ్యాపారులు కూడా తమను ఇబ్బందులు పెట్టేవారిని బదలీ చేయించి తమకు ఇష్టమైన వారిని పోస్టింగ్ చేయించుకోగలుగుతున్నారు. దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ ప్రధానంగా తెలుగు రాష్ట్రాల్లో ఈ సంస్కృతి పెరిగిపోతున్నది. గతంలో ఉన్న భయభక్తులు నేడు కన్పించడం లేదు. ఇందుకు ప్రధాన కారణం రాజకీయాల్లో కీలకపాత్ర వహిస్తున్న కొందరు పెద్దలు, మరి కొందరు అక్రమ వ్యాపారులతో మమేకం కావడమే. వారి అండదండలతో ఈఅక్రమ వ్యాపారస్తులు విజృంభిస్తున్నారు. అసలు రాజకీయమే వ్యాపకంగా జీవనం సాగించేవారి సంఖ్య క్రమేపీ తగ్గిపోతున్నది. డబ్బు సంపాదనే ధ్యేయంగా మారుతున్నది. ఎన్నికలు కూడా అలానే రూపాంతరం చెందుతున్నాయి. ఇందులో ప్రజల బాధ్యత కూడా కొంతమేరకు ఉందని చెప్పకతప్పదు. పెట్టుబడి, సంపాదన, తిరిగి పెట్టుబడి, రాజకీయం ఒక విష వలయంగా మారింది. దీంతో కొందరు బడా వ్యాపారులు మరికొందరు రాజకీయ నాయకులతో అవినాభావ సంబంధాలు ఏర్పర్చుకుంటున్నారు. ఎన్ని వంకలు తిరిగినా కావడి ఇంటికి చేరాల్సిందే అన్నట్టు మొత్తం ఈభారమంతా చివరకు ప్రజలు భరించక తప్పడం లేదు. ధరలు పెరగడానికి ఇదొక ముఖ్యకారణం. ద్రవ్యోల్బణంతోపాటు మార్కెట్ మాయాజాలం కూడా ఉందనేది నిర్వివాదం. రైతుల వద్ద ఉత్పత్తులు ఉన్నప్పుడు ధరలు పెరగకపోగా, తగ్గించే ప్రయత్నం చేస్తారు. రైతులందరూ తమ సరుకులను అమ్ముకున్న తర్వాత గోదాములకు చేర్చుకున్న పిదపనే ఈ ధరలుపెంచే కార్యక్రమం ఊపందుకుంటుంది. కొరత ఎంతగా సృష్టించ గలిగితే అంతగా ధరలు పెంచుకోగలుగుతున్నారు. ఉప్పు,

## ఒక్క మాట

పప్పు బెల్లాలే కాదు బియ్యం, నూనెలు, కంది, పెసరులాంటి పప్పు దినుసుల ధరలు కూడా అదుపు లేకుండా పెరుగుతున్నాయి. రైతుల వద్ద సేకరించిన ధరలకు వినియోగదారులకు అమ్ముతున్న ధరలకు తేడాలు పరిశీలిస్తే ఏ ఒక్క సరుకును తీసుకున్నా తేడా కోట్లల్లో ఉంటుంది. వాస్తవంగా చూస్తే ఇటు ధరలను అదుపు చేసి, రైతులకు గిట్టుబాటు ధరను అందించి మరొకపక్క పేద, బడుగు వర్గాలకు సబ్సిడీతో నిత్యావసర వస్తువులను అందించేందుకు రేషనింగ్ పద్ధతిని మన పెద్దలు ఏనాడో ప్రవేశపెట్టారు. ప్రజలకు నిత్యం అవసరమయ్యే సరుకుల కొరత ఏర్పడినప్పుడు సామాన్యులకు అందుబాటులో లేకుండా ధరలు పెరిగినప్పుడు ఒక పద్ధతి ప్రకారం ప్రజలకు కొంతమేరకైనా ప్రభుత్వమే సరుకులను అందించేందుకు ఒక వ్యవస్థను ఏర్పాటు చేసింది. కాలక్రమేణా అది ప్రజాపంపిణీ వ్యవస్థగా మారింది. మన దేశానికి సంబంధించినంతవరకు 1880లో తీవ్ర క్షామం ఏర్పడి సరుకులు లభించకపోవడం, లభించినా కొనేంత ఆర్థిక పరిస్థితి లేకపోవడంతో అనేక మంది ఆకలితో అల్లాడి అసువులుబాసారు. ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వం ఒక కమిటీని నియమించింది. ఆహార కొరతలకు మూలకారణమైన కరవులు ఎందుకు వస్తున్నాయి? ఆ కరవులను ఎలా నివారించాలి? ఆహార ధాన్యాలు ప్రజలకు సరసమైన ధరల్లో అందుబాటులో ఎలా ఉంచాలి? తదితర అంశాలపై అధ్యయనం చేసిన ఆ కమిటీ కొన్ని సూచనలు చేసింది. ఆకలి తీర్చుకునేందుకు ప్రజలకు నేరుగా చౌకదుకాణాల ద్వారా కొంత సరుకును అందివ్వడం, ఆదాయం కల్పించేందుకు కరవు కాలంలో ప్రభుత్వపరంగా పని చేపట్టడం, అన్నిటికంటే ముఖ్యంగా సరుకులు కొందరి చేతుల్లో నిల్వ ఉండకుండా చూడడం వంటి సూచనలు చేసింది. ఎందుకో ఏమోకానీ ఆనాటి బ్రిటిష్ పాలకులు ఆ సూచనలను అంతగా పట్టించుకోలేదు. అయితే 1943లో ఏర్పడిన తీవ్ర క్షామం తో దేశవ్యాప్తంగా ఎంతో మంది చనిపోగా ఒక్క బెంగాల్ లోనే ముప్పై లక్షల మందికిపైగా ఆకలితో ప్రాణాలు కోల్పో వడంతో బ్రిటిష్ ప్రభుత్వం బెంబేలెత్తిపోయింది. అప్పుడు గతంలో ఆ కమిటీ చేసిన ప్రతిపాదనలను బయటకు తీశారు. అప్పటినుంచి అంతో ఇంతో అమలు చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా మన పాలకులు కొనసాగిస్తూనే ఉన్నారు. అక్రమ నిల్వలు పెరగడం, కొరత సృష్టించడం, రేషనింగ్ సేకరణ సమస్యగా మారడం, మరొక పక్క రైతులకు గిట్టుబాటు ధర లేక ప్రధానంగా వ్యాపారుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడడం వంటి పరిస్థితులు అధిగమించేందుకు 1965లో భారత్ ఆహార సంస్థను (ఎఫ్‌సిఐ) ఏర్పాటు చేసింది. మార్కెట్‌లో ధరలు పడిపోయినప్పుడు రైతులు నష్టపోకుండా వారి వద్ద నుంచి ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరకు ఎఫ్‌సిఐ కొనుగోలు చేసేది. మిల్లర్లు కొనుగోలు చేసిన ధాన్యంలో కూడా కొంత శాతం విధిగా ఎఫ్‌సిఐకి ప్రభుత్వం ప్రకటించిన ధరలకు లేవీ ఇవ్వాల్సిందిగా నిబంధనలను విధించారు. మరొక పక్క ధరలను అదుపు చేసేందుకు నల్లబజారుకు తరలిపోకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. అందులో భాగంగానే అత్యవసర వస్తువుల చట్టాన్ని ప్రవేశపెట్టారు. ఇలాంటి చర్యలు ఎన్నో తీసుకోవడమేకాక తమ ఉత్పత్తులను వినియోగదారులకు నేరుగా అమ్మేందుకు రైతు బజారు విధానాన్ని ప్రవేశపెట్టారు. ఇన్ని కార్యక్రమాలు చేపట్టినా, మరెన్నో చట్టాలతో కట్టడి చేస్తున్నామని చెప్పుకుంటున్నా ఆశించిన ఫలితాలు ఇవ్వలేకపోతున్నాయి. ఇటీవల కాలంలో ఉత్పత్తు లు ఊహించని రీతిలో పెరిగాయి. గిట్టుబాటు కాకపోయినా అష్టకష్టాలుపడి లక్ష్యాన్ని మించి అన్నదాతలు పండిస్తూనే ఉన్నారు. వాస్తవంగా తెలుగు రాష్ట్రాల్లో వరి ఇబ్బడిముబ్బడి గా పండింది, పండుతున్నది. అయినా బియ్యం ధరలు పెరిగిపోయాయి. అవసరం మేరకు ధాన్యం పండని థాయ్ లాండ్, వియత్నాం లాంటి దేశాల్లోబియ్యం ధరలు పెరిగితే అర్థం చేసుకోవచ్చు. కానీ సమృద్ధిగా దిగుబడులు లభించినా, భారతావనిలో ఇతర సరుకులతోపాటు బియ్యం ధరలు ఆకాశాన్ని అంటడం సామాన్యులకు అంతుబట్టడం లేదు. చివరిగా ఒక్కమాట వ్యాపారులు లాభాల కోసం వ్యాపారాలు చేస్తున్నారనేది వాస్తవం. కమీషన్ల కోసమే దళారీ వ్యవస్థ ఉందనేది కూడా నిజం. అలా వ్యవహరిస్తే వారిని పెద్దగా తప్పుపట్టలేం. కానీ ప్రజాసంక్షేమమే తమ ధ్యేయమంటూ వేదికలెక్కి ఉపన్యాసాలిచ్చి, ప్రజా ఓట్లతో పదవులు పొంది, ప్రజలు కట్టే పన్నులతో సర్వసౌకర్యాలు అనుభవిస్తూ ప్రజానాయకులమని పదేపదే చెప్పుకొంటున్న నేతలు ఒక్కసారి మనసు పెట్టి ఆలోచిస్తే వారికే అర్థమౌతుంది. అలాగే ప్రజాసొమ్మును జీతభత్యాల రూపేణ నెలనెలా వేలాది రూపాయలు తీసుకొంటున్న అధికారగణం కూడా ఒక్కసారి ఆత్మపరిశీలన చేసుకోవాలి. ●

# క్వాంటం వ్యాలీగా అమరావతి మారేనా?

సి. హెచ్. ప్రతాప్

ఆంధ్రప్రదేశ్‌లో క్వాంటం బయో ఫౌండ్రీల స్థాపన అనేది రాష్ట్ర పారిశ్రామిక, సాంకేతిక చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయంగా నిలుస్తుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం అమరావతిని క్వాంటం వ్యాలీగా తీర్చిదిద్దేందుకు తీసుకున్న నిర్ణయం రాష్ట్ర భవిష్యత్తును సానుకూల దిశలో మార్చేయబోతోంది. అమరావతిలో ప్రపంచ స్థాయి క్వాంటం బయో ఫౌండ్రీని ఏర్పాటు చేయడం ద్వారా ఆంధ్రప్రదేశ్ అత్యాధునిక సాంకేతిక రంగాలలో అగ్రగామిగా ఎదుగుతోంది. ఈ బయోఫౌండ్రీ అనేది క్వాంటం కంప్యూటింగ్, బయోటెక్నాలజీల అపూర్వ సంగమం, ఇది గతంలో ఎన్నడూ లేనివిధంగా శాస్త్రీయ ఆవిష్కరణలకు మార్గం సుగమం చేస్తుంది. సాధారణ కంప్యూటర్లతో అసాధ్యమైన క్లిష్టమైన మాలిక్యులర్ పరిశోధనలను క్వాంటం కంప్యూటర్ల ద్వారా అతి తక్కువ సమయంలో పూర్తి చేయవచ్చు. ఇది ముఖ్యంగా వైద్య ఔషధ రంగాలలో విప్లవాత్మక మార్పులకు దారితీస్తుంది. ఈప్రాజెక్ట్‌వల్ల కలిగే ప్రయోజనాలు అనంతం అని చెప్పవచ్చు. దీనివల్ల ఔషధాల తయారీ ప్రక్రియ అత్యంత వేగవంతం అవుతుంది. క్లిష్టమైన వ్యాధులకు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక రోగాలకు కొత్త చికిత్సా విధానాలను కనిపెట్టడంలో ఈ ఫౌండ్రీ కీలక పాత్ర పోషిస్తుంది. వ్యక్తిగత వైద్యం అందుబాటులోకి రావడంవల్ల ప్రతి రోగికి వారి జన్యువుల ఆధారంగా సరైన చికిత్స అందించడం సాధ్యమవుతుంది. ఇది ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తుంది. కేవలం వైద్యరంగమే కాకుండా, మెటీరియల్ సైన్స్, ఎంజైమ్ ఇంజనీరింగ్ వంటి పరిశ్రమలలో కూడా ఆంధ్రప్రదేశ్ తన ముద్ర వేయనుంది. అమరావతిలో ఐబీఎం 133క్విబిట్ క్వాంటం సిస్టమ్ టూనుఏర్పాటు చేయనుండటం మన రాష్ట్రానికి గర్వకారణం. ఎందుకంటే ఇటువంటి సాంకేతికత ప్రపంచంలోనే అతికొద్ది ప్రాంతాల్లోమాత్రమే అందుబాటులో ఉంది. ఆర్థిక దృక్కోణంలో చూస్తే, ఈ నిర్ణయం రాష్ట్రానికి భారీఎత్తున అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షిస్తుంది. సుమారు 60కి పైగా జాతీయ అంతర్జాతీయ సంస్థలు ఇప్పటికే ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో భాగస్వాములయ్యాయి. టీసీఎస్, ఐబీఎం, సీఎస్ఐఆర్ వంటి దిగ్గజ సంస్థలతో కుదుర్చుకున్న ఒప్పందాలు అమరావతిని రాబోయే రోజుల్లో ఒక గ్లోబల్ టెక్ హబ్‌గా మారుస్తాయి. దీనివల్ల వేల సంఖ్యలో ఉన్నత స్థాయి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి, ముఖ్యంగా డీప్‌టెక్, బయోటెక్, డేటాసైన్స్ విభాగాలలో నైపుణ్యం కలిగిన యువతకు స్థానికంగానే ఉపాధి లభిస్తుంది. ఇప్పటికే ప్రభుత్వం లక్షమందికి పైగా యువతకు క్వాంటం టెక్నాలజీలో ప్రత్యేక శిక్షణ ఇస్తోంది, ఇదిరాష్ట్ర మానవ వనరుల సామర్థ్యాన్ని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా పెంచుతుంది. పర్యావరణం వ్యవసాయరంగాలలో కూడా దీని ప్రభావం అత్యంత సానుకూలంగా ఉంటుంది. నూతన ఎరువుల తయారీ, వాతావరణ మార్పులను అత్యంత కచ్చితత్వంతో అంచనా వేయడం, సుస్థిర శక్తి వనరుల అభివృద్ధిలోక్వాంటం సిమ్యులేషన్స్ ఎంతగానోతోడ్పడతాయి. ఆంధ్రప్రదేశ్ వంటి వ్యవసాయ ఆధారిత రాష్ట్రంలో, పంటల దిగుబడిని పెంచేందుకు పురుగుమందుల వాడకాన్ని తగ్గించేందుకు అవసరమైన జీవ సాంకేతిక పరిశోధనలకు ఈ ఫౌండ్రీ ఒక వరంగా మారుతుంది. రాష్ట్ర ప్రభుత్వం క్వాంటం కంప్యూటింగ్ కోసం ప్రత్యేక పాలసీని (2025-30) తీసుకురావడం, రూ.100 కోట్ల నోబెల్ బహుమతి రివార్డు ప్రకటించడం వంటి సాహసోపేతమైన చర్యలు ఈ రంగం పట్ల ప్రభుత్వానికి ఉన్న విజన్‌ను, చిత్తశుద్ధిని స్పష్టం చేస్తాయి. ఈ టెక్నాలజీ ద్వారా రాష్ట్రపాలనలో కూడా పారదర్శకతను, వేగాన్ని పెంచే అవకాశంఉంది. స్టార్టప్ సంస్కృతికి ఇది కొత్త ఊపిరి పోస్తుంది. తద్వారా స్థానిక యువత పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు అద్భుతమైన వేదిక లభిస్తుంది. మొత్తానికి, క్వాంటం, బయోఫౌండ్రీల స్థాపన ఆంధ్రప్రదేశ్‌ను రాబోయే దశాబ్దాల్లో ప్రపంచ పటంలో ఒక తిరుగులేని ఇన్నోవేషన్ సెంటర్‌గా నిలబెడుతుంది. ఇంతటి దూరదృష్టితో వ్యవహరిస్తున్న ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి బాటలు వేస్తుంది. ●

# అభివృద్ధి లక్ష్యాల సాధనకు విద్య కీలకం



డా. సునీల్ కుమార్ పోతన

విద్య అనేది మానవ హక్కు, ప్రజా ప్రయోజనం, ప్రజాబాధ్యత. పేదరికం నుండి బయటపడేందుకు విద్య ఒక నిచ్చెన. ఆశాజనకమైన భవిష్యత్తుకు మార్గాన్ని అందిస్తుంది. శాంతి, అభివృద్ధికి విద్య పాత్రను గుర్తిస్తూ జనవరి 24ని అంతర్జాతీయ విద్యా దినోత్సవంగా ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం ప్రకటించింది. విద్యా హక్కును మానవ హక్కుల సార్వత్రిక ప్రకటనలోని ఆర్టికల్26లో పొందుపరిచారు. ఉచిత, తప్పనిసరి ప్రాథమిక విద్యను అందరికీ అందించాలి. సెప్టెంబర్ 2015లో సుస్థిర అభివృద్ధి 2030 ఎజెండాను స్వీకరించినప్పుడు 17 లక్ష్యాల విజయానికి విద్య అవసరమని అంతర్జాతీయ సమాజం గుర్తించింది. ముఖ్యంగా సుస్థిర అభివృద్ధి లక్ష్యం 4 ప్రకారం 2030 నాటికి అందరికీ సమగ్రమైన, సమానమైన నాణ్యమైన విద్యను అందించాలి. జీవితాంతం నేర్చుకునే అవకాశాలను ప్రోత్సహించాలి. పెరుగుతున్న ప్రపంచీకరణ, సాంకేతికత ఆధారిత ప్రపంచంలో అభివృద్ధి చెందడానికి అవసరమైన ప్రాథమిక నైపుణ్యాలతో యువకులను సన్నద్ధం చేయాలి. భారతదేశంలో, అక్షరాస్యత రేటు దశాబ్దాలుగా గణనీయమైన మెరుగుదలలను చూపించింది. కానీ, సవాళ్లు అలాగే ఉన్నాయి. ముఖ్యంగా విద్యా వనరులు, అవకాశాల సమాన పంపిణీలో అంతరాలు ఉన్నాయి. యువతకు సార్వత్రిక అక్షరాస్యత, సంఖ్యా సామర్థ్యాన్ని సాధించే మార్గం ప్రాంతీయ అసమానతలు, సామాజిక, ఆర్థిక అంశాలు, లింగ ఆధారిత అడ్డంకులు వంటి అనేక సంక్లిష్టతలతో నిండి ఉంది. ఐక్యరాజ్యసమితి అంచనా ప్రకారం ప్రపంచవ్యాప్తంగా దాదాపు 244 మిలియన్ల మంది పిల్లలు, కౌమారదశలో ఉన్నవారు పాఠశాలకు దూరంగా ఉన్నారు. 617మిలియన్ల మంది పిల్లలు, కౌమారదశలో ఉన్నవారు ప్రాథమిక గణితాన్ని చేయలేకపోతున్నారు. సబ్‌సహారా ఆఫ్రికాలో 40శాతం కంటే తక్కువ మంది బాలికలు లోయర్ సెకండరీ పాఠశాల పూర్తి చేస్తున్నారు. పాఠశాలకు దాదాపు నాలుగు మిలియన్ల మంది పిల్లలు, యువ శరణార్థులు దూరంగా ఉన్నారు. భారత జాతీయ గణాంక కార్యాలయం, గణాంకాలు కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ తాజా డేటా ప్రకారం భారతదేశంలో 15-24 సంవత్సరాల వయస్సు గల యువత అక్షరాస్యత రేటు గ్రామీణ ప్రాంతాల్లో 94.17శాతం, పట్టణప్రాంతాల్లో98.03 శాతంగా ఉంది. జాతీయ నమూనా సర్వే 2020-21 ప్రకారం భారతదేశంలో మొత్తం అక్షరాస్యతరేటు 74.04శాతం. యువత అక్షరాస్యత రేటులో గణనీయమైన మెరుగుదల



ఉంది. కానీ, లింగ అసమానతలు కొనసాగుతున్నాయి. పురుషుల అక్షరాస్యత 95.4 శాతం ఉండగా, స్త్రీ అక్షరాస్యత 92.6 శాతం ఉంది. రాష్ట్రాల వారీగా వైవిధ్యాలు కూడా స్పష్టంగా కనిపిస్తున్నాయి. జాతీయ సగటు గణనీయమైన ప్రాంతీయ వ్యత్యాసాలను సూచిస్తోంది. కేరళ, హిమాచల్ ప్రదేశ్, ఢిల్లీ వంటి రాష్ట్రాలు అక్షరాస్యత రేట్లను 100 శాతానికి దగ్గరగా నివేదిస్తున్నాయి. కేరళ (99శాతం), ఢిల్లీ (98 శాతం) వంటి రాష్ట్రాలు దాదాపు సార్వత్రిక అక్షరాస్యతను నివేదిస్తుండగా, భారతదేశంలోని ఈశాన్య, మధ్య ప్రాంతాలలోని బీహార్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాలు ఇప్పటికీ వారి యువ జనాభాలో తక్కువ అక్షరాస్యత రేటుతో ఇబ్బంది పడుతున్నాయి. అదనంగా షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, ఇతర వెనుకబడిన తరగతులు సహా అట్టడుగు వర్గాలలో అక్షరాస్యత స్థాయిలు జాతీయ సగటు కంటే తక్కువగా ఉన్నాయి. ఈ గణాంకాలు లోతుగా పాతుకుపోయిన సామాజిక, ఆర్థిక అసమానతలను ప్రతిబింబిస్తోన్నాయి. భారతదేశ విస్తారమైన భౌగోళిక, సామాజికఆర్థిక వైవిధ్యం విద్యలో గణనీయమైన ప్రాంతీయ అసమానతలకు దోహదం చేస్తుంది. పట్టణ ప్రాంతాల్లో, మెరుగైన మౌలిక సదుపాయాలు, నాణ్యమైన పాఠశాలలకు ప్రాప్యత, మరింత ప్రభావవంతమైన పాలన కారణంగా యువత అక్షరాస్యత రేటు సాపేక్షంగా ఎక్కువగా ఉంది. దీనికి విరుద్ధంగా, గ్రామీణ ప్రాంతాలు, ముఖ్యంగా మారుమూల, అభివృద్ధి చెందని ప్రాంతాలలో పేలవమైన పాఠశాల మౌలిక సదుపాయాలు, శిక్షణ పొందిన ఉపాధ్యాయులకు పరిమిత ప్రాప్యత, డిజిటల్ వనరుల కొరత వంటి సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. గ్రామీణ, మారుమూల ప్రాంతాలలో నాణ్యమైన విద్యను అందించే సవాలు రవాణా వంటి సమస్యలతో కూడుకున్నది. గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ తాజా డేటా ప్రకారం గ్రామీణ యువతలో అక్షరాస్యత రేటు సుమారు 90శాతం, పట్టణ యువతలో ఇది దాదాపు 98 శాతం. భారతదేశంలో సార్వత్రిక యువత అక్షరాస్యతను సాధించడంలో అత్యంత ముఖ్యమైన సవాళ్లలో ఒకటి. సామాజిక, ఆర్థిక అంతరం. పేదరికం విద్యకు ఒక ముఖ్యమైన అవరోధంగా కొనసాగుతోంది. ఎందుకంటే అనేక కుటుంబాలు, ముఖ్యంగా గ్రామీణ, అట్టడుగు వర్గాలలో, పాఠశాల విద్యకు సంబంధించిన ఖర్చులను భరించలేవు. విద్య ఉచితంగా ఉన్నప్పటికీ, యూనిఫాంలు, పుస్తకాలు, రవాణా వంటివి పిల్లలను పాఠశాలకు పంపే పరోక్ష ఖర్చులు తక్కువ ఆదాయ కుటుంబాలకు భారమే. ఈ ఆర్థికభారం తరచుగా ముఖ్యంగా బాలికలు, వెనుకబడిన నేపథ్యాలనుండి వచ్చిన పిల్లలలో అధిక డ్రాపౌట్ రేట్లకు దారితీస్తుంది. సార్వత్రిక అక్షరాస్యతను సాధించడంలో లింగ అసమానతమరొక ప్రధాన సవాలు. ఇటీవలి సంవత్సరాలలోఅక్షరాస్యతలోలింగ అంతరం తగ్గినప్పటికీ, ముఖ్యంగా గ్రామీణ, సాంప్రదాయిక ప్రాంతాలలో బాలికలు ఇప్పటికీ విద్యకు గణనీయమైనఅడ్డంకులను ఎదుర్కొంటున్నారు. సామాజిక నిబంధనలు, బాల్య వివాహం, గృహ బాధ్యతలు, భద్రతాసమస్యలు అన్నీ బాలికలు తమ విద్యను పూర్తి చేయకుండా నిరోధిస్తున్నాయి. నేషనల్ శాంపిల్ సర్వేఆఫీస్ డేటా ప్రకారం, భారతదేశంలో యువతులలో అక్షరాస్యత రేటు దాదాపు 92శాతంఉండగా, యువకులలో ఇది దాదాపు 96 శాతం ఉంది. ●



# కేరళలో మార్పు అనివార్యం

- రాబోయే ఎన్నికలు రాష్ట్ర దిశను మారుస్తాయి
- మునిసిపల్ ఎన్నికల్లో బిజెపి విజయమే తార్కాణం
- ఎల్‌డిఎఫ్, యుడిఎఫ్‌ల అవినీతిని అంతం చేస్తాం
- శబరిమల పసిడి దొంగతనంపై విచారణ జరిపిస్తాం
- తిరువనంతపురం సభలో ప్రధాని మోడీ

**తిరువనంతపురం, జనవరి 23:** "కేరళలో ఎల్‌డిఎఫ్, యుడిఎఫ్ పక్షాలను మాత్రమే చూశారు. ఈ రెండు పక్షాలు వంతుల వారీగా కేరళను నాశనం చేశాయి. కానీ మూడవ పక్షం కూడా ఉంది. అది అభివృద్ధి, సుపరిపాలన పక్షం. అది బిజెపి పక్షం" అని ప్రధానమంత్రి నరేంద్రమోడీ పేర్కొన్నారు. కేరళలో మార్పు అనివార్యం. తిరువనంతపురం మునిసిపల్ ఎన్నికల్లో బిజెపి సాధించిన విషయాన్ని గుర్తుచేస్తూ, రాబోయే ఎన్నికలు కేరళ పరిస్థితిని, దిశను మారుస్తాయని మోడీ ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం తిరువనంతపురంలో నిర్వహించిన సభలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ మాట్లాడుతూ, కేరళలోని 'వామపక్ష వ్యవస్థ'పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఎల్‌డిఎఫ్, యుడిఎఫ్‌ల అవినీతిని బీజేపీ అంతం చేస్తుందని ఆయన అన్నారు, ఎల్‌డిఎఫ్, యుడిఎఫ్‌లపై అవినీతి, దుర్పరిపాలన, బుజ్జగింపు రాజకీయాల చూస్తూ పబ్బంగడుపుకుంటున్నాయని తీవ్రస్థాయిలో ఆరోపణలు గుప్పించారు. సిపిఎం నేతృత్వంలోని ఎల్‌డిఎఫ్, కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ కేరళలోని రెండు ప్రధాన కూటములు కాగా, క్షేత్రస్థాయిలో తన ఎదుగుదలతో ఉత్సాహంగా ఉన్న బిజెపి మూడవ ప్రత్యామ్నాయంగా ఆవిర్భవిస్తోందన్నారు. "ఎల్‌డిఎఫ్, యుడిఎఫ్‌లకు వేర్వేరు జెండాలు ఉన్నప్పటికీ, అజెండా ఒక్కటే. పూర్తి అవినీతి, జవాబుదారీతనం. పూర్తి మతతత్వం, సున్నా బాధ్యత. ఐదు లేదా పదేళ్ల తర్వాత తాము అధికారంలోకి వస్తామని వారికి తెలుసు. ప్రభుత్వం మారుతుంది, కానీ వ్యవస్థ మారదు. ఇప్పుడు మీరు ప్రజల పక్షాన, అభివృద్ధి పక్షాన నిలబడే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలి. బిజెపి- ఎన్‌డిఎ అది చేసి చూపిస్తాయి" అని ప్రధాని మోడీ అన్నారు. కేరళ ఆకాంక్షలు స్పష్టంగా కనిపిస్తున్నాయని, రాష్ట్ర ప్రజలకు బిజెపిపై నమ్మకం ఉందని ఆయన అన్నారు. "కేరళ ప్రజలు బిజెపిపై అపారమైన నమ్మకం ఉంచి మాతో చేతులు కలిపారు. బిజెపి విజయం సాధారణమైనది కాదు; ఇది చారిత్రాత్మకమైనది, అపూర్వమైనది. తిరువనంతపురం కేరళలో బిజెపికి పునాది వేసింది. తిరువనంతపురంలో, బిజెపికి సేవ చేసే అవకాశాన్ని ఇచ్చారు" అని ఆయన అన్నారు. శబరిమల ఆలయంలో జరిగిన బంగారం దొంగతనంపై ప్రధాని మోడీ స్పందిస్తూ ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం ఆలయ సంప్రదాయాలను బలహీనపరుస్తోందని ఆరోపించారు, ఈ విషయంపై విచారణ జరిపించడం "మోడీ హామీ" అని పేర్కొన్నారు. కేరళకు కాంగ్రెస్ ద్రోహం చేసిందని ఆరోపిస్తూ, ఎన్‌డిఎ అధికారంలోకి వస్తే డబుల్ ఇంజిన్ ప్రభుత్వం వల్ల రాష్ట్రానికి ప్రయోజనం చేకూరుతుందని ఆయన అన్నారు. "కాంగ్రెస్ మావోయిస్టుల కంటే ఎక్కువ కమ్యూనిస్టుగా, ముస్లిం లీగ్ కంటే ఎక్కువ మతతత్వ పార్టీగా మారింది. ఈ పవిత్ర భూమిని వారి నుండి మనం కాపాడాలి" అని ప్రధాని మోడీ పిలుపునిచ్చారు. బిజెపిని అధికారంలోకి తీసుకురావాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, "కేరళకు కొత్త రాజకీయాలు అవసరం. రాబోయే 25 ఏళ్లలో, అభివృద్ధి చెందిన కేరళను నిర్మించడానికి బిజెపికి నిర్ణయాత్మకమైన తీర్పు అవసరం. ఇప్పుడు 'వికసిత కేరళం'కు సమయం ఆసన్నమైంది. ఇప్పుడు ఎన్‌డిఎ ప్రభుత్వానికి సమయం ఆసన్నమైంది,"అని ఆయన అన్నారు. ఇదిలా ఉండగా, జనసమూహంలో ఒక బాలుడు తన చిత్రపటాన్ని పట్టుకుని ఉండటాన్ని చూసి, దానిని తన తరపున స్వీకరించమని తన భద్రతా సిబ్బందిని కోరారు. ఆ చిత్రపటం వెనుక తన చిరునామా రాయమని ఆ బాలుడిని కోరి, అతనికి ఉత్తరం రాస్తానని హామీ ఇచ్చారు.



# కాశ్మీర్‌ను ముంచెత్తిన మంచువాన

## పర్యాటకులకు కనువిందుచేస్తున్న స్నోఫాల్

**శ్రీనగర్, జనవరి 23:** శీతాకాలం అంటే కశ్మీర్‌లో మంచు కురవాల్సిందే. కానీ గత మూడు నెలల నుంచి కశ్మీర్ లోయల్లో మంచు కురవలేదు. దీంతో అక్కడ టూరిజం ఇండస్ట్రీ దివాళా తీసింది. స్కీయింగ్‌కు గుల్మార్గ్ ఫేమస్. కానీ అక్కడ కొన్ని నెలల నుంచి మంచు ఆనవాళ్లే లేవు. హిమాలయాల్లో చాలా వరకు పర్వతాలు ఈ శీతాకాలంలో మంచు లేకుండానే దర్శనం ఇచ్చాయి. మంచు కరువుతో నిండిన ఆ ప్రాంతంలో రెండురోజులనుంచి పరిస్థితులు మారిపోయాయి. మధ్యప్రాచ్యం పరిణామాలతో అకస్మాత్తుగా ఇప్పుడు కశ్మీర్‌తో పాటు అనేక ప్రాంతాల్లో మంచు, వర్షం కురుస్తున్నది. దీంతో అనేక టూరిస్టు కేంద్రాలు ఇప్పుడు స్నోఫాల్‌తో ఆకట్టుకుంటున్నాయి. జమ్మూ జిల్లాలోని హిల్ రిసార్ట్ బటోట్ పట్టణంలో ఇవాళ భారీగా మంచు కురిసింది. హిమాచల్ ప్రదేశ్‌లోని షిమ్లాలో కూడా ఇవాళ మంచు భీకరంగా కురిసింది. జమ్మూకశ్మీర్‌లోని రాంబన్‌లో దట్టంగా మంచుపడింది. ధర్మశాలలో స్వల్ప స్థాయిలో వర్షం కురిసింది. కశ్మీర్‌లోని బదేర్వా వీధులన్నీ మంచుతో నిండిపోయాయి. అందాలతో కవ్వింపు చేసే ఈ ప్రాంతంలో చాన్నాళ్ల తర్వాత మంచు పడింది. దీంతో ఇక్కడ ఉష్ణోగ్రతలు కూడా పడిపోయాయి. కొండ ప్రాంతాలకు వెళ్లే వారి కోసం బదెర్వా పోలీసులు హెల్ప్‌లైన్ నెంబర్లు జారీ చేశారు. మూడు నెలల తర్వాత దోడాలోని కొండ, లోయ ప్రాంతాల్లో మంచుపడినట్లు స్థానికులు చెబుతున్నారు. ఎంతోకాలం ఎదురుచూసిన స్నో రావడంతో స్థానికులు సంతోషపడ్డారు. బుద్గాం జిల్లాలోనూ తాజాగా మంచు కురిసింది. అనంతనాగ్ జిల్లాలో కూడా ఫ్రెష్‌గా స్నోఫాల్ నమోదు అయ్యింది. దీంతో అక్కడ ల్యాండ్‌స్కేప్ మారిపోయింది. షిమ్లాతో పాటు చంబా, కులు, లాహుల్, స్పిటి, కంగ్రా ప్రాంతాల్లో మంచు కురిసింది. రియాసీ ప్రాంతంలో కూడా మంచు పడింది. పవిత్ర వైష్ణోదేవి క్షేత్రం ఇప్పుడు స్నోతో నిండిపోయింది. దీంతో త్రికూట పర్వతం ఆకర్షణీయంగా కనిపిస్తున్నది. యాత్రికులు తమ ట్రిప్‌ను ఫుల్ ఎంజాయ్ చేస్తున్నారు. ఉత్తరాది రాష్ట్రాలను మంచు వర్షం కురిపిస్తుంటే దేశరాజధాని నగరం ఢిల్లీలో వర్షం కురిసింది. నరేలా, బవానా, అలిపుర్, బురారి, ఖాంజావాలా, రోహిణి, బద్లీ, మోడల్ టౌన్, ఆజాద్‌పూర్, పీతంపుర, ముండ్కా, పశ్చిమ్, విహార్, పంజాబీ బాగ్, రాజౌరి గార్డెన్, జాఫర్‌పుర్, నజాఫ్‌ఘర్, ద్వారక ప్రాంతాల్లో వర్షం పడనున్నది. అతిశీతల గాలులు కూడా వీయనున్నాయి. వర్షం వల్ల ఢిల్లీతో పాటు సమీప ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు మరింత పడిపోనున్నాయి. తెల్లవారుఝామునుంచి కూడా ఒక మోస్తరు వర్షం కురిసినట్లు వాతావరణశాఖ ప్రకటించింది.

# కెనడా ఆహ్వానాన్ని వెనక్కి తీసుకున్న అమెరికా


**దావోస్, జనవరి 23:** గాజా శాంతి మండలిలో చేరాలంటూ కెనడాకు పంపిన ఆహ్వానాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెనక్కి తీసుకున్నారు. తన నిర్ణయాన్ని ట్రంప్ తన సొంత సోషల్ మీడియా ట్రూత్‌లో వెల్లడించారు. ఇప్పటివరకు ఏర్పడిన ప్రతిష్ఠాత్మక బోర్డులలో గాజా శాంతి మండలి కూడా ఒకటని ట్రంప్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. కెనడా ప్రధాని మార్క్ కార్నీ దావోస్ వేదికగా అమెరికా గ్రీన్‌లాండ్ సుంకాలను వ్యతిరేకించడంతో ట్రంప్ ఈ ఆహ్వానాన్ని ఉపసంహరించుకున్నారు. దావోస్‌లో జరిగిన సమావేశంలో మార్క్ కార్నీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అమెరికా ఆధిపత్యంలో ప్రపంచం పరివర్తన దిశగా కాకుండా విచ్ఛిన్నం వైపు పయనిస్తోందని ఆయన అన్నారు. ఒకప్పుడు భాగస్వామ్య దేశాల శ్రేయస్సు కోసం చేసుకున్న ఆర్థిక ఒప్పందాలను ఇప్పుడు అగ్రస్థానంలో ఉన్న దేశం ఆయుధంగా ఉపయోగించుకుంటోందని విమర్శించారు. బలవంతులు తమ సొంత ప్రయోజనాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆయన ఆరోపించారు. అందులో భాగంగానే ఇష్టానుసారంగా వాణిజ్య నియమాలను అమలు చేస్తున్నారని ఆయన విమర్శించారు.

# జపాన్ పార్లమెంటు రద్దు

## ముందస్తు ఎన్నికలకు ప్రధాని తకాయిచీ ఎల్డీపి పార్టీ!

**టోక్యో,జనవరి 23:** జపాన్‌ప్రధాని సానే తకాయిచీ పార్లమెంటు దిగువసభను రద్దుచేసారు. శుక్రవారం ఆమె రద్దుచేస్తున్నట్లు ప్రకటించడంతో ఫిబ్రవరి 8వ తేదీనే పార్లమెంటు ముందస్తు ఎన్నికలకు జపాన్ వెళుతోంది. ఇటీవలి కాలంలో సంభవించిన భారీ నష్టాలనుంచి రికవరీ కావడం, మరోపక్క ఆమె పాపులారిటీని అదేస్థాయిలో కొనసాగిస్తూ ప్రజల్లో పట్టును మెరుగుపరుచుకునేందుకు ముందస్తు ఎన్నికలకు వస్తున్నట్లు తెలుస్తోంది. జపాన్ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం సతమతం అవుతోంది. దీనికితోడు నిత్యావసరాల ధరలు కూడా భారీగాపెరిగాయి. గత ఏడాది అక్టోబరులోనే సానే తకాయిచి జపాన్ మొదటిమహిళాప్రధానమంత్రిగా ఎన్నికయ్యారు. కేవలంమూడునెలలు మాత్రమే ఆమె ప్రధానిగా కొనసాగారు. అయితే ఆమెకు ప్రజల్లోను, రాజకీయపార్టీల్లోకూడా 70శాతం ఆమోదం లభించింది. తకాయిచి లిబరల్ డెమొక్రటిక్‌పార్టీ ఇకపై కొన్ని అవినీతి కుంభకోణాలు కూడా ఎదుర్కొనాల్సి వస్తోంది. వివాదాస్పదమైన యూనిఫికేషన్ చర్చ్ పరంగా పార్టీకి ఉన్న సంబంధాలపై విమర్శలు హోరెత్తాయి. విపక్ష పార్టీలనుంచి అధికార ఎల్డీపీకి ఇదే పెద్ద సమస్యగా ఎదురవుతుందని రాజకీయ పండితులు చెపుతున్నారు. అలాగే తైవాన్‌పై చైనా అనుసరిస్తున్న వైఖరిపై తకాయిచి ప్రతికూల వ్యాఖ్యలుచేసారు. అప్పటినుంచి కూడా చైనాతో శతృత్వం ఎదుర్కొంటూనే ఉన్నారు. అలాగే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ రక్షణ వ్యయం పెంచాలన్న ఒత్తిడి తెస్తున్నారు. ఎందుకంటే అమెరికాతోపాటు చైనా కూడా ఆసియా పసిఫిక్‌ప్రాంతంలో రక్షణ వ్యయాన్ని మరింతగా పెంచుతున్నందున జపాన్‌కూడా పెంచాలని ట్రంప్ ఒత్తిడిని పెంచారు. ఈ ప్రాంతంలో ఆధిపత్యం కోసం ఇపుడు చైనా, అమెరికాలు పోటీపడుతున్న సంగతి తెలిసిందే. 465 మంది సభ్యులున్న దిగువసభ ఎన్నికలకోసం 12 రోజులు ప్రచార గడువు ఉంది. మంగళవారం నుంచి పార్టీప్రచారం చేస్తుంది. హౌస్ స్పీకర్ ఫుకుషిరో నుకాగా పార్లమెంటును రద్దుచేసినట్లుప్రకటించిన వెంటనే ఎంపిలు లేచి నిలుచుని లాంగ్‌లివ్ అంటూ మూడుసార్లు నినాదాలుచేసారు.

# నేతాజీ అస్థికలు తెచ్చేందుకు భారతీయులు మద్దతివ్వండి!



## నేతాజీ కుమార్తె అనితాబోస్ విజ్ఞప్తి

**న్యూఢిల్లీ, జనవరి 23:** స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోసు 129వ జయంతిని ఇవాళ జరుపుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయన కుమార్తె అనితా బోసు ఓ డిమాండ్ చేశారు. టోక్యోలోని రెంకోజీ ఆలయంలో ఉన్న సుభాష్ చంద్రబోసు అస్తికలను తీసుకువచ్చేందుకు భారతీయులు మద్దతు ఇవ్వాలని ఆమె కోరారు. భారత స్వాతంత్ర్యం కోసం పోరాడిన నేతాజీ ఎక్కువ కాలం దేశం బయటే ఉన్నట్లు అనితా తెలిపారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో సింగపూర్‌లో ఉన్న నేతాజీ తైపేయిలో జరిగిన విమాన ప్రమాదంలో మరణించినట్లు భావిస్తున్నారు. అయితే ఆయన అస్తికలను జపాన్‌కు తీసుకెళ్లినట్లు అనుమానిస్తున్నారు. కనీసం ప్రాణాలు పోయిన తర్వాత అయినా నేతాజీ సుభాష్ చంద్రబోసుకు మరణానంతర గౌరవం దక్కాలని అనిత అభిప్రాయపడ్డారు. సక్రమ రీతిలో అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు ఆ అస్తికలను ఇండియాకు తీసుకురావాలని ఆమె కోరారు. జర్మనీలో ఉంటున్న నేతాజీ కుమార్తె ఓ స్టేట్మెంట్ రిలీజ్ చేశారు. మరణానంతర గౌరవం దక్కేందుకు భారతీయులు నేతాజీ అస్తికల కోసం పోరాటం చేయాలని ఆమె అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.



## దివ్యాంగులకోటా వైద్యసీటు కోసం పాదం నరుక్కున్న యువకుడు

**జౌన్‌పూర్(యుపి),జనవరి 23:** డాక్టర్‌ని కావాలని కలలుకనే విద్యార్థి ఒకరు దివ్యాంగుల కోటాలో సీటు సాధించాలని ఏకంగా తన పాదాన్నే నరుక్కున్నాడు. నీట్‌ప్రవేశపరీక్ష రాసి విఫలం కావడంతో దివ్యాంగుల కోటాలో తేలిగ్గా సీటు పొందవచ్చని భావించి ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. అయితే ఆతడి ప్రయత్నం బెడిసి కొట్టి పోలీసు కేసును ఎదుర్కొంటున్నాడు. యుపిలోని జౌన్‌పూర్‌కుచెందిన సూరజ్‌భాస్కర్ అనే 20 ఏళ్ల విద్యార్థి తీవ్రంగా గాయపడి ఆసుపత్రికి చేరాడు. గుర్తు తెలియని వ్యక్తులు దాడిచేసి పారిపోయారని పాదం తెగిపోయి అపస్మారక స్థితికి వెళ్లిపోయాడని ఆతడి సోదరుడు స్థానిక పోలీసులకు ఫిర్యాదుచేసాడు.

### ప్రభుత్వరంగ బీమాసంస్థలు, నాబార్డు సంస్థల

# ఉద్యోగులకు వేతనం పెంపు

## ఆర్బీఐ రిటైర్డ్ ఉద్యోగులకు కూడా పింఛన్‌పెంపు

## 46వేలమందికిపైగా ఉద్యోగులకు బెనిఫిట్.. ఆర్థికశాఖ ఆమోదం

**న్యూఢిల్లీ,జనవరి 23:** ప్రభుత్వరంగ బీమా కంపెనీలు, నాబార్డు సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం వేతన రివిజన్‌ను ప్రకటించింది. వీరితోపాటే రిజర్వుబ్యాంకు, నాబార్డుల్లోని రిటైర్ అయిన ఉద్యోగులకు కూడా పింఛన్ రివిజన్‌చేసేందుకు ఆమోదం తెలిపింది. ప్రభుత్వరంగ బీమాసంస్థల్లోని ఉద్యోగులకు ఈ వేతన సవరణ అమలు 2022 ఆగస్టు ఒకటినుంచి వర్తింపచేస్తోంది. మొత్తంగా వేతన పెంపు 12.41శాతంగాను 14శాతం వరకూ ఉంటుంది. ప్రస్తుతం ఉన్న మూల వేతనం, కరువుభత్యాలపై ఈ శాతం వర్తిస్తుంది. దీనివల్ల 43,247 మంది ప్రభుత్వరంగ జనరల్ బీమా ఉద్యోగులకు ఎంతోమేలు జరుగుతుంది. అలాగే ఎన్పీఎస్ కంట్రిబ్యూషన్ పదినుంచి 14శాతానికి పెంచింది. దీనివల్ల ఉద్యోగులకు మంచి భవిష్యత్తు కలుగుతుందని, 2020 ఏప్రిల్ ఒకటవతేదీనుంచి ఈ వర్తింపు అమలవుతుందని వెల్లడించింది. ఇక కుటుంబ పింఛన్ రివిజన్‌ను ఏకీకృత రేట్ 30శాతంగా ఉంచింది. అధికార గజెట్‌లో ప్రచురించిన తేదీనుంచి ఈ పింఛన్ వర్తింపు అమలవుతుంది. దీనివల్ల 14,615 మంది కుటుంబ పింఛన్‌దారులకు మేలుజరుగుతుంది. ప్రస్తుతం 15,582 మంది కుటుంబపింఛన్ పొందుతున్నవారున్నారు. ప్రభుత్వరంగ బీమా సంస్థల్లో నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ, న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ, ఓరియంటల్ బీమా కంపెనీ, యునైటెడ్ బీమా కంపెనీ, జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, వ్యవసాయ బీమా కంపెనీలు ఉన్నాయి. ఇక నాబార్డు ఉద్యోగులకు 2022 నవంబరు ఒకటవతేదీనుంచి కొత్తవేతన సవరణ అమలవుతుంది. జీతాలు, భత్యాలు 20శాతం వరకూ గ్రూప్ ఎ, బి సి కేటగిరీ ఉద్యోగులందరికీ వర్తిస్తుంది. సుమారు 3800మందికిపైగా ప్రస్తుత, మాజీ ఉద్యోగులకు ప్రయోజనం కలుగుతుంది. ఇక బేసిక్ పింఛన్, కుటుంబపింఛన్‌పరంగా నాబార్డు రిటైర్ ఉద్యోగులకు 2017 నవంబరు 1వ తేదీకి ముందు రిటైర్ అయినవారిని ఇపుడు ఆర్బీఐ, నాబార్డు మాజీ ఉద్యోగులతో సమానంగా పరిగణిస్తారు. ఇక రిజర్వుబ్యాంకు రిటైర్డ్ ఉద్యోగులకు కూడా పింఛన్ సవరణలుచేసింది. కుటుంబ పింఛన్ బేసిక్ పింఛన్‌పై 10శాతం పెరిగింది. వీటితోపాటు కరువుభత్యం కూడా ఉంటుంది. 2022 నవంబరు 1వ తేదీనుంచి ఈ పెంపు అమలవుతుంది. ఈ పెంపు మొత్తం 30,769 మందికి లబ్దిచేకూరుతుంది. వీరిలో 22,580 మంది పింఛన్‌దారులు, 8189 మంది కుటుంబపింఛన్‌దారులు కూడా ఉన్నారు. ఈ వేతన సవరణలవల్ల మొత్తంగా 46,322 మంది ఉద్యోగులకు మేలు జరుగుతోంది. 23,570 మంది పెన్షనర్లు, 23,260 మంది కుటుంబ పెన్షనర్లు కూడా ఈ వేతన సవరణతో భారీ ప్రయోజనం పొందుతున్నట్లుత ఆర్థిక మంత్రిత్వశాఖ ప్రకటించింది.

# ఖలిస్థాన్ నేత పన్ను విడియోతో దేశరాజధానిలో హై అలర్ట్!

**న్యూఢిల్లీ,జనవరి 23:** దేశ రాజధానిలో గణతంత్ర దినోత్సవ వేడుకలు సమీపిస్తున్న తరుణంలో శాంతి, భద్రతలకు విఘాతం కలిగించేలా బెదిరింపులకు పాల్పడుతున్న ఖలిస్థానీ ఉగ్రవాదిపై ఢిల్లీ పోలీసులు యాక్షన్ తీసుకున్నారు. ముఖ్యంగా భారత సార్వభౌమత్వానికి భంగం కలిగించేలా వ్యవహరిస్తున్న సిక్కు ఫర్ జస్టిస్ (ఎస్ఎఫ్‌జె) నేత గురుపత్వంత్ సింగ్ పన్నూపై ఢిల్లీ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. అసలు గొడవ పన్నూ సోషల్ మీడియా వేదికగా విడుదల చేసిన ఓ ఆడియోతో మొదలైంది. ఢిల్లీలోని రోహిణి, దాబ్రి వంటి ప్రాంతాల్లో తమ స్లీపర్ సెల్స్ ద్వారా ఖలిస్థానీ అనుకూల పోస్టర్లు అతికించామని పన్నూన్ ప్రగల్భాలు పలికాడు. పోలీసులు ఆ ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేయగా ఎక్కడా అలాంటి పోస్టర్లు కనిపించలేదు. కేవలం భయాందోళనలు సృష్టించేందుకే అతడిలా చేశాడని గుర్తించిన అధికారులు అతడిపై చర్యలకు దిగారు. ఈక్రమంలోనే భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్లు 196, 197, 152, 61 కింద అతనిపై కేసులు నమోదు చేశారు. ఒకవైపు భారత్‌లో బెదిరింపులు చేస్తూనే మరోవైపు అంతర్జాతీయంగా భారత రాయబార కార్యాలయాలే లక్ష్యంగా ఖలిస్థానీ శక్తులు రెచ్చిపోతున్నాయి. జనవరి 22వ తేదీన క్రొయేషియా రాజధాని జాగ్రెబ్‌లోని భారత రాయబార కార్యాలయంలోకి కొందరు ఖలిస్థానీ మద్దతుదారులు అక్రమంగా చొరబడి భారత జాతీయ పతాకాన్ని తొలగించి, అక్కడ ఖలిస్థానీ జెండాను ఎగురవేసేందుకు ప్రయత్నించారు.

# భోజ్‌శాలలో సరస్వతీపూజలు!

## అదే సమయంలో ముస్లింల ప్రార్థనలు



**ఇండోర్, జనవరి 23:** సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారమే ఇవాళ మధ్యప్రదేశ్‌లోని దార్ జిల్లాలో ఉన్న 11వ శతాబ్ధం నాటి భోజ్‌శాల కమల్ మోలా మసీదు కాంప్లెక్స్‌లో వసంత పంచమి పూజలు నిర్వహించారు. భారీ భద్రత మధ్య పూజా కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. భక్తులు భారీ సంఖ్యలో ఆ పూజలో పాల్గొన్నారు. సుమారు 8 వేల మంది పోలీసు, పారామిలిటరీ భద్రత ఏర్పాటు చేశారు. వివాదస్పదమైన భోజ్‌శాలకమల్ మోలా మసీదులో హిందువులు శుక్రవారం రోజు మొత్తం సరస్వతీ దేవి పూజలు చేసుకోవచ్చు అని గురువారం సుప్రీంకోర్టు తన ఆదేశాల్లో పేర్కొన్నది. అయితే మధ్యాహ్నం వేళలో ముస్లింలు కూడా ప్రార్థనలు చేసుకోవచ్చు అని కోర్టు తీర్పు చెప్పిన విషయం తెలిసిందే. భోజ్ ఉత్సవ కమిటీ ఇవాళ సరస్వతీదేవి విగ్రహాన్ని ప్రతిష్టించిన ప్రత్యేక పూజలు చేశారు. వేదిక మంత్రాల మధ్య అఖండ పూజ నిర్వహించారు. భారీ భద్రత మధ్య పూజలు సజావుగా సాగుతున్నాయని జిల్లా మెజిస్ట్రేట్ ప్రియాంక్ మిశ్రా తెలిపారు.

# సంక్షిప్తంగా..

## మిన్నెసోటాలో ఐదేళ్ల బాలుడి అరెస్టు



**సెయింట్‌పాల్‌సిటీ, జనవరి 23:** అమెరికాలో ఐదేళ్ల బాలుడిని ఇమ్మిగ్రేషన్ అధికారులు అదుపులోకి తీసుకోవడం తీవ్ర వివాదాస్పదంగా మారింది. మిన్నెసోటా రాష్ట్రంలో ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్ మెంట్ ఏజెంట్లు ఈ చర్యకు పాల్పడగా, ఈ ఘటనపై రాజకీయంగా పెద్ద దుమారం రేగింది. బాలుడిని ఎరగా వాడుకున్నారని పాఠశాల అధికారులు ఆరోపిస్తుండగా, డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ (డిహెచ్ఎస్) ఈ ఆరోపణలను ఖండించింది. ఈ ఘటనపై అమెరికా మాజీ ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. లియామ్ రామోస్ ఇంకా పసివాడు. అతడిని ఐస్ ఏజెంట్లు ఎరగా వాడటం దారుణం. ఇది నన్ను తీవ్ర ఆవేదనకు గురిచేసిందని ఆమె అన్నారు. అయితే, ఈ ఆపరేషన్‌ను ప్రస్తుత ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సమర్థించారు.

## యావజ్జీవ శిక్ష.. ఖైదీల ప్రేమ పెళ్లి



**జైపూర్; జనవరి 23:** రాజస్థాన్‌లో రెండు సంచలన హత్య కేసుల్లో యావజ్జీవ శిక్ష అనుభవిస్తున్న ఇద్దరు ఖైదీలు పెళ్లితో ఒక్కటవుతున్నారు. జైపూర్‌లోని ఓపెన్ జైల్లో వీరిద్దరి మధ్య ప్రేమ చిగురించగా, పెళ్లి చేసుకునేందుకు కోర్టు అనుమతితో పెరోల్‌పై బయటకు వచ్చారు. అల్వార్ జిల్లా బరోడామేవ్‌లో ఇవాళ వీరి వివాహం జరగనుంది. హనీట్రాప్ చేసి దుష్యంత్ శర్మ అనే వ్యక్తిని హత్య చేసిన కేసులో ప్రియ సేథ్ (33) యావజ్జీవ శిక్ష అనుభవిస్తోంది. మరోవైపు 2017లో అల్వార్‌లో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురిని దారుణంగా హత్య చేసిన కేసులో హనుమాన్ ప్రసాద్ అలియాస్ జాక్ (32) జీవిత ఖైదీగా ఉన్నాడు. వీరిద్దరినీ ఏడాది క్రితం జైపూర్ సెంట్రల్ జైల్ నుంచి సంగనేర్‌లోని ఓపెన్ జైలుకు మార్చారు. ఓపెన్ జైల్లో వీరి మధ్య పరిచయం ఏర్పడి, ఆరు నెలల క్రితం అది ప్రేమగా మారింది. గత నాలుగు నెలలుగా జైలు ప్రాంగణంలోనే ఇద్దరూ సహజీవనం చేస్తున్నట్లు సమాచారం.

## చీలిపోనున్న ఆఫ్రికా ఖండం!

**న్యూఢిల్లీ,జనవరి 23:** ప్రపంచ పటాన్ని శాశ్వతంగా మార్చివేసేలా ఆఫ్రికా ఖండం చీలిపోతున్నది. తూర్పు ఆఫ్రికాలో భౌగోళిక మార్పులు వేగంగా సంభవిస్తున్నాయి. టెక్టానిక్ ప్లేట్ల (భూమి ఫలకాల) కదలికల వల్ల ఆఫ్రికా ఖండం చీలిపోయి అక్కడ కొత్తగా మరో మహా సముద్రం ఏర్పడబోతున్నట్లు ఇప్పటికే శాస్త్రవేత్తలు ఓ అంచనాకు వచ్చారు. వారు ఊహించిన దాని కంటే వేగం గా ఈ పరిణామం జరుగుతున్నట్లు శాస్త్రవేత్తల అధ్యయనంలో తేలింది. రానున్న 50 లక్షల ఏండ్ల నుంచి కోటి సంవత్సరాల్లో ఈ ప్రక్రియ పూర్తయ్యి భూగోళంపై ఆరవ మహాసముద్రం ఆవిర్భవించే అవకాశం ఉన్నట్టు నాసా, అమెరికా జియోలాజికల్ సర్వే, యూనివర్సిటీ ఆఫ్ రోచెస్టర్ పరిశోధకుల బృందం వెల్లడించింది. ప్రస్తుతం భూమిపై పసిఫిక్, అట్లాంటిక్, హిందూ, ఆర్కిటిక్, దక్షిణ మహా సముద్రాలు ఉన్నాయి.

## కలుషిత నీటితో 24 మందికి అస్వస్థత

**భోపాల్,జనవరి 23:** కలుషిత తాగునీటి కారణంగా 24 మంది అస్వస్థత చెందారు. వీరిలో పిల్లలు కూడా ఉన్నారు. కలుషిత నీరు తాగడంతో కామెర్ల బారినపడి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. కలుషిత తాగు నీటి వల్ల 25 మంది మరణించిన మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ జిల్లాలోనే ఈ సంఘటన జరిగింది. తాజాగా ఆ జిల్లాలోని ఎమ్హౌ ప్రాంతంలో కలుషిత నీరు తాగిన కారణంగా పిల్లలతో సహా సుమారు 24 మంది అనారోగ్యం పాలయ్యారు. కామెర్ల బారిన పడ్డారు. గురువారం రాత్రి పట్టీ బజార్, చందర్ మార్గ్ ప్రాంతాల్లో కామెర్ల కేసులు వెలుగులోకి వచ్చాయి.

పిల్లలతో సహా పలువురు అనారోగ్యానికి గురయ్యారు. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

మోతీ మహల్ ప్రాంతంలో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది.

# ఫోన్ ట్యాపింగ్ బ్రిటీష్ కాలం నుంచే కొనసాగుతోంది

## బిఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జనవరి 23:** ఫోన్ ట్యాపింగ్ అత్యంత గోప్యంగా జరుగుతుందన్న విషయమని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. కానీ దాన్ని రేవంత్ రెడ్డి ప్రభుత్వం బజారున పడేసిందని మండిపడ్డారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ పదేళ్లలో అద్భుతమైన పాలన అందించారని తెలిపారు. కానీ ప్రజలను ఘోరంగా మోసం చేసి కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కిందని విమర్శించారు. రెండేళ్లుగా ప్రజలపై ప్రతీకారం తీర్చుకుంటుందని మండిపడ్డారు. తెలంగాణలోని సంపదను పక్క రాష్ట్రాలు దోచుకుంటున్నాయని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. కాంగ్రెస్ నేతల దోపిడీని, అవినీతిని బీఆర్ఎస్ అడ్డుకుంటుందని అన్నారు. తెలంగాణ రక్షణ కోసం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వీరోచిత పోరాటం చేస్తున్నారని పేర్కొన్నారు.నైనీ బొగ్గు గని దోపిడీని బీఆర్ఎస్ అడ్డుకుందని తెలిపారు. దీంతో కేటీఆర్, హరీశ్‌రావు, ఎమ్మెల్యేలపై కాంగ్రెస్ సర్కార్ అక్రమ కేసులు పెడుతుందని అన్నారు. ఫార్ములా ఈ కేసు, ఫోన్ ట్యాపింగ్ కేసులు పెట్టారని అన్నారు. ప్రజల దృష్టిని మరల్చేందుకు కేసులతో వేధిస్తున్నారని తెలిపారు. కేటీఆర్‌కు సంబంధం లేని కేసులో విచారణకు పిలిచారని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ అనేది చట్ట విరుద్ధం కాదని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. బ్రిటీష్ కాలం నుంచే ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నారని పేర్కొన్నారు. దేశ భద్రత కోసం, ప్రజల రక్షణ, తీవ్రవాదుల దాడులను నిరోధించేందుకు ట్యాపింగ్ చేయవచ్చని చట్టమే చెబుతుందని వివరించారు. ఫోన్ ట్యాపింగ్ నేరం కాదని అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ తెలిపారని గుర్తుచేశారు. ఫోన్లు ట్యాప్ అవుతున్నాయని రతన్ టాటా చెబితే.. 9 వేల ఫోన్లు ట్యాప్ చేశామని మన్మోహన్ సింగే చెప్పారని గుర్తుచేశారు. ప్రతిరోజు కొన్ని మెయిల్స్‌ను కూడా పరిశీలిస్తున్నామని చెప్పారని తెలిపారు.ఫోన్ ట్యాపింగ్ తప్పు కాదని ఢిల్లీ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి కూడా చెప్పారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ నిరంతర ప్రక్రియ అని రేవంత్ రెడ్డి చెప్పారని గుర్తుచేశారు. ఫోన్ ట్యాపింగ్ ప్రక్రియ గోప్యంగా జరుగుతుందని తెలిపారు.హోంమంత్రి, సీనియర్ ఐపీఎస్‌లకు కూడా ఎస్ఐబీ ఎక్కడ ఉంటుందో తెలియదని అన్నారు. ఫలానా విధంగా సమాచారం సేకరించినట్లు ప్రధాని, ముఖ్యమంత్రికి కూడా చెప్పరని తెలిపారు. అందుకే ఢిల్లీలో కూడా ఫోన్ ట్యాపింగ్‌పై చర్చ జరగడం లేదన్నారు. తన రాజకీయ కక్షలకు ట్యాపింగ్‌ను సీఎం రేవంత్ రెడ్డి వాడుకుంటున్నాడని మండిపడ్డారు.ఫోన్ ట్యాపింగ్ దేశ రక్షణ కోసం పోలీసులు చేస్తారు. ఫోన్ ట్యాప్ చేయడం నేరం కాదని.. దేశ రక్షణ కోసం ట్యాపింగ్ చేయవచ్చని నాడు ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు మన్మోహన్ సింగ్ చెప్పిన వీడియోని చూపించారు. అన్ని ప్రభుత్వాలు ఫోన్ ట్యాపింగ్ చేస్తాయి. కానీ దీని మీద ఏ రాష్ట్రంలో కూడా చర్చ జరగడం లేదని దేశ భద్రత రీత్యా ఫోన్ ట్యాపింగ్ నేరం కాదనే విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. ఎన్ని కుట్రలు చేసినా కేటీఆర్‌ను ఏమీ చేయలేరన్నారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన పోరాడుతుందని స్పష్టం చేశారు. రాజకీయ నాయకులను వేధించడానికి ఏర్పాటు చేసిన సిట్‌కు సజ్జనార్ చీఫ్‌గా ఉన్నాడని తెలిపారు. సజ్జనార్ సిట్‌ను లీడ్ చేసే, ట్యాపింగ్ వ్యవహారాన్ని విచారించే నైతిక అర్హత లేదన్నారు. రూ.50లక్షలతో దొరికినప్పుడు సీవీడీ డీసీపీగా కూడా సజ్జనార్ ఉన్నారని.. ఇంటెలిజెన్స్ చీఫ్‌గా ప్రస్తుత డీజీపీ శివధర్ రెడ్డి ఉన్నాడన్నారు. ఆనాడు సజ్జనార్, ఇంకా కొంతమంది అధికారులు తమ ఫోన్లు ట్యాప్ చేశారని ఏపీలో కేసులు ఉన్నాయని తెలిపారు. ఏ అర్హతత ట్యాపింగ్ విచారణ చేస్తున్నారో చెప్పాలని సజ్జనార్‌ను డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో హరీశ్‌రావుపై పెట్టిన కేసు చెల్లదని సుప్రీంకోర్టు చెప్పిందని తెలిపారు. అయినప్పటికీ ఆయన్ను సిట్ విచారణకు పిలిచిందని మండిపడ్డారు. సీనియర్ మంత్రులను 9 గంటల పాటు విచారించాల్సి అవసరం ఏముందని ప్రశ్నించారు.

# ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి

## పెండింగ్ డిఎలను మంజూరు చేయాలి

### మంత్రి పొన్నంకు పిఆర్‌టియు తెలంగాణ విజ్ఞప్తి

**హైదరాబాద్, జనవరి 23, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ సమ స్యలను పరిష్కరించాలని పిఆర్‌టియు తెలంగాణ డిమాండ్ చేసింది. పెం డింగ్‌లో ఉన్న డిఎలను విడుదల చేయాలని బిసి సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సంఘం విజ్ఞప్తి చేసింది. పిఆర్‌సిని ప్రకటించాలని, సిపిఎస్ ఉద్యోగులను చెల్లించాల్సిన బకాయి ఇన్‌స్టాల్ మెంట్లను ఏకకాలంలో చెల్లించాలని శుక్రవారం హైదరాబాద్‌లోని మిన్స్టర్ క్వార్టర్స్ లో జహీరాబాద్ పార్లమెంట్ సభ్యుడు సురేష్ షెట్కార్ ఆధ్వర్యంలో పిఆర్‌టియు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ అబ్దుల్లా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ ముది రాజ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు రావులకార్ వెంకటేష్ కలిసి ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు.. మహమ్మద్ అబ్దుల్లా, పులి దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ... రాష్ట్రంలో ఖాళీగా ఉన్న జిల్లా, మండల విద్యా ధికారి పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. 317 జీవో సమస్య సర్దుబాటు కోసం తీసుకొచ్చిన 190 జీవోను తక్షణమే అమలు చేసి వారిని రిలీవ్ చేయాలని డిమాండ్ చేశారు. 2003 డిఎస్‌సి ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, పిఎస్ ఎచ్‌ఎం పోస్టులను మంజూరు చేసి భర్తీ చేయాలన్నారు. రాష్ట్రంలో మిగిలిపోయిన భాష పండిట్, పిఇటి పోస్టులను వెంటనే అప్‌గ్రేడ్ చేయాలన్నారు. ప్రతి వేసవి సెలవుల్లో బదలీలు చేపట్టాలన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ సానుకూలంగా స్పందించి.. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారని, అనంతరం తమ యూనియన్ రూపొం దించిన 2026 క్యాలెండర్‌లను ఆవిష్కరించారని తెలిపారు.

# 27న బ్యాంకుల సమ్మె

## నేటి నుండి వరుసగా నాలుగు రోజులు బంద్

**హైదరాబాద్, జనవరి 23, ప్రభాతవార్త :** ఉద్యోగుల సమ్మెతో పాటు, వివిధ కారణాలతో బ్యాంకులు వరుసగా నాలుగు రోజుల పాటు మూతపడనున్నాయి. ఈ నెల 24వ తేదీ నుండి 27వ తేదీ వరకూ బ్యాంక్‌లు బంద్ అవుతాయి. ఈ నెల 27న బ్యాంకు ఉద్యోగుల ఒక రోజు సమ్మె చేయనున్నారు. వారానికి 5 రోజుల పని దినాలు కల్పించాలనే డిమాండ్‌తో బ్యాంక్ ఉద్యోగులు దేశవ్యాప్తంగా సమ్మెకు పిలుపునిచ్చారు. బ్యాంకు ఉద్యోగులు, అధికారులకు చెందిన 9 యూనియన్లకు ప్రాతినిధ్యం వహించే యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ఈ మేరకు పిలుపునిచ్చింది. ఉద్యోగుల పని గంటలు తగ్గిస్తే తమ కస్టమర్లకు మెరుగైన సేవలు అంతరాయం లేకుండా అందిస్తామని, సోమవారం నుంచి శుక్రవారం వరకు రోజుకు 40 నిమిషాలు అదనంగా పని చేస్తామని ప్రకటించింది. ఇప్పటికే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎల్ఐసీ, జీఐసీ మొదలైనవి 5 రోజుల పని వారాన్ని అనుసరిస్తున్నట్లు గుర్తు చేసింది. విదేశీ మారక ద్రవ్య మార్కెట్, స్టాక్ ఎక్స్ఛేంజీలు సైతం శని, ఆది వారాలు మూసి ఉంటాయని, బ్యాంకులకు సైతం అదే తరహా పని దినాలు కల్పించాలని డిమాండ్ చేసింది.ఈ నేపథ్యంలో ఈ నెల 27వ తేదీ మంగళవారం రోజు దేశ వ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగులు, అధికారులు సమ్మెలో పాల్గొంటారని ప్రకటిం చింది. అలాగే ఈ నెల 26న రిపబ్లిక్ డే కావడంతో బ్యాంకులు సాధారణ సెలవుతో మూతపడనున్నాయి. ఇక ఈ నెల 24వ తేదీ రెండో శనివారం, 25న ఆదివారం, కావడంతో ఇవన్నీ కలుపుకొని మొత్తం నాలుగు రోజులు బ్యాం కులు పనిచేయవు. కాగా బ్యాంకు ఉద్యోగ సంఘాలు పలుమార్లు సమ్మెకు దిగిన సందర్భంలో ప్రధానంగా ఆన్‌లైన్ బ్యాంకింగ్, ఎటిఎమ్‌ల వంటి ప్రత్యామ్నాయ డెలివరీ మార్గాల లభ్యత కారణంగా సమ్మె ప్రభావం బ్యాంక్ ఖాతాదారులపై కనిపించడం లేదు. నేరుగా బ్యాంకుకు వెళ్లి పూర్తి చేయా ల్సిన లావాదేవీలు ఏవైనాఉంటే మాత్రం కచ్చితంగా ప్రభావం పడుతుంది.


# మేడారం జాతరకు కేంద్రం రూ.3.70 కోట్లు విడుదల

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 23:** మేడారం జాతర నేపథ్యంలో కేంద్రం ప్రభుత్వం శుభవార్తను వెల్లడించింది. సమ్మక్క, సారలమ్మ జాతర నిర్వహణ కోసం నిధులను విడుదల చేసింది. కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ, గిరిజన మంత్రిత్వ శాఖలు సంయుక్తంగా రూ. 3.70 కోట్లను విడుదల చేశాయి. కేంద్ర మంత్రి, సికింద్రాబాద్ ఎంపీ కిషన్ రెడ్డి చొరవతో ఈ నిధులు విడుదలయ్యాయి.మేడారం పరిసర ప్రాంతాల్లో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు గిరిజన సర్క్యూట్ పేరుతో గతంలో రూ.80 కోట్లతో పర్యాటకులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించింది. అంతేకాకుండా రామప్ప దేవాలయం అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం రూ.140 కోట్లు ఖర్చు చేస్తోంది.

# నార్మల్ మదర్ డెయిరీ చైర్మన్ రాజీనామా!

## పక్షం రోజులు తిరగకుండానే రాజీనామాతో గందరగోళం

**హైదరాబాద్ (హాయత్‌నగర్), జనవరి 23, ప్రభాతవార్త:** నార్మల్ మదర్ డెయిరీ ఛైర్మన్ మందడి ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం ఛైర్మన్ పదవితోపాటు డైరెక్టర్ పదవికి రాజీనామా చేశారు. ఆయన ఈ నెల 8న ఛైర్మన్‌గా బాధ్య తలు చేపట్టగా పక్షం రోజులు తిరగకుండానే రాజీనామా చేయడం గమ నార్హం. శుక్రవారం పాలకవర్గ సమావేశం అనంతరం ఆయన తన రాజీనామా లేఖను మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణ కు అందించారు. దీనిపై ఎండి మాట్లాడుతూ... ఛైర్మన్ రాజీనామా చేసిన విషయం వాస్తవమేనన్నారు. అనారోగ్య కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు లేఖ ఇచ్చారన్నారు. పాలకవర్గ సభ్యులు సమావేశమై రాజీనామా విషయంపై నిర్ణ యం తీసుకుంటారని ఎండి పేర్కొన్నారు. బిల్లులు చెల్లించకపోవడం.. ఉద్యోగుల ఆందోళనే కారణమా, రైతులకు రూ. 12 కోట్ల పాల బిల్లులను తాను చెల్లిస్తా నన్న ఒప్పందంతో మాజీ ఛైర్మన్ మధుసూదన్‌రెడ్డి ఈ నెల 8న ఛైర్మన్ పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. అదేరోజున ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రభాకర్‌రెడ్డి మొదటి విడతగా రూ. 3 కోట్లను ఫర్మ్ ద్వారా జమ చేయగా అధికారులు రైతులకు పాల బిల్లులను పంపిణీ చేశారు. ప్రభుత్వ సహకారం లేకపోవడం, సంస్థ అభివృద్ధిలో కీలకంగా వ్యవహరించిన పెద్దలు సైతం ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టడంపై అసంతృప్తి వ్యక్తంచేయడంతో ఆలోచ నలో పడ్డాడు. వేతనాల్లో కోతలపై బోర్డు తీసుకున్న నిర్ణయాన్ని ఉద్యోగులు తీవ్రంగా వ్యతిరేకించారు. ముందు ఇచ్చిన హామీ మేరకు రూ. 9 కోట్ల పాల బిల్లులను వెంటనే చెల్లించని పక్షంలో పాడి రైతులతో కలిసి ధర్నా చేస్తామంటూ మాజీ ఛైర్మన్లు శ్రీకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి హెచ్చరించిన నేపథ్యంలో ఒత్తిడికి లోనైన ప్రభాకర్‌రెడ్డి రాజీనామాకు ఉపక్రమించినట్లు తెలుస్తోంది.



సిఎం ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న డా.చిన్నారెడ్డి

# సిఎం ప్రజావాణికి అందిన దరఖాస్తులు 464

**హైదరాబాద్ (బేగంపేట,) జనవరి 23, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన సిఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 464 దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయతీరాజ్ గ్రామీ ణాభివృద్ధి శాఖకు సంబంధించి 112 దరఖాస్తులు వచ్చాయి. రెవెన్యూ శాఖ కు సంబంధించి 35 దరఖాస్తులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం 244 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 73 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సిఎం ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌ఛైర్మన్ డా.జి.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్యదేవరాజన్ దం ఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలు పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో అద నపు కలెక్టర్ సూర్యప్రకాష్, పోలీసు అసిస్టెంట్ కమిషనర్ ఉమేందర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# టెట్ రద్దు కోసం ఫిబ్రవరి 5న చలో ఢిల్లీ

## ఎక్కువ సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొనాలి

## పిఆర్‌టియు టిఎస్ కార్యవర్గంలో ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

**హైదరాబాద్, జనవరి 23, ప్రభాతవార్త:** ఇన్‌సర్వీస్ టీచర్లకు గుదిబండగా మారిన టెట్ తప్పనిసరి రద్దుకై ఫిబ్రవరి 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి తెలిపారు. టెట్ తప్పనిసరి నిబంధ నను రద్దు చేయాలనే డిమాండ్‌తో అఖిల భారత ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఫిబ్రవరి 5న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని అఖిల భారత ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఏఐఎఫ్‌టివో) వర్కింగ్ ప్రెసిడెంట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం హైదరాబాద్‌లోని పిఆర్‌టియు టిఎస్ కార్యా లయంలో రాష్ట్ర సంఘ అధ్యక్షుడు దామోదర్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర బాధ్యుల సమావేశం జరిగింది. సమావేశంలో శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం పనిచేస్తున్న ఉపాధ్యాయులు కూడా ఉద్యోగంలో కొనసాగాలంటే టెట్ ఉత్తీర్ణత పొందాలని ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ఈ సమ స్యను పలుమార్లు కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకుపోయినప్పటికీ దీనికి సంబంధించి ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో దేశవ్యాప్తంగా ఉన్న అన్ని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో అత్యధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొని సమస్య తీవ్రతను కేంద్ర ప్రభుత్వానికి తెలియచేయాలన్నారు. ఢిల్లీలోని జంతర మంతర్ వద్ద ఉదయం 10 గంటల నుంచి ఒకరోజు ధర్నా కార్యక్రమం నిర్వహిస్తు న్నామన్నారు.

ఈ నిరసన కార్యక్రమంలో అన్ని రాష్ట్రాల ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో పాల్గొన బోతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి భిక్షంగౌడ్, అడిట్ కమిటీ చైర్మన్ సోమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డితోపాటు వివిధ జిల్లాల బాధ్యులు పాల్గొన్నారు.

# బొగ్గు కుంభకోణంతోపాటు సోలార్ స్కామ్ సైతం జరిగింది

## సిట్‌కు భయపడేవాళ్లం కాదు: బిఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు



తెలంగాణ భవన్‌లో శుక్రవారం మీడియాతో మాట్లాడుతున్న బిఆర్ఎస్ సీనియర్ నేత, మాజీమంత్రి హరీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 23:** సింగరేణి సంస్థలో బొగ్గు కుంభకోణంతో పాటు సోలార్ కుంభకోణం కూడా జరిగిందని బిఆర్ఎస్ సీనియర్ నేత, మాజీమంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. రేవంత్ బావమరిది కుంభ కోణం బయటపెట్టినందుకే తమకు సిట్ నోటీసులు ఇస్తున్నారని మండిపడ్డారు. ఈ మేరకు తెలంగాణ భవన్‌లో శుక్రవారం మీడియాతో మాట్లాడారు. అవినీతి రేవంత్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు.

సిట్ విచారణపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. లోపల ఏదో జరుగుతుందని తప్పుడు లీకులు ఇస్తున్నారు. లీకులతో వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారు. కట్టుకథలతో ఇంకెన్నాళ్లు ప్రభుత్వాన్ని నడుపుతారు. రెండేళ్లు దాటినా లీకు రాజకీయాలే చేస్తారా..? అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ కు ప్రజలు చరమగీతం పాడతారు. మంత్రుల మధ్య వాటాల పంచాయితీ ఉంది. మంత్రుల పంచాయితీ కాంగ్రెస్ కు ఉరితాడులా మారింది. రేవంత్ బావమరిది వ్యవహారం ఆధారాలతో సహా బయటపెట్టాం. అందుకే ప్రభుత్వానికి కంటిమీద కునుకులేదు. కుంభకోణం ఎలా బయటపడిందా అని తలలు పట్టుకుంటున్నారు. సింగరేణి భూకుంభకోణం వల్ల తెలంగాణ ప్రతిష్ట మసక బారింది. సుజన్ వ్యవహారం బయటపెట్టినందుకే నాకు, కేటీఆర్‌కు సిట్ నోటీసులు ఇచ్చారు. రేవంత్ సిట్‌కు కేటీఆర్ భయపడే వ్యక్తి కాదు. అలా భయపడేవాళ్లం అయితే ఉద్యమాలు చేసే వాళ్లం కాదు అని పేర్కొన్నారు. మేం సుజన్ రెడ్డి వ్యవహారం బయటపెట్టిన తర్వాత ఢిల్లీ కోల్ మినిస్ట్రీ ఎమర్జెన్సీ మీటింగ్ పెట్టింది.నాడు కోల్ స్కాం యూపీఏ ప్రభుత్వ పతనానికి కారణమైంది. నేటి కోల్ స్కాం కాంగ్రెస్ ప్రభుత్వ పతనానికి నాంది పలికింది. సింగరేణి స్కాంపై దృష్టి మళ్లించేందుకే బీజేపీతో కలిసి సిట్ డ్రామాలు ఆడుతున్నారు. నాడు సింగరేణి సిరుల గనిగా ఉండేది. నేడు సింగరేణి సుజన్ గనిగా మారింది. సింగరేణిలో బొగ్గు స్కాం మాత్రమే కాదు.. సోలార్ స్కాం కూడా జరిగింది. 127 మెగా వాట్ల సోలార్ స్కాం జరిగింది. మూడు ప్రాంతాల్లో సోలార్ ప్లాంట్స్ పెట్టాలి. ఎంఎస్ఎంఈలను పాల్గొనకుండా మూడింటికీ కలిపి ఒకేసారి టెండర్లు పిలిచారు. టెండర్ అనుమతులు కఠినం చేశారు. సోలార్ ప్లాంట్స్ కు కూడా సైట్ విజిట్ నిబంధన పెట్టారు. రూ.200 కోట్ల నుంచి రూ.250 కోట్ల వరకు వచ్చేలా టెండర్లు కట్టబెట్టారు. ప్రభుత్వం అనుకున్నవారికి టెండర్లు దక్కేలా చూశారు. సోలార్ పవర్ పర్ మెగావాట్ దేశమంతా రూ.3 కోట్ల రూపాయలు. కానీ, మన దగ్గర రూ.5 కోట్ల 4 లక్షలకు టెండర్ ఇచ్చింది. అదనంగా సింగరేణి భూములు కూడా ఇచ్చార్లు అని హరీష్ రావు ఆరోపించారు.

# ఎపి లిక్కర్ స్కామ్ కేసులో ఎంపి మిథున్‌రెడ్డి విచారణ

## హైదరాబాద్‌లో 7 గంటలపాటు ప్రశ్నించిన ఇడి అధికారులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 23:** ఏపీ మద్యం కుంభకోణం (ఏపీ లిక్కర్ స్కామ్) కేసులో దర్యాప్తు మరింత వేగవంతమైంది. ఈ కేసులో భాగంగా వైసీపీ రాజంపేట ఎంపీ పి.వి. మిథున్ రెడ్డి శుక్రవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు హాజరయ్యారు. హైదరాబాద్‌లోని ఈడీ జోనల్ కార్యాలయంలో ఆయనను అధికారులు సుమారు ఏడు గంటల పాటు సుదీర్ఘంగా ప్రశ్నించి, కీలక వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్నారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో (2019-2024) మద్యం విధానంలో చోటుచేసుకున్న అక్రమాలు, నిధుల మళ్లింపు ఆరోపణలపై ఈడీ మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్‌ఏ) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా గతంలోనే మిథున్ రెడ్డికి సమన్లు జారీ అయ్యాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం ఆయన ఈడీ కార్యాలయానికి చేరుకున్నారు. మద్యం విధాన రూపకల్పన, డిస్టిలరీలతో సంబంధాలు, నిధుల లావాదేవీల వంటి పలు కీలక అంశాలపై అధికారులు ఆయనపై ప్రశ్నల వర్షం కురిపించినట్లు తెలుస్తోంది.విచారణ ముగిసిన అనంతరం బయటకు వచ్చిన మిథున్ రెడ్డి మీడియాతో మాట్లాడేందుకు నిరాకరించారు. ఈ కేసుకు సంబంధించి కోర్టు ఆదేశాలు ఉన్నందున తాను ఎలాంటి వివరాలు వెల్లడించలేనని స్పష్టం చేసి, అక్కడి నుంచి నేరుగా తన నివాసానికి వెళ్లిపోయారు. గతంలో ఏపీ పోలీస్ సిట్ ఇదే కేసులో మిథున్ రెడ్డిని ఏ5 నిందితుడిగా చేర్చి అరెస్టు చేసింది. ప్రస్తుతం ఆయన బెయిల్‌పై ఉన్నారు.

ఈ కేసులో రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డిని గురువారం దాదాపు ఏడు గంటల పాటు విచారించిన మరుసటి రోజే మిథున్ రెడ్డిని విచారించడం ప్రాధాన్యత సంతరించుకుంది. విజయసాయి రెడ్డి వాంగ్మూలం ఆధారంగా లభించిన సమాచారంతోనే ఇడి దర్యాప్తును ముందుకు తీసుకెళుతున్నట్లు తెలుస్తోంది. ఈ వరుస విచారణలతో కేసులో మరిన్ని కీలక వాస్తవాలు వెలుగులోకి వస్తాయని, మరికొందరు ప్రముఖులకు కూడా సమన్లు జారీ చేసే అవకాశం ఉందని దర్యాప్తు వర్గాలు భావిస్తున్నాయి.

# హరీశ్‌రావు వ్యాఖ్యలకు పోలీసు అధికారుల సంఘం ఖండన

**హైదరాబాద్, జనవరి 23, ప్రభాతవార్త:** పోలీసు శాఖ పనితీరుపై మాజీ మంత్రి హరీష్ రావు చేసిన వ్యాఖ్యలను పోలీసు అధికారుల సంఘం తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు గోపిరెడ్డి శుక్రవారం నాడు ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు అహర్నిషలు కష్టపడుతున్నారని, ఈ క్రమంలో తమ ప్రాణాలను సైతం లెక్క పెట్టడం లేదని ఆయన తెలి పారు. పోలీసులు ఆహోరాత్రులు ప్రజల కోసం కష్టపడుతుంటే హరీష్ రావు ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం సరికాదని గోపిరెడ్డి హితవు పలికారు. మాజీ మంత్రిగా బాధ్యతగల ఎంఎల్‌ఎగా వున్న హరీష్ రావు పోలీసు శాఖపై నిరాధారమైన ఆరోపణలు చేశారని, ఇది పూర్తిగా దురుద్దేశంతో చేసినవిగా ఆయన తెలిపారు. ఇటువంటి వ్యాఖ్యలు పోలీసుల నైతికతను దెబ్బతీస్తామని ఆయన తెలిపారు

# రేపటి నుంచి ఐద్వా 14వ జాతీయ మహాసభలు

## మొదటిరోజు ఆర్‌టిసి బస్‌భవన్ గ్రౌండ్‌లో బహిరంగ సభ

## 26 నుంచి 28 వరకు ప్రతినిధుల సభ

## పాల్గొననున్న సినీనటి రోహిణి



**హైదరాబాద్, జనవరి 23, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో రేపటి(ఆదివారం) నుంచి అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) జాతీయ మహాసభలు జరగ నున్నాయి. ఐద్వా 14వ జాతీయ మహాసభలను ఈ నెల 25 నుంచి 28 వరకు హైదరాబాద్‌లో నిర్వహించ నున్నారు. అందులో భాగంగా ఆదివారం మహిళలతో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నారు. 25న బహిరంగ సభను నిర్వ హించి.. 26 నుంచి 28 వరకు ప్రతినిధుల సభను నిర్వహించనున్నారు. దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి 1000 ప్రతినిధులు హాజరు కానున్నారు. 25న మధ్యాహ్నం 2 గంటలకు జరిగే బహిరంగ సభకు ఐద్వా ఆలిండియా ప్యాట్రన్, మాజీ ఎంపి బృందా కరత్‌తోపాటు ఐద్వా జాతీయ అధ్యక్షురాలు పికె శ్రీమతి, జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం ధావలే పాల్గొంటారు. తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో మొదటిసారిగా ఐద్వా జాతీయ మహాసభలు జరగనున్నాయి. 26 నుంచి 28 వరకు 1000 మంది ప్రతినిధులతో మహా సభలు జరగను న్నాయి. ప్రతినిధుల సభ వివిఎస్‌టి దగ్గర గల ఆర్‌టిసి కళాభవన్‌లో జరగనున్నాయి. 26న ప్రారంభం కానున్న ప్రతినిధుల సభలో సినీ నటి రోహిణి పాల్గొనున్నట్టు ఐద్వా నాయకులు తెలిపారు. ఐద్వా 14వ జాతీయ మహాసభల నేపథ్యంలో ఈ నెల 25న జరిగే భారీ బహిరంగ సభ ఏర్పాట్లను ఐద్వా నేతలు శుక్రవారం పరిశీలించారు. ఆదివారం బస్ భవన్ గ్రౌండ్‌లో జరిగే బహిరంగ సభ స్థలాన్ని ఐద్వా జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మరియం దావలె, పీకే శ్రీమతితో పాటు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, సీనియర్ నాయకురాలు జ్యోతి, మహాసభల పబ్లిసిటీ కన్వీనర్ మహమ్మద్ అబ్బాస్, ఆశలత, సరళ, బి ప్రసాద్, శోభన్‌నాయక్, పరిశీలించారు. చారిత్రాత్మకమైన జాతీయ మహాసభలు భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం సాగిన వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో మహిళా దళానికి నాయకత్వం వహించిన కామ్రేడ్ మల్లు స్వరాజ్యం పేరు మీద బహిరంగ సభ ప్రాంగణం ఏర్పాటు చేశామని ఐద్వా నేతలు తెలిపారు. తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్ నుండి వచ్చే వేలాదిమంది మహిళలతో జరిగే ర్యాలీ సుందరయ్య పార్క్ నుండి నారాయణగూడ ఫ్లైఓవర్, అశోక్ నగర్ మీదుగా ఆర్టీసీ క్రాస్ రోడ్డు వరకు జరుగుతుందన్నారు. దేశంలో నరేంద్ర మోడీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత హిందుత్వ శక్తుల కార్పోరేట్ల బంధం బలపడిందని, సరళీకరణ ఉదారవాద విధానాలు మహిళలను శ్రమ దోపిడీకి గురి చేస్తున్నాయన్నారు. ఆర్ఎస్ఎస్, బిజెపి మతోన్మాద శక్తులు మహిళను ద్వితీయ పౌరురాలుగా వంటింటికే పరిమితం చేయాలని చూస్తున్నాయని మండిపడానదరు. మహిళా రిజర్వేషన్లను అమలు చేయడం, పని ప్రదేశంలో మహిళలకు రక్షణ కల్పించడం, సమాన పనికి సమాన వేతనం కల్పించడం, ఆస్తి హక్కు కల్పించడం వంటివి నేటికీ నెరవేరలేదని చెప్పారు. గృహ హింసను, లైంగిక హింసను అరికట్టడంలో మోడీ ప్రభుత్వం ఘోరంగా విఫలం చెందిందన్నారు. మొదటి రోజు ర్యాలీ, బహిరంగ జరగనుంది. 26న ప్రతినిధుల ప్రారంభ సభకు సినీనటి రోహిణి హాజరు కానున్నారు. 27న వివిధ జాతీయ మహిళా సంఘాల సౌహార్ధక సందేశాలను ఆయా సంఘాల నేతలు ఇవ్వనున్నారు. చివరి రోజైన 28న భవిష్యత్తు కర్తవ్యాలను రూపొందించుకుని.. సంఘం నూతన జాతీయ కమిటీని ఎన్నుకోనున్నారు.

# ఘనంగా ముగిసిన ప్రభుత్వ జూనియర్ కాలేజీల పిటిఎం

## విద్యార్థులకు పలు సూచనలు చేసిన జిల్లా కలెక్టర్లు

## 430 కాలేజీల్లో 50 వేల మంది విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరు

## సమావేశానికి హాజరైన పూర్వ విద్యార్థులు

**హైదరాబాద్, జనవరి 23, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో శుక్రవారం మెగా పేరెంటన టీచర్స్ మీటింగ్ ఘనంగా జరిగింది. రాష్ట్రంలోని 430 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో రెండవ మెగా పిటిఎంను ఇంటర్ విద్య శాఖ విజయవంతంగా నిర్వహించింది. కొన్ని జిల్లాల్లో జరిగిన పిటిఎంకి జిల్లా కలెక్టర్లు హాజరయ్యారు. కలెక్టర్లు మాట్లాడుతూ.. విద్యార్థులు పరీక్షలంటే భయపడొద్దని సూచించారు. ఫిబ్రవరిలో జరిగే వార్షిక పరీక్షలకు బాగా ప్రిపేర్ కావాలన్నారు. పరీక్షల్లో ఫెయిలైనంత మాత్రాన జీవితంలో అన్ని కోల్పోయినట్టు కాద న్నారు. పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలన్నారు. పిటిఎం మీటింగ్‌లో ఆయా కాలేజీల్లో చదివి ప్రస్తుతం ఉన్నత హోదాల్లో ఉన్న వారు ఈ మీటింగ్‌కి హాజరై తమ అనుభవాలను విద్యార్థులకు చెప్పారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదివి ఎంబిబిఎస్ పాసైన వారు, టీచర్లు, పోలీస్ కానిస్టేబుల్స్, ఆర్మీ జవాన్లుగా మారిన వారు కూడా సమావేశానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో 50,000 మందికి పైగా తల్లిదండ్రులు పాల్గొని, తమ పిల్లల విద్యా ప్రగతి, హాజరు వివరాలు, ఫిబ్రవరిలో జరగనున్న ఇంటర్మీ డియట్ వార్షిక పరీక్షల సన్నద్ధతపై సమీక్షించారు. రెండు సంవత్సరాల్లో ఇంటర్మీడియట్ విద్యారంగంలోని ప్రధాన సంస్కరణలు, మౌలిక వసతులను ఆయా కాలేజీల ప్రిన్సిపాల్స్ పిటిఎం సందర్భంగా తల్లిదండ్రులకు వివరించారు. కాలేజీల మరమ్మత్తులు, వైట్ వాషింగ్. గ్రీన్ బోర్డుల ఏర్పాటు కోసం రూ. 56.18 కోట్లు మంజూరు చేయగా, మరొక 41 కళాశాలల మరమతుల కోసం రూ. 10.25 కోట్లు మంజూరు చేశారు. ప్రతి ప్రభుత్వ జూనియర్ కళాశా లలో రెండు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ (ఐఫ్ పిఎస్), రెండు ఇంటరాక్టివ్ డిజిటల్ ప్రొజెక్టర్లు (ఐడిపిఎస్), ఇంటర్నెట్, జూమ్ కనెక్టివిటి ఏర్పాటు చేశారు. ఫిజిక్స్ వాలా, ఖాన్ అకాడమీ సహకారంతో జేఈఈ, నీట్, క్లాట్ వంటి పోటీ పరీక్షలకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ అంది స్తున్నారు. విద్యార్థుల మానసిక ఆరోగ్య పరిరక్షణ కోసం టెలీమానస్ హెల్ప్‌లైన్ (14416),శిక్షణ పొందిన కౌన్సిలర్లు, ధ్యానం, జీవన నైపుణ్యాలు, భావోద్వేగ స్థైర్యాన్ని పెం పొందించే హెల్ప్ కార్యక్రమం అమలు చేస్తున్నారు. కళాశాలల పేరు బోర్డులు ఏర్పాటు చేయ డంతో పాటు, వివిధ హోదాల్లో విజయవంతమైన పూర్వ విద్యార్థుల ఫోటో లతో 'వాల్ ఆఫ్ ఫేమ్'ను ఏర్పాటు చేశారు. ప్రతి భావంతులైన విద్యార్థులు, వారి తల్లి దండ్రులను సత్కరించడం ద్వారా ప్రస్తుత విద్యార్థులకు ప్రోత్సాహం అందించారు. మెగా పిటిఎంలో పాల్గొన్న తల్లిదండ్రులు, విద్యాభివృద్ధికి నిరంతరంగా కృషి చేస్తున్న ముఖ్యమంత్రి కి కృతజ్ఞతలు తెలియజేశారు. పూర్వ విద్యార్థులు విలు వైన సూచనలు చేశారు. మెగా పేరెంట్ టీచర్స్ కార్యక్ర మాన్ని విజయవంతం చేసిన కళాశాల ప్రిన్సి పల్స్, అధ్యా పకులు, తల్లిదండ్రులకు ఇంటర్మీడి యేట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ కృష్ణ ఆదిత్య అభినందనలు తెలిపారు.

# తమిళనాడులో మార్పు తథ్యం

## డిఎంకె పాలనలో పెచ్చరిల్లిన అవినీతి, నేరాలు

## అభివృద్ధిలో విఫలం, కేంద్రం చర్యలను అడ్డుకుంటోంది

## మధురాంతకం సభలో నిప్పులు చెరిగిన ప్రధాని మోడీ



**మధురాంతకం(చెన్నై), జనవరి 23:** తమిళనాడులో డిఎంకె పాలన అంతానికి కౌంట్ డౌన్ ప్రారంభమైందని ప్రధానమంత్రి నరేంద్రమోడీ పేర్కొన్నారు. అవినీతి, దుర్పరిపాలన, ప్రజల నమ్మకాన్ని వమ్ముచేసిందని ఆరోపణలు గుప్పించారు. బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వానికి తమిళనాడు ప్రజలు పట్టంకట్టడానికి సిద్ధంగా ఉన్నారని మోడీ విశ్వాసం వ్యక్తం చేశారు. శుక్రవారం మధురాంతకంలో నిర్వహించిన బహిరంగ సభలో ప్రధాని మోడీ పాల్గొని, తమిళనాడు ఎన్నికల ప్రచార శంఖారావం పూరించారు. ఈ సభకు ఎఐఎడిఎంకె ప్రధాన కార్యదర్శి, మాజీ సిఎం ఎడప్పాడి కె.పళనిస్వామి, పిఎంకె అగ్రనేత అన్బుమణి రామదాస్, ఎఎంఎంకె వ్యవస్థాపకుడు టిటివి దినకరన్, తమిళ మాణిల కాంగ్రెస్ (మూపనార్) అధ్యక్షుడు జికె వాసన్, ఇతర ఎన్‌డిఎ భాగస్వామ్య పక్షాల నాయకులు హాజరయ్యారు.

బహిరంగ సభలో మోడీ మాట్లాడుతూ, డిఎంకె ప్రభుత్వాన్ని 'సిఎంసి – అవినీతి, మాఫియా, నేరం'గా అభివర్ణించవచ్చని అన్నారు. తమిళనాడు 'డిఎంకె దుర్పరిపాలన నుండి విముక్తి పొందడానికి పోరాడుతోందని, ఇది అవినీతి, నేర ప్రవృత్తి, వంశపారంపర్య రాజకీయాలతో నిండిన ప్రభుత్వం' అని ఆయన అన్నారు. రాష్ట్రానికి 'సురక్షితమైన, అవినీతి రహిత పరిపాలన" అవసరమని పేర్కొన్నారు. డిఎంకె కేవలం ఒక కుటుంబ ప్రయోజనాల కోసమే పనిచేస్తోందని ప్రధానమంత్రి ఆరోపించారు. వంశపారంపర్య పాలన, అవినీతి, మహిళల పట్ల అగౌరవం, సంస్కృతి పట్ల చిన్నచూపు అనే నాలుగు ప్రతికూల మార్గాలను ఆ పార్టీ ప్రోత్సహిస్తోందని ఆయన విమర్శించారు. "తమిళనాడు భారతదేశ నాగరిక వారసత్వాన్ని సుసంపన్నం చేసింది. అభివృద్ధి చెందిన భారతదేశాన్ని సాధించడానికి, తమిళనాడును డిఎంకె దుర్పరిపాలన నుండి విముక్తి చేయాలి,' అని మోడీ పిలుపునిచ్చారు. ఈ ప్రభుత్వం యువత, రైతులు మరియు మహి ళల నం క్షే మా న్ని విస్మరించిందని, అంతేకాకుండా తమిళ సాంస్కృతిక విలువలను గౌరవించడంలో విఫలమైందని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో డ్రగ్ మాఫియాలు చురుకుగా ఉన్నాయని, మహిళల భద్రత క్షీ ణించిందని ఆయన విమర్శించారు. గత 11 ఏళ్లలో ఎన్‌డిఎ ప్రభుత్వం తమిళనాడు అభివృద్ధి కోసం 11 లక్షల కోట్ల రూపాయలు కేటాయించిందని, ఇందులో రైల్వే ప్రాజెక్టులలో ఏడు రెట్లు పెరుగుదల, 50,000 కిసాన్ క్రెడిట్ కార్డులు, ఆరు కోట్ల ముద్ర రుణాలు, ప్రత్యక్ష ప్రయోజన బదిలీలు ఉన్నాయని, అలాగే ఎంఎస్‌ఎంఈల కోసం మూడు లక్షల కోట్ల రూపాయలు కేటాయించిందని మోడీ తెలిపారు. సంస్కృతి గురించి మాట్లాడుతూ, తమిళ భాష, వారసత్వం పట్ల తనకున్న అభిమానాన్ని ప్రధాని మోడీ పునరుద్ఘాటించారు, ప్రపంచ నాయకులకు తిరుక్కురల్‌ను బహుమతిగా ఇచ్చారని, జాతీయ సంస్థలలో తమిళ అధ్యయనాలకు మద్దతు ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం డిఎంకె, దాని మిత్రపక్షాలు మత సంప్రదాయాలను వ్యతిరేకిస్తున్నాయని ప్రధాని మోడీఆరోపించారు. జల్లికట్టు గురించి ప్రస్తావిస్తూ, డిఎంకె– కాంగ్రెస్ ప్రభుత్వం ఈ క్రీడను నిషేధిం చిందని, ఎన్డీఏ దాని చట్టబద్ధమైన కొనసాగింపును నిర్ధారించిందని ప్రధాని మోడీ అన్నారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వంలో వేగవంతమైన అభివృద్ధిని వాగ్దానం చేసిన ప్రధాన మంత్రి, కేంద్రం, రాష్ట్రం మధ్య మెరుగైన సమన్వయం సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడానికి దోహదపడుతుందని అన్నారు. తమిళనాడును అభివృద్ధి చెందిన, సురక్షితమైన, అవినీతి రహితంగా మార్చాలని ప్రధాని పిలుపునిచ్చారు.



హైదరాబాద్‌లోని లోక్‌భవన్‌లో శుక్రవారం గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర ఆహ్వాన పత్రికను అందజేస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



శుక్రవారం ఎర్రవెల్లి నివాసంలో జగదీశ్ కుమార్తె సుకీర్తికి చెక్ అందజేస్తున్న కెసిఆర్

# జెడ్పీ మాజీ చైర్మన్ కుసుమ జగదీశ్ కుటుంబానికి అండగా నిలిచిన కెసిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 23:** మాజీ సిఎం, బిఆర్‌ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు మరోసారి ఔదార్యాన్ని చాటారు. బిఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, ఉద్యమకారుడు, ములుగు జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ కుసుమ జగదీశ్ కుటుంబానికి అండగా నిలిచారు. పార్టీలో మొదటి నుండి క్రియాశీలకంగా వ్యవహరించిన కుసుమ జగదీశ్ రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మరణించారు. జగదీశ్ కుమార్తె సుకీర్తి మెడిసిన్ చదవడానికి ప్రయత్నిస్తున్న విషయం గురించి కేసీఆర్ పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్నారు. ఆమె మెడిసిన్ చదవడానికి అవసరమైన ఫీజు చెక్కును శుక్రవారం ఎర్రవెల్లి నివాసంలో సుకీర్తికి అందజేశారు. మంచిగా చదువుకోవాలని, కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని సుకీర్తిని ఆశీర్వదించారు. సుకీర్తితో పాటు మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్,ములుగు బిఆర్‌ఎస్ నేతలు కెసిఆర్‌ను కలిశారు. జగదీశ్ కుటుంబానఇఆకి అధినేత కెసిఆర్ అందించిన ఈ ఆర్థిక సహాయం ఆ కుటుంబంలో కొత్త వెలుగును నింపిందని బిఆర్‌ఎస్ నేతలు పేర్కొన్నారు.



వసంత పంచమి సందర్భంగా శుక్రవారం బాసరలోని జ్ఞానసరస్వతి అమ్మవారి ఆలయంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పిస్తున్న దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్

# 2014 నుంచి ఇప్పటివరకు అన్ని టెండర్లపై సమగ్ర విచారణ జరిపించాలి

## కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి కాంగ్రెస్ ఎంపి చామల లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 23:** సింగరేణిలో 2014 నుంచి ఇప్పటి వరకు జరిగిన అన్ని టెండర్లపై సమగ్ర విచారణ జరిపించాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డికి శుక్రవారం కాంగ్రెస్ భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి లేఖ రాశారు. నైనీ కోల్ బ్లాక్ విషయంలో తలెత్తిన వివాదంపై తక్షణమే స్పందించి ఇద్దరు సభ్యులతో కూడిన బృందాన్ని విచారణకు వేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కేవలం నైనీ కోల్ బ్లాక్ టెండర్ రద్దు అంశానికే ఈ విచారణను పరిమితం చేయొద్దని కోరారు. సింగరేణిలో గడిచిన పదేళ్లలో జరిగిన అన్ని టెండర్లు, అధికారిక ప్రక్రియలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సమగ్ర విచారణ జరిపించాల్సి న అవసరం ఎంతైనా ఉందని తాను బలంగా నమ్ముతున్నానని పేర్కొన్నారు. సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌లో 2014వ సంవత్స రం నుంచి ఇప్పటివరకు జరిగిన అన్నిటెండర్లు, కాంట్రాక్టులు, అధికారిక నిర్ణయాలపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని చామల కిరణ్ కుమార్ రెడ్డి కోరారు.

కేసీఆర్ హయాంలో తీసుకున్న నిర్ణయాలతోపాటు, ప్రస్తుతం కొనసాగుతున్న టెండర్ ప్రక్రియలను కూడా ఈ విచారణ పరిధిలోకి తీసుకురావాలని సూచించారు. సింగరేణి సంస్థ ప్రయోజనాలను కాపాడే దిశగా, గత పదేళ్లుగా టెండర్ల కేటాయింపుల్లో ఏవైనా అవకతవకలు జరిగి ఉంటే, వాటిని తెలంగాణ ప్రజలకు తెలియజేయాలని పేర్కొన్నారు. సింగరేణి లాంటి ప్రతిష్ఠాత్మక ప్రభుత్వ రంగ సంస్థలో పారదర్శకత, ప్రజాహితాన్ని కాపాడటం అత్యంత అవసరమని చెప్పుకొచ్చారు. కిషన్‌రెడ్డి వెంటనే స్పందించి 2014 నుంచి ఇప్పటివరకు జరిగిన అన్ని టెండర్ల ప్రక్రియలను ఈ ఉన్నత స్థాయి విచారణ బృందం పరిధిలోకి తీసుకురావాలని ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి కోరారు.

# ప్రశ్నార్థకంగా కార్పొరేషన్ల భవిత

## వెంటాడుతున్న రూ.84 వేల కోట్ల అప్పులు

## నిధుల సమస్యతో సతమతం

## అయోమయంలో రుణాల చెల్లింపు

## రాష్ట్ర సర్కార్‌కు గుదిబండలుగా సంస్థలు

**హైదరాబాద్, జనవరి 23, ప్రభాతవార్త:** తెలంగాణలో వివిధ కార్పొరేషన్ల భవిష్యత్ ప్రశ్నార్థకంగా తయరైంది. నిధులు లేక, ఇప్పటికే తెచ్చిన కోట్లాది రూపాయల అప్పులను చెల్లించే స్థోమత లేక దివాళాతీసే పరిస్థితి చేరుకోవడమే కాకుండా రాష్ట్ర సర్కార్‌కు అవి గుదిబండగా తయారయ్యాయి. నిధుల సమస్యతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న కార్పొరేషన్లు కనీసం వాటిల్లో పనిచేసే ఉద్యోగులకు సైతం వేతనాలు ఇవ్వలేని పరిస్థితుల్లో ప్రభుత్వానికి భారంగా తయారయ్యాయి. రాష్ట్ర అవసరాల కోసం నిధులు సమకూర్చుకోవడంలో భాగంగా గత ప్రభుత్వం వివిధ కార్పొరేషన్లను ఏర్పాట్లు చేసింది. తద్వారా భారీగా రుణాలను సమీకరించింది. అయితే ప్రస్తుతం ఈ కార్పొరేషన్ల పరిస్థితి దయనీయంగా తయారైంది. వీటి ద్వారా చేసిన అప్పులును తిరిగి చెల్లించే విషయంలో గత ప్రభుత్వ హాయం నుండి ప్రతిష్ఠంభన నెలకొంది. మూడేళ్ల క్రితం కార్పొరేషన్ల ద్వారా రుణాలు తీసుకునే విషయంలో ఎఫ్‌ఆర్‌ఎంబికి లోబడి అప్పట్లో కేంద్రం ఆంక్షలు పెట్టిన నేపథ్యంలో అప్పటికే తెచ్చిన వాటిని తిరిగి చెల్లించడం పెద్ద సమస్యగా మారింది. తాగు నీటి సరఫరా, సాగు నీటి ప్రాజెక్టులతోపాటు, ఇతర అవసరాలకు అప్పులు చేయడానికి అప్పటి ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్లను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్, రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, తెలంగాణ వాటర్ రిసోర్స్ డెవలప్‌మెంట్, హౌసింగ్ కార్పొరేషన్, తెలంగాణ వాటర్ గ్రిడ్ కార్పొరేషన్, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల కార్పొ రేషన్, కాళేశ్వరం కార్పొరేషన్ వంటి వాటిని ఏర్పాటు చేసింది.

రాష్ట్రంలోని వివిధ కార్పొరేషన్ల ద్వారా దాదాపు రూ.84 వేల కోట్ల రూపాయల మేర అప్పులు సేకరించింది. ఇందుకు గత రాష్ట్ర ప్రభుత్వమే గ్యారంటీ ఇచ్చింది. ఈవిధంగా కాళేశ్వరం కార్పొరేషన్ ద్వారా రూ.24 వేల కోట్లు, మిషన్ భగీరథ, వాటర్ గ్రిడ్ కార్పొరేషన్ కోసం రూ.20 వేల కోట్లు, దేవాదుల కార్పొరేషన్ నుండి రూ.20 వేల కోట్లు, హౌసింగ్ కార్పొరేషన్‌కు రూ.10 వేల కోట్లు, పాలమూరు, రంగారెడ్డి కార్పొరేషన్ ద్వారా రూ.10 వేల కోట్లు అప్పులు చేసింది. అయితే ఎఫ్‌ఆర్‌బిఎం ప్రకారం అదనంగా అప్పులు చేయడానికి కేంద్రం నిరాకరించింది.

అంతేకాకుండా చేసిన అప్పులను బడ్జెట్ కేటాయింపు నుండి చెల్లించే విషయంలో ఆంక్షలు విధించింది. దీంతో ఈ అప్పులే ఆయా కార్పొరేషన్లను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. కార్పొరేషన్ల అప్పులకు బడ్జెట్ ద్వారా చెల్లింపులు చేస్తే వాటిని ఎఫ్‌ఆర్‌ఎంబి పరిధికి లోబడి చేసిన అప్పులు గా పరిగణిస్తామని కేంద్రం స్పష్టం చేసింది.

మరోపక్క వీటి నిర్వహణ ప్రభుత్వానికి పెద్ద భారంగా తయారైంది. చేతి నిండా వీటికి పనులు లేక, నిధులు రాక, అప్పులు చేసే పరిస్థితి లేక అవి దయనీయంగా కొట్టుమిట్టాడుతున్నాయి.

# అంతర్జాతీయ హవాలా, బెట్టింగ్ నెట్‌వర్క్ గుట్టురట్టు

## 2 కోట్ల నగదు, నేపాలీ కరెన్సీ, వెండి వస్తువులు లభ్యం



**కాన్పూర్, జనవరి 23:** అంతర్జాతీయ బెట్టింగ్ హవాలా నెట్‌వర్క్‌ను ఛేదించిన కాన్పూరు పోలీసులు భారీ ఎత్తున నగదు, నేపాల్‌కరెన్సీని స్వాధీనంచేసుకున్నారు. మొత్తం ఐదుగురిని ఈ గ్యాంగ్‌లో అరెస్టుచేసారు. స్వాధీనంచేసుకున్న నగదులో కొంతమేర నేపాల్ కరెన్సీ కూడా ఉంది. కాన్పూర్‌లోని కలెక్టర్‌గంజ్ ప్రాంతంలోని ధన్‌కుట్టి ప్రాంతంలో ఈ బెట్టింగ్, హవాలా నెట్‌వర్క్ ఉన్నట్లు సమాచారం రావడంతోపోలీసులు వ్యూహాత్మకంగా ఆకస్మిక దాడిచేసారు. ఎస్‌ఒజి అడిసిపి సుమీత్‌కుమార్ సుధాకర్ రామ్‌టేకే మాట్లాడుతూ గడచిన కొన్నిరోజులుగా హవాలా, బెట్టింగ్ కార్యకలాపాలు జోరుగా సాగుతున్నాయని, అనరకమ షేర్ ట్రేడింగ్‌కూడా ఉన్నట్లు ఫిర్యాదులు అందాయని చెప్పారు. ఈ సమాచారంతోనే స్పష్టమైన ప్రాంతాన్ని గుర్తించి రమాకాంత్‌గుప్తా అనే వ్యక్తి ఇంటిపై రాత్రి తొమ్మిది గంటలకు దాడులుచేసినట్లు తెలిపారు. అన్నివైపులనుంచి ఇంటినిచుట్టుముట్టి ఇంట్లోకివెళ్లామని, కొన్ని నోట్లకట్టలు లభించాయని, వెండి కూడా భారీ మొత్తంలో స్వాధీనంచేసుకున్నట్లు తెలిపారు. కార్టూన్లలో 500 నోట్లకట్టలను ఉంచినట్లు గుర్తించారు. మొత్తం రూ.1.80 కోట్ల రూపాయల నోట్లు వచ్చాయి. మిగిలినవన్నీ కూడా రూ.200, రూ.100 నోట్లు ఉన్నట్లు తెలిపారు. వీటిని లెక్కించేందుకు పోలీసులు కౌంటింగ్ మెషిన్లు కూడా రప్పించారు. వెండిని తూకం వేసేందుకు కాటాలురప్పించారు. పెన్‌డ్రైవ్‌లు, మోడెమ్‌లు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు వంటివి కూడా నిందితుడి ఇంటినుంచి స్వాధీనం చేసుకున్నారు.

# ఏడు వికెట్ల తేడాతో టీమిండియా వన్‌సైడ్ విక్టరీ

## భారత్ దెబ్బకు ఓటమి తప్పని న్యూజిలాండ్

**రాయ్‌పూర్, జనవరి 23:** భారత్ న్యూజిలాండజట్లమధ్యజరిగిన రెండో టి20 మ్యాచ్‌లో టీమిండియా వన్ సైడ్ విక్టరీ నమోదుచేసింది. ఆరంభంలోనే ఓపెనర్లు ఇద్దర్నీ కోల్పోయినా ఇషాన్ కిషన్ వన్ మ్యాన్ షోతో మ్యాచ్‌ని ఒక్కసారిగా మార్చేశాడు. కేవలం ఆరు పరుగులకే సంజు శాంసన్, అభిషేక్ శర్మ అవుటైనప్పటికీ ఇషాన్ కిషన్ సూర్యకుమార్ యాదవ్ కివీస్ బౌలర్లపై విరుచుకుపడి టీమిండియాకు విజయాన్ని అందించారు. రాయ్‌పూర్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన టీమిండియా న్యూజిలాండ్‌ను బ్యాటింగ్‌కి ఆహ్వానించింది. రచిన్ రవీంద్ర, మిచెల్ శాన్‌ట్నర్ రాణించడంతో న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 208 పరుగులు చేసింది. భారత్ 15.2 ఓవర్లలోనే 209 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి టీ20 వరల్డ్‌కప్ ముందు క్లియర్ కట్ మెసెజ్ ఇచ్చింది. న్యూజిలాండ్ ఇచ్చిన 209 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ ఆరంభంలోనే వికెట్లు కోల్పోయింది. సంజు శాంసన్ 5 బంతుల్లో 6 పరుగులు చేసి అవుట్ చేసి అవుటవ్వగా, అభిషేక్ శర్మ గోల్డెన్ డకౌట్ అయ్యాడు. దాంతో భారత్ ఆరు పరుగులకే రెండు వికెట్లు కోల్పోయింది. ఇషాన్ కిషన్ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఆ తర్వాత నుంచి మ్యాచ్ స్వరూపాన్నే మార్చారు. ఇషాన్ కిషన్ వరుస బౌండరీలతో స్కోర్ బోర్డును పరుగులు పెట్టించగా, సూర్యకుమార్ యాదవ్ ఇషాన్‌కు సపోర్ట్ ఇన్నింగ్స్ అందించాడు. ఈ ఇద్దరూ మూడో వికెట్‌కు ఏకంగా 122 పరుగుల భాగస్వామ్యం అందించారు. కేవలం 48 బంతుల్లోనే 122 పరుగులు చేయడం విశేషం. 32 బంతులు ఆడిన ఇషాన్ కిషన్ 11 ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 76 పరుగులు చేసి అవుటయ్యాడు. సెంచరీ చేస్తాడని అనుకున్నప్పటికీ భారీ షాట్‌కి ప్రయత్నించి వికెట్ల వెనుక దొరికిపోయాడు. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ చాలా మెలకువతో ఆడి 468 రోజుల తర్వాత హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. కేవలం 23 బంతుల్లోనే 50 పరుగులు పూర్తి చేసుకున్న సూర్య ఆ తర్వాత సెలబ్రేషన్ మోడ్‌లోకి వెళ్లిపోయాడు. ఇషాన్ కిషన్ అవుటైన తర్వాత క్రీజులోకి వచ్చిన శివమ్ దుబే కూడా తన బ్యాట్‌కి పని చెప్పాడు. సూర్యకుమార్ యాదవ్ 37 బంతుల్లో 82 పరుగులు, శివమ్ దుబే 18 బంతుల్లో 36 పరుగులతో నాటౌట్‌గా నిలిచి మ్యాచ్‌ని ముగించారు. కేవలం 15.2 ఓవర్లలోనే పరుగులు చేసి 7 వికెట్ల తేడాతో భారత్ ఘన విజయం సాధించింది.




# ఎపి మాజీమంత్రి జోగి రమేష్ జైలు నుంచి విడుదల

## నకిలీ మద్యం కేసు

**విజయవాడ,జనవరి 23,ప్రభాతవార్తప్రతినిధి:** మాజీ మంత్రి, వైసీపీ నేత జోగి రమేష్ జైలు నుంచి విడుదలయ్యారు. నకిలీ మద్యం కేసులో అరెస్ట్ అయిన జోగి రమేష్ జైలు నుంచి విడుదలైన అనంతరం మీడి యాతో మాట్లాడారు. తనను అన్యాయంగా కేసుల్లో ఇరికించి అరెస్టు చేశారని ఆరోపిం చారు. 83 రోజుల పాటు తనను జైల్లో ఉంచి, ఇష్టం వచ్చినట్లుగా వివిధ జైళ్లకు తిప్పారని వాపోయారు.

ఈ వ్యవహారంపై సీబీఐ విచారణ జరపాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించినట్లు జోగి రమేష్ తెలిపారు. అంతకుముందే పలు మీడియా సమావేశాల్లో సీబీఐ విచారణకు సిద్ధమని స్పష్టం చేశానని చెప్పారు. అవసరమైతే నార్కో అనాలసిస్, లై డిటెక్టర్ పరీక్షలకు కూడా సిద్ధమని ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. తాను తప్పు చేయ లేదని దుర్గమ్మ సాక్షి గా ప్రమాణం చేస్తా నని, చర్చకు సిద్ధమని సీఎం చంద్రబాబుని కూడా కోరానని అన్నారు.

అయినప్పటికీ కుట్రతో తనను అరెస్టు చేశారని ఆరోపించారు. తనను, తన సోదరుడిని 83 రోజుల పాటు జైల్లో ఉంచారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసులు పెడితే వైసీపీ నేతలు భయపడతారని అనుకుంటే అది పొరపాటేనని స్పష్టం చేశారు

. తమ నాయకుడు వైఎస్ జగన్ నాయకత్వంలో ముందుకు సాగుతామని అన్నారు. రేపు అమ్మవారి ఆలయానికి వెళ్లి తాను తప్పు చేయలేదని ప్రమాణం చేస్తానని జోగి రమేష్ తెలిపారు.




# కల్తీనెయ్యి కేసులో 12 మంది టిటిడి ఉద్యోగులు

## తుది ఛార్జిషీట్ దాఖలు చేసిన సిబిఐ సిట్

## మొత్తం 36 మంది నిందితులు

**తిరుపతి,జనవరి 23ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల వెంకన్న లడ్డూలకు కల్తీనెయ్యి సరఫరా చేసిన కేసు దర్యాప్తులో గత ఏడాదిన్నరకాలంగా అన్ని కోణాల్లో సమగ్రంగా విచారణ చేపట్టిన సిబిఐ సిట్ అధికారులు తుది ఛార్జిషీట్‌ను సుప్రీం కోర్టులో దాఖలు చేశారు. మొత్తం 36మందిని నిందితులుగా పేర్కొనగా వారిలో 12మంది టిటిడి ఉద్యోగులే ఉండటం విశేషం.2019వ సం వత్సరం నుండి 2024మేనెల వరకు తిరుమలకు సరఫరా చేసిన నెయ్యి వ్యవహారం, కల్తీ జరిగిన ఉదంతం,ఏప డెయిరీలు ఎలా కల్తీ నెయ్యి సర ఫరా చేశాయని అక్రమాలపై లోతుగా దర్యాప్తు చేపట్టిన సిట్ బృందం చివరకు టిటిడి మాజీ ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి, ఆయన వ్యక్తిగత సహా యకుడు చిన్నఅప్పన్నపై కూడా ఛార్జిషీట్ దాఖలు చేసినట్లు తెలుస్తోంది. మరో 11మంది టిటిడి ఉద్యోగులను ఈ అక్రమాల అవినీతిలో నిందితు లుగా చేర్చేందుకు టిటిడి ఉన్నతాధికారులు సిబిఐ కి అనుమతినిచ్చారు. గత వైసిపి ప్రభుత్వంలో 245కోట్ల రూపాయలు మేరకు 60లక్షల కిలోల నెయ్యి కల్తీ జరిగిందనే నిగ్గు తేల్చారు. ఇంకా అసలు పాలు కూడా రాని డెయిరీలు నెయ్యి సరఫరా చేయడం కూడా సిబిఐ సమాచారం సేకరించిన విషయం విదితమే. ఈ కేసు పురోగతి కూడా తుదిదశకు చేరడంతో చివరి ఛార్జిషీట్ సుప్రీం కోర్టులో దాఖలు చేసింది. ఇప్పటికే తిరుపతిలోని అలిపిరిలోని సిట్ తాత్కాలిక కార్యాల యంలో సిట్ ఐజి మురళీ రాంభా నేతృత్వంలోని డిఐజి, ఎస్పీలు ఈ అవినీతి బాగోతం ఓ కొలిక్కి తీసుకువచ్చారు. అరెస్ట్ అయ్యి నెల్లూరు ఏసిబి కోర్టులో ఉన్న నిందితుల వివరాలు, వారినుండి రాబట్టిన వివరాలు రికార్డులను పునఃపరిశీలించి ఛార్జిషీట్ దాఖలు చేశారు. సిబిఐ సిట్ అధికారులు అన్ని కోణాల్లో పూర్తి స్థాయి లో వేగవంతమైన దర్యాప్తుచేపట్టి పలు వురిని అరెస్ట్ చేసి నివేదికలు సిద్దం చేసింది. కీలకమైన జిఎంల స్థాయి అధికారులను రిమాం డ్‌కు తరలించింది. సమగ్ర వివరాలు సేకరిం చిన సిట్ అధికారులు కల్తీనెయ్యికి సూత్రధా రులు, ఇంకా పాత్రధారులు ఎవరని తేల్చేయ నున్నారు. ఈ కేసుకు సంబంధించి మూలాలు తమిళనాడు నుండి ఉత్తరాఖండ్ వరకు విస్తరిం చిందనేది సిబిఐ గుర్తించింది. ఆంధ్రప్రదేశ్‌తో బాటు రాజస్థాన్, ఉత్తరప్రదేశ్,ఢిల్లీ, మహారాష్ట్ర, హర్యానా తోబాటు 12రాష్ట్రాలు ఈ కేసుతో సం బంధాలున్నట్లు సిట్ సమాచారం. టిటిడి కొను గోళ్ల విభాగానికి చెందిన ముగ్గురు జిఎంలు నిందితుల జాబితాలో చేరడం సంచలనం.

# సింగూరు ప్రాజెక్టు మరమ్మతుల ఫలితం..

# వేసవిలో బీర్ల ఫ్యాక్టరీలకు నిలిచిపోనున్న నీటి సరఫరా

## బీర్ల ధర కూడా పెరిగే అవకాశం

## 11 రాష్ట్రాలపై సరఫరా ప్రభావం

## ప్రత్యామ్నాయంవైపు రాష్ట్ర సర్కార్

**హైదరాబాద్, జనవరి 23, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఈ వేసవిలో బీర్లకు కొరత ఏర్పడే ప్రమాదం ఉత్పన్నమవుతోంది. సింగూరు ప్రాజెక్టులో మరమ్మ తుల కారణంగా బీర్ల ఫ్యాక్టరీలకు నీటి సరఫరా నిలిచిపోనుంది. దీంతో ఉత్పత్తి తగ్గడంతో పాటు, వాటి ధరలను కూడా పెంచే అవకాశం ఉందని తెలుస్తోంది. రాష్ట్రంతో పాటు, మరో 10 రాష్ట్రాలపై ఈ ప్రభావం పడనుంది. దీంతో రాష్ట్ర సర్కార్ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. సాధారణంగా తెలంగాణలో మద్యం అమ్మకాలు జోరుగా సాగుతుంటాయి. మరీ ముఖ్యంగా వేసవిలో బీర్ల అమ్మకాలు గణనీయంగా పెరుగుతాయి. అయితే, ఈ వేసవిలో బీర్ లవర్స్ నిరాశ ఎదురవ్వబోతోందని అధికారవర్గాల ద్వారా వెల్లడవుతోంది. దీనికి ప్రధాన కారణం సింగూరు ప్రాజెక్ట్‌కు మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో ఈ పరిస్థితి ఉత్పన్నంకానుంది.

ఈ మరమ్మతుల వల్ల సంగారెడ్డిలోని నాలుగు ప్రధాన బెవరేజెస్ కంపెనీలకు సింగూరు నుంచి అందే నీటి సరఫరా ఆగిపోనుంది. ఈనీటి వనరులు లేకపోవడంతో బీర్ల ఉత్పత్తి భారీగా పడిపోయే సూచనలు కనిపిస్తున్నాయని అంటున్నారు. ప్రస్తుతం ప్రతిరోజూ 44 లక్షల లీటర్ల నీరు సింగూరు జలమండలి నుంచి బీరు ఫ్యాక్టరీలకు సరఫరా అవుతోంది. మరమ్మతుల కారణంగా ఈ నీటి సరఫరా నిలిచిపోతే, బీర్ల ఉత్పత్తి పూర్తిగా ఆగిపోయే ప్రమాదం ఉంది. సింగూరు డ్యామ్ సేఫ్టీ రివ్యూ ప్యానెల్ సూచనల మేరకు, ఈ వేసవి కాలంలో ప్రాజెక్టులోని నీటిని పూర్తిగా ఖాళీ చేసి మరమ్మతులు చేపట్టేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. సంగారెడ్డి జిల్లాలోని 4 బెవరేజెస్ కంపెనీలకు ఈ ప్రాజెక్టు నుంచే నీరు అందుతోంది. ఈ ఫ్యాక్టరీల నుంచే దేశంలోని 11 రాష్ట్రాలకు బీర్లు సరఫరా అవుతుండటం గమనార్హం. ప్రస్తుతం ఈ ఫ్యాక్టరీలకు నామమాత్రపు ధరకే నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టు మరమ్మతుల తర్వాత నీటి సరఫరా కోసం అధిక ఛార్జీలు వసూలు చేస్తే, బీర్ల ధరలు కూడా పెరిగే అవకాశం ఉంది. ఒకవేళ ఉత్పత్తి తగ్గితే, ప్రభుత్వం ఇతర రాష్ట్రాల నుంచి బీర్లను దిగుమతి చేసుకోవాల్సి వస్తుంది. ఇందువల్ల రవాణా ఖర్చుల వల్ల ధరలు పెరగొచ్చు. ఇవన్నీ గమనిస్తే సింగూరు ప్రాజెక్టు మరమ్మతుల ఫలితం బీర్ల ఫ్యాక్టరీలకు భారీ నష్టం జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది.

# స్వర్ణ గ్రామ, వార్డు శాఖల్లో మూడంచెల అధికారుల వ్యవస్థ

**విజయవాడ.జనవరి23,ప్రభాతవార్తప్రతినిధి:**ఏపీలోని స్వర్ణ గ్రామ, వార్డు శాఖల్లో మూడంచెల అధికారుల వ్యవస్థ వచ్చే నెల నుంచి అమలులోకి రానుంది. ఇప్పటికే కొన్ని చోట్ల అధికారులను నియమించారు. మిగిలిన చోట్ల నెలాఖరులోగా పూర్తి చేయనున్నారు. ఫిబ్రవరి 15 నుంచి పూర్తి స్థాయిలో వ్యవస్థ అందుబాటులోకి రానుందని అధికారులు వెల్లడించారు. ఇప్పటికే స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోంది. జనాభా ఆధారంగా గ్రామ, వార్డు కార్యాలయాలను 3 క్యాటగిరీలుగా విభజించింది. వాటిలో 6, 7, 8 మంది చొప్పున ఉద్యోగులు ఉండేలా సర్దుబాటు కూడా చేశారు. దీంతో పాటు ఉద్యోగుల పై పర్యవేక్షణ, పరిపాలన వ్యవహారాల కోసం మండల, మున్సిపల్, జిల్లా స్థాయిలో ప్రత్యేకంగా అధికారులను నియమించాలని నిర్ణయించారు. జిల్లా కేంద్రాల్లో శాశ్వత అధికారులను ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్రంలోని 123 పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల్లోను కూడా స్వర్ణ వార్డు కార్యాలయాల పర్యవేక్షణ కోసం అధికారులను నియమిస్తున్నారు. పురపాలకశాఖ నుంచి అదనపు కమిషనర్ స్థాయి అధికారులను డిప్యుటేషన్ పై తీసుకున్నారు. మండల స్థాయి పర్యవేక్షణలో 660 మంది అధికారులు ఉండగా ఇప్పటికే 610 మంది బాధ్యతలు చేపట్టారు. డిప్యూటీ ఎంపీడీవోలను డిప్యుటేషన్‌పై తీసుకున్నారు. మరో 50 మంది కోసం పంచా యతీరాజ్ శాఖకు లేఖ రాశారు.స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాల సిబ్బంది పనివేళల్లో ఉదయం పదిన్నర నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టింది. ఉద్యోగులకు ముఖ హాజరు తప్పనిసరి చేసింది. కార్యాలయంలోనే ఆన్‌లైన్ ద్వారా ఉదయం, సాయంత్రం హాజరు వేయాల్సి ఉంటుంది. హాజరు వేయకపోతే ఆ రోజు విధు లకు రానట్లే. అలాగే ఆ రోజు వేతనం నిలిపేలా విధి విధానాలను సిద్ధం చేసింది. దేవా దాయశాఖలోని గ్రేడ్3 ఈవో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ పోస్టులను భర్తీ చేసేందుకు గానూ స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు శాఖ ఉద్యోగులను తీసుకునేందుకు దేవాదాయశాఖ కసరత్తు చేస్తోంది. స్వర్ణ గ్రామ, స్వర్ణవార్డుశాఖలో అద నంగా ఉన్న ఉద్యోగులను దేవాదాయశాఖలో విలీనం చేయనున్నారు.



## వెలుగులరేడు వేడుకకు సర్వం సిద్ధం

**- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు**

**శ్రీకాకుళం, జనవరి 23 ప్రభాతవార్త:** రాష్ట్ర పండుగ హోదాలో జరుగుతున్న శ్రీకాకుళం జిల్లా అరసవల్లి రథసప్తమి వేడుకలు తుది ఘట్టానికి చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం సూర్యజయంతిని పురస్కరించుకుని దర్శనానికి విచ్చేస్తున్న అశేష భక్తజనం. ప్రశాంతంగా దర్శనం చేసుకుని వెళ్లాలని కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కోరారు. రాష్ట్ర పండుగ హోదాలో జరుగుతున్న ఈ వేడుకకు అన్ని ఏర్పాట్లను గడచిన నెల రోజులుగా వివిధ స్థాయిలలో సమీక్ష చేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వహిస్తున్నామని ఆఖరి రోజు దర్శనాల సమయంలో కూడా ప్రశాంతమైన దర్శనం జరిగేలా ఏర్పాట్లు చేసినట్లు స్పష్టం చేశారు. ఉచిత దర్శనంతో పాటు వివిధ కేటగిరీలలో దర్శన ఏర్పాట్లు చేశామని గతంలో మాదిరి కాకుండా టైం స్లాట్ విధానాన్ని ఈ ఏట అవలంభిస్తున్న నేపథ్యంలో భక్తులందరూ సమయపాలన పాటించి పోలీసులకు, అధికారులకు సహకరిస్తూ దర్శనం చేసుకోవాలని కోరారు. గడచిన కొద్ది రోజులుగా శ్రీకాకుళం నగరంలో జరిగిన విశేష సాంస్కృతిక, వినోద, క్రీడా కార్యక్రమాలు ఆహుతులను ఎంతగానో అలరించాయని అన్నారు. అరసవల్లి ఆదిత్యునికి అత్యంత ప్రీతిపాత్రమైన ఆదివారం రోజున ఈ వేడుక జరగనుండటంతో భక్తులు పెద్ద ఎత్తున వస్తారని అంచనా వేస్తున్నామని అందుకు తగ్గ ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

## ఎసిబి వలలో పల్నాడు డిఆర్వో

**రూ.3లక్షలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ వైనం**

**నరసరావుపేట, జనవరి 23 ప్రభాతవార్త :** పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఏసీబీ అధికారులు ఆకస్మిక దాడులను నిర్వహించారు. డిఆర్ఓగా విధులు నిర్వహిస్తున్న మురళి కి సంబంధించి వచ్చిన సమాచారంతో పక్కా ప్రణాళికలతో అధికారులు ఆకస్మిక తనిఖీచేశారు. రూ.మూడు లక్షలు లంచం తీసుకుంటూ డిఆర్ఓ మురళి ఏసీబీకి చిక్కారు. ఏకంగా పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలోనే లంచం తీసుకుంటూ డిఆర్వో ఏసీబీ అధికారులకు దొరకటం సంచలనంగా మారింది.కాగా క్యాటరింగ్ చేసిన బిల్లులు మంజూరుకి మురళి భారీగా లంచం అడిగి దొరికిపోయారు. మొత్తం 26 లక్షల రూపాయల క్యాటరింగ్ బిల్లు మంజూరుకి లంచం డిమాండ్ చేయడంతో విసిగిపోయిన కాంట్రాక్టర్లు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు.

## నా దేహం వైద్యవిద్యకు పాఠం కావాలి!

**- మరణానంతరం భౌతిక కాయం వైద్యకళాశాలకు దానం ఇస్తూ అఫిడవిట్ - టిటిడి మహిళ ఉద్యోగిని ఔదార్యం**



**తిరుపతి,జనవరి 23ప్రభాతవార్తప్రతినిధి:** అగ్నిసాక్షిగా పెళ్ళిచేసుకుని భర్తే సర్వస్వంగా జీవితం గడిపిన ఓ మహిళ భర్తబాటలోనే తనూ నడచి ఆదర్శంగా ఉండాలని నిర్ణయం తీసుకుంది. మరణానంతరం తన దేహం మట్టిలో కలవడం కంటే విద్యార్థులకు పాఠం కావాలని టిటిడి మహిళ సంక్షేమ విభాగం అధ్యక్షురాలు, ఆడిట్ విభాగం సూపరింటెండెంట్ కట్టమంచి ఇందిర అన్నారు. గత ఏడాది ఆమె భర్త మరణానంతరం భౌతిక కాయాన్ని స్వయంగా ఆమే వైద్యకళాశాలకు అందించారు. తానూ అదే బాటలో నడుస్తానని స్పష్టం చేశారు. తన మరణానంతరం భౌతిక కాయాన్ని స్విమ్స్ -పద్మావతి మెడికల్ కళాశాలకు దానం ఇచ్చేందుకు అంగీకరించారు. ఈ మేరకు శుక్రవారం తిరుపతి టిటిడి పరిపాలనా భవనంలో టిటిడి ఇఒ ఛాంబర్ లో ఇఒ అనిల్ కుమార్ సింఘాల్ ను కలిసి అఫిడవిట్ ను అందజేశారు. అనేంతరం ఇందిర మాట్లాడుతూ తన భర్త డాక్టర్ కె. శివాజీ పలు కార్పోరేట్ కాలేజీలలో ఫ్యాకల్టీగా పనిచేశారని, తాను చనిపోయినా విద్యార్థులకు ఉపయోగపడాలనే సదుద్దేశ్యంతో గత నవంబర్ 15వ తేదీన మరణానంతరం తన భర్త పార్థివదేవాన్ని మెడికల్ కాలేజీకి డొనేషన్ చేశామన్నారు. తన భర్త కోరిక మేరకు తాను చనిపోయాక తన పార్థివదేవాన్ని వైద్యకళాశాల విద్యార్థులకు ఉపయోగపడాలనే ఉద్దేశ్యంతో శుక్రవారం అందుకు సంబంధించిన అఫిడవిట్ ను టిటిడి ఇఒ కు అందజేశానన్నారు. ఇందిర నిర్ణయాన్ని టిటిడి ఇఒ అనిల్ కుమార్ సింఘాల్ అభినందించారు. ఆమె నిర్ణయం తీసుకోవడం హార్షనీయమన్నారు. అఫిడవిట్ ను పద్మావతి మెడికల్ కళాశాల అనాటమి డిపార్ట్ మెంట్ అధికారులకు టిటిడి ఇఒ పంపించారు. కార్పొరేట్ స్కూలు స్థాపించి, ఎంతోమంది విద్యార్థులకు తక్కువ ఫీజులతో చదువు చెప్పించడంతోపాటు కొంతమందికి ఉపాధి చూపారు.

## బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సైనానెహ్వాల్ మనందరికీ గర్వకారణం: సిఎం చంద్రబాబు

**విజయవాడ.జనవరి 23,ప్రభాతవార్తప్రతినిధి:** భారత బ్యాడ్మింటన్‌ను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లారని కితాబు ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు.ఆమె పట్టుదల యువ క్రీడాకారులకు నిత్య స్ఫూర్తి అని వెల్లడి భారత బ్యాడ్మింటన్ దిగ్గజం సైనా నెహ్వాల్ ఆట నుంచి తప్పుకోవడంపై చంద్రబాబు స్పందించారు. భారత క్రీడా రంగానికి ఆమె చేసిన సేవలను కొనియాడుతూ "ఎక్స్"వేదికగా ప్రశంసల జల్లు కురిపించారు. సైనా నెహ్వాల్ సాధించిన విజయాలు దేశానికే గర్వకారణమని చంద్రబాబు పేర్కొన్నారు. "సైనా నెహ్వాల్‌ను చూసి మనమంతా ఎంతో గర్విస్తున్నాం. భారత బ్యాడ్మింటన్ చరిత్రలో ఆమె ఒక సువర్ణాధ్యాయాన్ని లిఖించారు. మన బ్యాడ్మింటన్‌ను ప్రపంచ పటంలో సగర్వంగా నిలిపిన ఘనత ఆమె సొంతం. సైనా కఠోర శ్రమ, పట్టుదల, ఆమె సాధించిన విజయాలు ఒక చెరగని ముద్ర వేశాయి. ఇవి ఎంతోమంది యువ క్రీడాకారులు రాకెట్ పట్టుకుని కోర్టులో అడుగుపెట్టేలా స్ఫూర్తినిస్తూనే ఉంటాయి. బ్యాడ్మింటన్‌కు మీరు చేసిన సేవలకు ధన్యవాదాలు సైనా. రిటైర్మెంట్ తర్వాత మీరు చేపట్టబోయే పనులు విజయవంతం కావాలని, మీ భవిష్యత్తు బాగుండాలని కోరుకుంటున్నాను" అని చంద్రబాబు తన సందేశంలో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, మోకాలి గాయాల కారణంగా ఇక ఆడలేనంటూ సైనా నెహ్వాల్ పరోక్షంగా బ్యాడ్మింటన్‌కు గుడ్ బై చెప్పడం తెలిసిందే. సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీ వంటి క్రీడా దిగ్గజాలు కూడా సైనా సేవలను కొనియాడుతూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. లండన్ ఒలింపిక్స్ లో కాంస్య పతకం సాధించి భారతీయ బ్యాడ్మింటన్ ముఖచిత్రాన్ని మార్చిన సైనా.. తన నిర్ణయంతో అభిమానులను కాస్త నిరాశకు గురిచేసినా, భారత బ్యాడ్మింటన్ రంగంలో ఆమె ఘనమైన వారసత్వం మాత్రం శాశ్వతంగా నిలిచిపోతుంది. సైనా నెహ్వాల్‌పై ప్రశంసలు జల్లు కురిపించిన లోకేష్ ప్రముఖ బ్యాడ్మింటన్ స్టార్ సైనా నెహ్వాల్ ఆట నుంచి వైదొలగిన సందర్భంలో ఏపీ మంత్రి నారా లోకేశ్ ఆమెపై ప్రశంసల వర్షం కురిపించారు. భారత క్రీడా రంగానికి ఆమె చేసిన సేవలు వెలకట్టలేనివని కొనియాడుతూ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. సైనా నెహ్వాల్ నిజమైన మార్గదర్శకురాలని, భారత బ్యాడ్మింటన్ దశ దిశను మార్చిన ఘనత ఆమెకే దక్కుతుందని లోకేశ్ పేర్కొన్నారు. కేవలం తన పట్టుదల, అత్యుత్తమ ఆటతీరుతో భారత బ్యాడ్మింటన్‌ను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లారని మంత్రి ప్రశంసించారు. సైనా క్రీడా ప్రయాణం ఎంతోమంది భారతీయ యువతలో స్ఫూర్తి నింపిందని, పెద్ద కలలు కనేలా చేసిందని తెలిపారు. మైదానంలో భయం లేకుండా ఎలా పోటీపడాలో నేటి తర్వానికి ఆమె నేర్పించారని అన్నారు. సైనా వదిలి వెళుతున్న ఈ గొప్ప వారసత్వానికి దేశం ఎప్పుడూ రుణపడి ఉంటుందని లోకేశ్ అభిప్రాయపడ్డారు. ఆమె తన తదుపరి జీవితంలోనూ మరిన్ని విజయాలు సాధించాలని, భవిష్యత్తు సాఫీగా సాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు నారా లోకేశ్ తన సందేశంలో వెల్లడించారు.

## సామాజిక బాధ్యత, ఆర్థిక రాజకీయ వికేంద్రీకరణ కేపిటలిజం, కమ్యూనిజంలో లేదు : కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**- విజయవాడలో ఏకాత్మ మానవ దర్శన్ జాతీయ మహాసభ పునఃస్మరణ సదస్సులో మంత్రి**

**విజయవాడ.జనవరి23,ప్రభాతవార్తప్రతినిధి:**ఆచరణ సాధ్యం కాని సిద్ధాంతాలను ఆనాటి పాలకులు భారత్ పై రుద్దారని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు., గత 12 సంవత్సరాలుగా భారత్ ఏకాత్మ మానవ వాదంలో, నరేంద్ర మోదీ పాలనలో ఉంది. ప్రపంచ దేశాలన్నీ అనేక సంక్షోభాలతో ఉంటే, మన దేశంలో ఏ రకంగా పరిపాలన జరుగుతోందో దేశ ప్రజలందరూ చూడాలి. అంత్యోదయ కార్యక్రమంలో 12 కోట్ల ఇళ్ళలో మరుగుదొడ్ల నిర్మాణం జరిగింది. 1965వ సంవత్సరంలో జరిగిన జనసంఘ్ విధంగానే ఈ కార్యక్రమం కూడా అందరిని తీసుకెళ్తుందన్నారు. విజయవాడలో 1965లో జరిగిన జనసంఘ్ మహాసభల స్మృతులను గుర్తు చేసుకునేలా శుక్ర, శనివారాలు రెండు రోజుల పాటు ఏకాత్మ మానవ దర్శన్ జాతీయ మహాసభ పునఃస్మరణ సదస్సు జరుగుతోంది. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కూడా పాల్గొన్నారు. ఈరోజు చాలా పవిత్రమైన రోజు అని బీజేపీ ఏకాత్మ మానవ దర్శన పునఃస్మరణ సదస్సులో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఆచరణ సాధ్యం కాని సిద్ధాంతాలను ఆ నాటి పాలకులు భారత్ పై రుద్దారని ఎద్దేవా చేశారు. కేపిటలిజం, కమ్యూనిజం ప్రపంచానికి ముఖ్యం అని మాట్లాడుకునే సమయంలో దీనదయాళ్ ఏకాత్మ మానవ వాదాన్ని తీసుకొచ్చారని కిషన్ రెడ్డి గుర్తు చేసారు. గత 12 సంవత్సరాలుగా భారత్ ఏకాత్మ మానవ వాదంలో, నరేంద్ర మోదీ పాలనలో ఉందని కిషన్ రెడ్డి వెల్లడించారు. ప్రపంచ దేశాలన్నీ అనేక సంక్షోభాలతో ఉంటే, మన దేశంలో ఏ రకంగా పరిపాలన జరుగుతోందో దేశ ప్రజలందరూ నేరుగా చూడాలన్నారు. కమ్యూనిజం అంటున్న చైనాలో కూడా వ్యక్తికి స్వేచ్ఛ లేదని ఆయన తెలిపారు. సామాజిక బాధ్యత, ఆర్థిక రాజకీయ వికేంద్రీకరణ కేపిటలిజం, కమ్యూనిజంలో లేదని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. పాశ్చాత్య ఆలోచనా విధానాలు, కమ్యూనిస్టు సిద్ధాంతాలు పక్కకు పెట్టి ఏకాత్మ మానవ సిద్ధాంతం వచ్చిందని అన్నారు. 1986వ సంవత్సరంలో విజయవాడలో నేషనల్ కౌన్సిల్ మీటింగ్ జరిగిందని, ఆ సన్నివేశాన్ని కిషన్ రెడ్డి గుర్తు చేశారు. అంత్యోదయ కార్యక్రమంలో 12 కోట్ల ఇళ్లలో మరుగుదొడ్ల నిర్మాణం జరిగిందన్నారు. కేంద్ర మంత్రివర్గంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అవకాశం ఇచ్చారని వెల్లడించారు. రోడ్ల పక్కన వ్యాపారాలు చేసే వారికి ప్రధానమంత్రి స్వానిధి కింద చేయూతనిస్తున్నారని కిషన్ రెడ్డి తెలిపారు. దాదాపు 56 కోట్ల మంది పేదలకు జనధన్ అకౌంట్ ఇచ్చారని తెలిపారు. పేద ప్రజలకు అందరికి న్యాయ జరగాలని ఆయన ఆకాంక్షి ంచారు. పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రతిపాదించిన ఇంటిగ్రల్ హ్యూమనిజం సిద్ధాంతాన్ని ప్రస్తుత కాలమాన పరిస్థితులకు అనుగుణంగా పునఃసమీక్షి ంచడం, భవిష్యత్ కార్యాచరణను రూపొందించడం ఈ రెండు రోజుల సదస్సు ప్రధాన లక్ష్యాలుగా బీజేపీ



నిర్ణయించింది. రాజకీయ, సాంస్కృతిక, ఆర్థిక కోణాలతో పాటు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై సదస్సులో చర్చలు జరగనున్నాయి. సదస్సు ప్రాంగణంలో కేంద్రంలో బీజేపీ పాలనలో సాధించిన విజయాలపై ప్రత్యేక ప్రదర్శన కూడా ఏర్పాటు చేయనున్నారు. డిజిటల్ లావాదేవీలుపై మాజీ ఆర్థికమంత్రి చిదంబరం విమర్శించారని కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదవాడు కూడా ఆత్మగౌరవంతో వ్యాపారం చేసుకుంటున్నాడని వెల్లడించారు.

గిరిజన తండాలు వివక్షకు గురయ్యాయని కిషన్ రెడ్డి అన్నారు. ఆదివాసీ పల్లెల కోసం సమగ్రమైన మౌలిక వసతులు కేంద్రం కల్పిస్తోందని తెలిపారు. రైతులకు సమ్మాన్ నిధి, ఫసల్ భీమా యోజన ద్వారా సహకారం అందిస్తున్నామని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. సంచార తెగల కోసం కేంద్ర ప్రభుత్వం ఒక కమీషన్ ను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిందన్నారు. బీసీల కోసం కూడా సమగ్రమైన

## 26న శాసనమండలి, అసెంబ్లీ, సచివాలయం, హైకోర్టుల్లో గణతంత్ర దినోత్సవాలు

**సచివాలయం,జనవరి 23,ప్రభాతవార్త :** 77వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఈనెల 26వ తేది సోమవారం ఉదయం 8గంటలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ భవనం ప్రాంగణంలో జరిగే వేడుకల్లో శాసనమండలి అధ్యక్షులు కె.మోషేన్ రాజు పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. ఉదయం 8.15గంటలకు రాష్ట్ర అసెంబ్లీ భవనం వద్ద రాష్ట్ర శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. ఏపి సచివాలయం మొదటి భవనం వద్ద సోమవారం ఉదయం 7.30గంటలకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. నేలపాడులోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం వద్ద సోమవారం ఉదయం 10గంటలకు రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు.

## రాజధాని రైతులకు ఇ - లాటరీ ద్వారా 115 ప్లాట్ల కేటాయింపు

**విజయవాడ.జనవరి 23,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని రైతులకు ఇ - లాటరీ ద్వారా 115 ప్లాట్ల కేటాయించినట్లు ఏపీ సీఆర్డీఏ ప్రకటించింది. నిర్దేశిత నిబంధనల ప్రకారం పూర్తి పారదర్శకంగా ప్లాట్లను కేటాయించినట్లు సీఆర్డీఏ అధికారులు నిర్ధారించారు..రోడ్లు శూల లేని,ల్యాండ్ అక్విజిషన్ స్థలంలో లేని ప్లాట్లు మాత్రమే కేటాయిస్తున్నామని తెలిపారు.పల్లపు ప్రాంతాలు,సమాధుల సమీపంలో ప్లాట్లు కేటాయిస్తున్నారనేది కొంతమంది అపోహ మాత్రమే అని తెలిపారు. దక్షి ణ ముఖంగా వచ్చిన ప్లాట్లను మొదటి నుంచీ రోడ్డు శూల ప్లాటుగా పరిగణించలేదని తెలిపారు. రిటర్న్ బుల్ ప్లాట్ లేఅవుట్ రూల్స్ ప్రకారమే మొత్తం ప్రక్రియ జరిగిందన్నారు.

## హనుమాపురం దగ్గర రోడ్డు ప్రమాదం

**పల్టీలు కొట్టిన కారు.. ఇద్దరు వ్యక్తులు మృతి, మరో ఇద్దరికి తీవ్ర గాయాలు**



**పెద్దకడబూరు జనవరి 23 ప్రభాతవార్త :** కర్నూలు జిల్లా పెద్దకడబూరు మండల పరిధిలో హనుమాపురం బస్టాండ్ దగ్గర నేషనల్ హైవే పై శుక్రవారం ఉదయం 8 గంటలకు ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది స్థానికులు , పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఆదోని నుండి ఎమ్మినూరు వైపు వస్తున్న కారు హనుమాపురం దగ్గర రోడ్డుకు అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించిపోయి పక్కనున్న పొలంలోకి వెళ్లి టేకు చెట్టును ఢీ కొట్టి గాల్లో పటేల్ కొట్టింది దీంతో కారు నుజ్జునుజ్జయింది కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందగా తీవ్రంగా గాయపడిన మరో ఇద్దరిని ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు ఆ ప్రాంతంలో కొంతసేపు భయానక వాతావరణ నెలకొంది తీవ్రంగా గాయపడిన కారులో ఉన్న వ్యక్తులను అతి కష్టం మీద స్థానికులు పోలీసులు బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు కారు అతివేగంతో రావడం వల్ల అదుపుతప్పి పల్టీలు కొట్టిందని బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## తక్కువ ఖర్చుతో నాణ్యమైన విద్యుత్తు: మంత్రి గొట్టిపాటి

**ఏలూరు, జనవరి 23 ప్రభాతవార్త:** తక్కువ ఖర్చుతో నాణ్యమైన విద్యుత్ ను నిరంతరాయం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. ఏలూరు జిల్లా ధర్మాజీగూడెంలో 132 33 కేవీ సబ్ స్టేషన్ ను మంత్రులు గొట్టిపాటి, కొలుసు పార్థ సారథిలు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ.. 2019 వరకు మిగులు విద్యుత్ రాష్ట్రంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ జగన్ అనైతిక నిర్ణయాలతో నష్టాల ఊబిలోకి కూరుకు పోయిందన్నారు. రాష్ట్రంలో ఉన్న విద్యుత్ ప్లాంట్లను షట్ డౌన్ చేసి బయట రాష్ట్రాల నుంచి విద్యుత్ కొనుగోలు చేయడంతో ప్రజలపై రూ.30 వేల కోట్ల భారం పడిందన్నారు. తొమ్మిది సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి విద్యుత్ వ్యవస్థను సర్వ నాశనం చేశారని మంత్రి గొట్టిపాటి మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వ తప్పుడు నిర్ణయాలతో మొత్తం విద్యుత్ వ్యవస్థకు సుమారు రూ.1.30 లక్షల కోట్లు నష్టం వాటిల్లిందని మంత్రి వాపోయారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత విద్యుత్ వ్యవస్థను యాథాతథ స్థితికి తీసుకు రావడానికి ప్రయత్నిస్తున్నామని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు.

ఏటేటా పెరుగుతున్న విద్యుత్ వినియోగానికి తగిన విధంగా., సుమారు రూ.6 వేల కోట్లతో 220 కేవీ, 400 కేవీ వంటి పెద్ద సబ్ స్టేషన్లతో పాటు 132 33 కేవీ సబ్ స్టేషన్లను కూడా అవసరమైన అన్నిప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

# తిరుమల సమాచారం

## వసంతపంచమిన వేదోక్తంగా వార్షిక విశేషపూజ



**తిరుమల,జనవరి 23ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వసంతపంచమిపర్వదినాన శుక్రవారం ఉదయం వార్షిక విశేషపూజ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ విశేషపూజను శ్రీవారి ఆలయంలోని కల్యాణమండపంలో శుక్రవారం ఉదయం వైభవంగా వేదోక్తంగా నిర్వహించారు. ఆలయఅర్చకులు ముందుగా ఉత్సవమూర్తులు శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామిని వేంచేపుచేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చతుర్థశ కళశావాహనంతో పుణ్యాహవచనం, వివిధ క్రతువులను నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతితో ఈ కార్యక్రమం ముగిసింది.ఇకపై ప్రతి ఏడాది వసంతపంచమి పర్వదినాన ఈ పూజను సర్కార్(ఏకాంతంగా)టిటిడి నిర్వహిస్తుంది. గతంలో ప్రతి సోమవారం ఉదయం దేవదేవుని ఉత్సవమూర్తులు శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామికి విశేషపూజ ,స్నపనతిరుమంజనం జరిపించేవారు. ఉత్సవమూర్తుల అరుగుదలను అరికట్టి భవిష్యత్తు తరాలకు అందించేందుకు ఏడాదికోసారి మాత్రమే అభిషేకం నిర్వహించాలని జీయంగార్లు,అర్చకులు, ఆగమపండితుల సూచనలతో ఏడాదికోసారి జరిపిస్తున్నారు. ఈ పూజాకార్యక్రమంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## టిటిడి ట్రస్ట్‌లకు భూరి విరాళాలు



**తిరుమల,జనవరి 23ప్రభాతవార్తప్రతినిధి:** హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహిస్తున్న పలు పథకాలు, ట్రస్ట్‌లకు దాతలైన కోటీశ్వరులు తమవంతుగా భూరీ విరాళాలందిస్తున్నారు. శుక్రవారం ఉదయం హైదరాబాద్‌కు చెందిన పిఎల్ రాజు కన్‌స్ట్రక్షన్స్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధి రాజగోపాలరాజు 2.50కోట్ల రూపాయలు డిడిలను విరాళాల రూపంలో అందజేశారు.ఇందులో శ్రీవేంకటేశ్వర ప్రాణదానట్రస్ట్‌కు 75లక్షలు రూపాయలు, ఎస్వీవిద్యాదానట్రస్ట్‌కు 75లక్షలు, బర్డ్ ట్రస్ట్‌కు 50లక్షలు, ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు 25లక్షలు రూపాయలు, ఎస్వీ గోసంరక్షణట్రస్ట్‌కు 25లక్షలు రూపాయలు వంతున డిడిలను టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి దాతలు రంగనాయకుల మండపంలో అందజేశారు.

## యువనేత నారాలోకేష్‌కు శక్తిసామర్థ్యాలు ప్రసాదించాలి

**- మంత్రి పేరున 1,116కొబ్బరికాయ మొక్కులు**



**తిరుమల,జనవరి 23ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌ను సమగ్రంగా అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్ళే విధంగా అభివృద్ధి చేసేందుకు యువనేత, రాష్ట్రమంత్రి నారా లోకేశ్‌కు శక్తిసామర్థ్యాలు ప్రసాదించాలని శ్రీవారిని టిడిపి నేతలు వేడుకున్నారు. ఆయన నాయకత్వంలో రాష్ట్రం సుభిక్షంగా, సుసంపన్నంగా అభివృద్ధిపథంలో ముందుకు సాగాలని ప్రార్థించారు. లోకేశ్‌కు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని, రాజకీయంగా మరింత ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. రాష్ట్ర రాజకీయాల్లో కొత్త దిశతో పాలనసాగిస్తున్న లోకేశ్ భవిష్యత్తులో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు.నారాలోకేశ్ జన్మదిన వేడుకలను తిరుమల ఆలయం ముందు అఖిలాండం వద్ద టిడిపి రాష్ట్రకమిటీ నాయకులు డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, వి. పుష్పావతియాదవ్,బుల్లెట్‌రమణ,రాజుయాదవ్,బిజి కృష్ణయాదవ్,శివషణ్ముఖన్ కార్యకర్తలు పాల్గొని 1,116 కొబ్బరికాయలు కొట్టారు. మూడుకిలోల కర్పూరం అఖిలాండంలో వేసి పూజలు చేశారు.

## వెంకన్న దర్శనంతో ఆనందం : ప్రముఖులు



**తిరుమల,జనవరి 23ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దివ్యమంగళరూప దర్శనం మనస్సుకు ఆనందం కలిగించిందని ప్రముఖులు విశ్వాసం తెలిబుచ్చారు. దేవదేవునిఆశీస్సులతో తెలుగుప్రజలందరికీ శుభాలు కలగాలని ఆకాంక్షించారు. తిరుమలలో భక్తులు ప్రశాంతంగా దేవుని దర్శనం చేసుకునేలా క్యూలైన్ల నిర్వహణ అద్భుతంగా ఉందని ప్రముఖులు తెలిపారు. శుక్రవారం ఉదయం తెలంగాణ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, సినీసంగీత దర్శకుడు డ్రమ్స్ శివమణి, టిడిపి నేత,దాత భాష్యం రామకృష్ణ కుటుంబసభ్యులతో కలసి ఉదయం తిరుమల ఆలయంలోనికి చేరుకున్నారు. విఐపి బ్రేక్‌లో శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.ఆలయం వెలుపల శివమణిని చూడటంతోబాటు ఫోటోలుదిగేందుకు భక్తులు ఉత్సాహం చూపారు.

## రథసప్తమికి విస్తృత ఏర్పాట్లు

**- రేపు ఉదయం నుండి రాత్రి వరకు సప్తవాహన సేవలు**

**- సీనియర్ అధికారులు, పోలీసులు సేవకులే**



**తిరుమల,జనవరి 23ప్రభాతవార్తప్రతినిధి:** మాఘమాసం సప్తమితిధి ఆదివారం (రేపు) సూర్యజయంతి(రథసప్తమి) వేడుకలు అంగరంగవైభవంగా జరగనున్నాయి. ఉదయం 5.30గంటల నుండి రాత్రి 9గంటల వరకు ఒకేరోజు ఏడు వాహనాలపై మలయప్పస్వామి ఉభయ దేవేరులతో కలసి ఆలయ మాఢవీధుల్లో ఊరేగనున్నారు. రేపు ఆలయంలో జరిగే అన్ని ఆర్జితసేవలు, ప్రత్యేకదర్శనాలతోబాటు సర్వదర్శన టైమ్‌స్లాట్ టోకెన్లు కూడా టిటిడి రద్దుచేసింది. భక్తులను వైకుంఠమ్ 2 క్యూకాంప్లెక్స్ ద్వారా అనుమతించి దర్శనం కల్పించనున్నారు.ఇందుకోసం అన్ని రకాల ఏర్పాట్లు, భక్తులకు సేవలందించేందుకు సీనియర్ అధికారులు, సిబ్బందిని నియమించారు. వీరంతా కలసి సమన్వయంతో భక్తులకు తిరుమలలోని మాఢవీధుల్లో, గ్యాలరీల్లో నిరంతరాయంగా సేవలందిస్తారు. రథసప్తమి పర్వదినం ఏర్పాట్లు, భక్తులకు సౌకర్యాలు, భద్రత అంశాలపై ,సేవలపై టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఇఒ వీరబ్రహ్మం, సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ ,తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, తిరుపతి నగర కమిషనర్ మౌర్య, ,విఎస్ఒలు ఎస్టీవిరామ్‌కుమార్, సురేంద్ర, తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణ, డిఎస్పీ విజయశేఖర్ విజిలెన్స్,పోలీసు విభాగాల అధికారులు సిబ్బందితో పర్యవేక్షణ, భక్తులకు సేవలందించడంపై సిద్ధమయ్యారు. ఆలయం ముందు, మాఢవీధుల్లో గ్యాలరీలు, జర్మన్‌షెడ్లను ఇప్పటికే ఏర్పాటుచేశారు. ఉదయం నుండి రాత్రి వరకు నిరంతరాయంగా భక్తులకు 14 రకాల అన్నప్రసాదాలు, తాగునీరు. టీ,కాఫీ,పాలు అందించేలా శ్రీవారిసేవకులు, టిటిడి ఉద్యోగులకు విధులు కేటాయించారు .భక్తులకు ఉదయం నుండిరాత్రి వరకు చలికి, ఎండకు ఇబ్బందులు కలగకుండా మాఢవీధుల్లో అవసరమైన ప్రాంతాల్లో అదనపు ఏర్పాట్లు చేశారు.

**- ఉదయం నుండి రాత్రి వరకు వాహనసేవలు:** రేపు ఉదయం నుండి సూర్యప్రభవాహనం మొదలై ఉదయం 8గంటల వరకు మాఢవీధుల్లో ఊరేగనుంది. ఉదయం 9గంటల నుండి 10గంటల వరకు చిన్నశేషవాహనం, ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు గరుడవాహనం, మధ్యాహ్నం 1నుండి 2గంటల వరకు హనుమంతవాహనం, మధ్యాహ్నం 2గంటల నుండి 3గంటల వరకు చక్రస్నానమహోత్సవం,

సాయంత్రం 4గంటల నుండి 5గంటల వరకు కల్పవృక్షవాహనం, సాయంత్రం 6గంటల నుండి 7గంటల వరకు సర్వభూపాల వాహనం, రాత్రి 8గంటల నుండి 9గంటల వరకు చంద్రప్రభవాహనసేవలు నిర్వహిస్తారు.

# త్రివర్ణ సోయగం

ఫ్యాషన్ ఫ్యాషన్







త్రివర్ణ పతాకాన్ని గర్వంగా ప్రదరిశంచే రోజున ఆ రంగులనే పోలి ఉండే దుస్తులను ధరిస్తే? ఆ ఆలోచన జనవరి 26 మరింత వేడుకగా మార్చుతోంది. తెలుపు, నారింజ ఆకుపచ్చ రంగుల కాంబినేషన్‌తో కూడిన మనదైన సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రదర్శించరదానికి గణతంత్రదినోత్సవం సరైన అవకాశాన్ని అందిస్తుంది. చీరలు, లెహంగా, దుపట్టాలు, ఫ్రాక్‌లు, సల్వార్ సూట్‌లతో మన దేశ సంస్కృతి, సంప్రదాయాలను ప్రదర్శిస్తూనే దేశాభివృద్ధి, విజయాలపై దృష్టిపెట్టాలనే స్ఫూర్తినీ మది నిండి నింపు తుంది. ట్రెండీ, స్టైలిష్ సౌకర్యవంతమైన సంప్రదాయదుస్తులను గణతంత్రదినోత్సవ స్ఫూర్తిని లవ్ స్టోరీ' ఫి రి

# దక్షిణ ధ్రువంపై కాలిడిన పిన్న వయస్కురాలు..



ఎక్స్‌ప్లోరర్స్ గ్రాండ్‌స్లామ్. ఏడు ఖండాల్లో ఏడు ఎత్తైన శిఖరాలు అధిరోహించడం తో పాటు ఉత్తర, దక్షిణ ధ్రువాలకు చేరుకోవడంతో పూర్తయ్యే సాహస యాత్ర ఇది. ఈ ఘనతకు అడుగు దూరంలో ఉంది 18 ఏళ్ల కామ్ కార్తికేయ. ఇటీవలే దక్షిణ ధ్రువానికి చేరుకొన్న ఆమె.. ఈ ఘనత సాధించిన అతి పిన్న భారతీయురాలిగా, ప్రపంచంలోనే రెండో అతి పిన్న వయస్కురాలిగా చరిత్రకెక్కింది. మైనస్ ఉష్ణోగ్రత, గడ్డ కట్టుకుపోయే చలినీ లెక్కచేయకుండా ముందుకు సాగి సాహసాలంటే తనకెంత మక్కువో మరోసారి చాటిచెప్పింది. దీంతో కామ్య పేరు మరోసారి వార్తల్లో నిలిచింది.

**మూడేళ్ల వయసులోనే..!**

కామ్యది వైజాగ్. ఆమె తండ్రి ఎస్. కార్తికేయ భారతీయ నావికా దళంలో కమాండర్‌గా పనిచేస్తున్నారు. ఆయన వృత్తిరీత్యా గత కొన్నేళ్లుగా మహారాష్ట్రలోని లోనావాలలో నివాసముంటోంది కుటుంబం. ముంబయి, పుణేల మధ్య ఉన్న హిల్ స్టేషన్ ఇది. పచ్చటి ప్రకృతికి, ట్రెక్కింగ్‌కి స్వర్గధామమైన ఈ ప్రదేశమే తాను సాహసాలతో ప్రేమలో పడేలా చేసిందంటోంది మా నాన్నకు సాహసాలంటే ప్రాణం. ఈ ఇష్టంతోనే నాకు మూడేళ్ల వయసున్నప్పుడు తన నేవీ బృందంతో కలిసి తరచూ పర్వతారోహణకు వెళ్లేవారు. ఈ వంటినే నెలల తరబడి ఇంటికి దూరంగా ఉండేవారు. అమ్మా.. నాన్న ఎందుకు మనల్ని వదిలి పర్వతారోహణకు వెళ్తున్నారు? అంతగా ఆ పర్వతాల్లో ఏం ఉంది? అని ఓ రోజు అమ్మనడిగా. ఆదేంటో నీ ప్రయత్నంతో నువ్వే తెలుసుకో.. అంది అమ్మ. దాంతో నాకూ పర్వతాలెక్కాలన్న మక్కువ కలిగింది. ఏడేళ్లొచ్చాక అమ్మానాన్నలతో కలిసి ఉత్తరాబండ్లలోని చంద్రశిల పర్వతం పైకి ట్రెక్కింగ్‌కు వెళ్లా. ఈ సాహసం, అక్కడి ఆహ్లాదకరమైన వాతావరణం నాకెంతో నచ్చింది. ఇక అప్పట్నుంచి ఏటా పర్వతారోహణే నా వెకేషన్‌గా మారిపోయింది. అలా క్రమక్రమంగా నా ట్రెక్కింగ్ నైపుణ్యాలు పెంచుకుంటూ ముందుకు సాగాను.. అని అంటోన్న కామ్య ఆపై స్కీయింగ్ నైపుణ్యాన్ని ఒంటబట్టించుకుంది.

**నాలుగేళ్లలో ఏడు పర్వతాలు!** చిన్న వయసులోనే పర్వతా రోహణను తన ప్రవృత్తిగా చేసుకున్న కామ్య.. మొదట తన తండ్రితో కలిసి ఎవరెస్ట్ బేస్ క్యాంప్ పైకి చేరుకుంది. ఆపై ఉత్తరాఖండ్లోని కేదార్కాంతా రూప్‌కుండ్ సరస్సు ఇతర ఎత్తైన శిఖరాలను అధిరోహించి తన నైపుణ్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని మరింతగా పెంచుకుంది. ఈ కోరికనే 7 సమీట్ ఛాలెంజ్పై కన్నేసింది కామ్య. ప్రపంచంలోని ఏడు ఖండాల్లో ఉన్న ఏడు ఎత్తైన శిఖరాల్ని అది. రోహించాలని లక్ష్యంగా పెట్టుకున్న మోంట్ కిలిమంజారో పర్వతారోహణతో ఈ ఛాలెంజ్‌ను ప్రతి పర్వతారోహణ నాకెన్నో పాఠాలు నేర్పింది. ధైర్యం, ఓర్పు సహనం.. వంటి జీవితానికి ఉపయోగపడే విషయాలెన్నో నేర్చుకున్నా. ఈ భూమిపై ఉన్న అందమంతా పర్వతాల పైనే దాగుందేమో అనిపించింది. అంటూ తన అనుభవాల్ని ఎప్పటికప్పుడు సోషల్ మీడియా వేదికగా పంచుకుంటుంది కామ్య.



# దయాస్వరూపిణి



కోల్‌కత్తా సమీపంలోని ఆ ఊరు కరవుకాటకాలతో విలవిల్లాడుతోంది. గ్రామస్థుల ఆకలి బాధలు చూసి పల్లెలోని రామచంద్రముఖర్జీ, శ్యామసుందరీదేవి దంపతులు చలించి పోయారు. రామభక్తులైన వాళ్లిద్దరూ తమకు పండిన ధాన్యంతో అన్నార్తులకు భోజన ఏర్పాట్లు చేశారు. వేడివేడిగా పులగం వండి కుటుంబసభ్యులతో కలసి వడ్డించసాగారు. గ్రామస్థులు ఆవురావురుమంటూ విస్తళ్ల వద్దకు వచ్చారు. ఆకలితో నకనకలాడుతూ ఉండటంతో పులగం వడ్డించిన వెంటనే గబగబా తినబోయారు. కానీ అది చాలా వేడిగా ఉండటంతో తినటం ఇబ్బందిగా ఉంది. వాళ్ల పరిస్థితిని రామచంద్ర పదేళ్ల కూతురు దూరం నుంచి గమనించింది. పరుగున లోనికెళ్లి విసనకర్ర తెచ్చి, పదార్థాలు చల్లబడేందుకు విసరసాగింది. అది చూసి అంతా ఉద్విగ్రతకు లోనయ్యారు. చిన్ననాటి నుంచే ఇలా తన మాతృ హృదయాన్ని, కరుణాంతరంగాన్ని ఆవిష్కరించిన ఆ దయామయి మరెవరో కాదు. రామకృష్ణపరమహంస ధర్మపత్ని, రామకృష్ణ సంఘజనని అయిన శారదాదేవి. పరుల కష్టాన్ని తన కష్టంగా భావించి పరితపించే సానుభూతి ఆధ్యాత్మిక జీవనానికి ప్రథమ అర్హత అని పసివయసులోనే నిరూపించారామె. తదనంతర కాలంలో ఆమె అన్నపూర్ణాదేవి అయ్యారు. పరమహంస శిష్యుల క్షుద్బాధనే కాదు. ఆధ్యాత్మిక పిపాసను కూడా తీర్చారు. స్థాయీ భేదం లేకుండా అందరూ శారదాదేవి మాతృప్రేమను ఆస్వాదించినవారే! ఎందరో విదేశీయులు కూడా ఆ ప్రేమమూర్తికి ప్రియశిష్యులయ్యారు. ఎవరు తనను ఆశ్రయించినా నీకొక అమ్మ ఉందని గుర్తుంచుకో! అమ్మను నేనుండగా.. ఇక భయమెందుకు? మంచివాళ్లే కాదు, తెలిసీ తెలియక చెడు నడత నడిచినవాళ్లు కూడా నా బిడ్డలే. పిల్లవాడు బట్టల్ని మురికి చేసుకుంటే. తల్లి దూరం పెడుతుందా? అంటూ అమిత ఆదరణతో అందరికీ సాంత్వననిచ్చేవారు. అందుకే రామకృష్ణ పరమహంస ప్రత్యక్ష శిష్యుడు స్వామి అభేదానంద శారదాదేవిని. శరణన్న ఆర్తుల దుఃఖాలను ఉపశమింపజేసే తల్లి, యోగీంద్రుడైన రామకృష్ణులతో పూజలందుకున్న జగజ్జనని, యుగధర్మాన్ని ఆవిష్కరించిన తల్లి, భక్తి విజ్ఞానాలను ప్రసాదించే దయాస్వరూపిణి అయిన శారదాదేవికి నిత్యం నమస్కరిస్తున్నాను అంటూ కీర్తించారు.

# మొక్కజొన్న పాయసం



**తయారీ** మెక్కజొన్న, గుజలను కూర్పవచ్చారా మిక్సీ పట్టాలి కడాయిలో నీళ్లు పోసి సందింది. మొక్కజొన్న చేను క్యాబేజీ తురుము చేసి పది నిమిషాలు ఉడికించాలి. ఇప్పుడు దపు మ్యాప్‌గా అవు తుంది. పేట్ల పోసిగా చేసి మిశ్రమాన్ని పోయాలి. ఉల్లిపారక తురుము జతచేసి బాగా కలపాలి తర్వాత ఎనిమోగా నాగేయడమ్యేరుగా ఉన్నప్పుడు ఏమీ తినాలనిపించదు కలలాబప్పుడు ఇది మహిగా ఉంటుంది. ఇరువు తగ్గాలనుకునేవాళ్ళ ఈ సూడక్కు తరచుగా తీసుకోవచ్చు.

# ఉప్పు రుచి

ఆరోగ్య భాగ్యం



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

ఉప్పు స్లోపాయిజన్ ప్యూర్ పాయిజన్, వైట్ పాయిజన్ అని అంటారు. అందుకే ఉప్పు తిననివాడు ఉత్తముడు అని అంటారు. ఇది సాలరీ అనే లాటిన్ పదం నుండి వచ్చింది. దీని అర్థం సాల్ట్. ఉప్పు రుచిని తెలిపే రుచి మొగ్గలు నాలుక రెండు వైపులా ముందు భాగంలో ఉంటాయి. ఇది వాతం తగ్గించి, పిత్త, కఫాన్ని పెంచుతుంది. దీని ప్రభావం రక్తం, కండరాలు, క్రొవ్వు, సర్వస్ టిష్యూ, కిడ్నీలపై ఎక్కువగా ఉంటుంది. సోడియం, లిథియం మాత్రమే ఉప్పు రుచిని ఉత్పత్తి చేయడానికి తెలిసిన అయాన్లు. ఆరోగ్య కణం బైట 1 శాతం ఉప్పుంటే, లోపం 8% పొటాషియం ఉంది. 1.8 నిష్పత్తిలో ఉంటుంది. మనం ఆహారం ఎక్కువగా సోడియం వాడడం వల్ల వీటి నిష్పత్తిలో రావడం వల్లనే రోగాలు వస్తున్నాయి. శరీరంలో ఉప్పు మాత్రం, రక్తం ద్వారా బైటికి పోవడం వల్ల కిడ్నీల్లో వ్యర్థపదార్థాలు చేరి కిడ్నీ వ్యాధులు, రక్తదోషలు ఏర్పడుతుంది. వీటివల్ల శరీరంలోని కణాలు బిరుసెక్కి గట్టిపడడం జరుగుతుంది.

**లాభాలు:** ఉప్పు రోజుకి 3-4 గ్రాములు అవసరం. ఇది శరీరంలో నీటిశాతాన్ని కాపాడుతూ ఉంటుంది. ఆహారం జీర్ణం కావడానికి, ప్రేవుల్లో మంట, పండ్లు రాకుండా రక్షిస్తుంది. ఇది కణాల వ్యర్థాల్ని బైటికి పంపి జీవకార్యాల్ని సక్రమంగా నిర్వహించేలా చేస్తుంది. కణం లోపం శక్తి ఉత్పత్తికి, కండరాలు శక్తివంతంగా పనిచేయడానికి ఉప్పు అవసరం. ఉప్పు, కణాలు, కండరాల పని తీరుకు అవసనం. ఉప్పు సున్నితత్వం: ఉప్పు ఎక్కువగా ఉన్న ప్రతి ఒక్కరికి అధిక రక్తపోటు ఏర్పడదు. దీనికి కారణం సోడియం కాకుండా ఇతర కారకాల వల్ల బి.పి. ఏర్పడవచ్చు. కాబట్టి ప్రతి వ్యక్తికి వారి ఉప్పు సున్నితత్వం కారణంగా రక్తపోటుపై సోడియం ప్రభావం భిన్నంగా ఉంటుంది. ఉప్పును తట్టుకునేవారి కంటే ఉప్పు పట్ల సున్నితత్వం ఉన్నవారిలో అధిక రక్తపోటు వచ్చే అవకాశం ఉంది. శరీరంలో సోడియం హోమియోస్టాసిస్ ప్రధానంగా రెనిన్, అంజయోటెన్సిన్, ఆల్డోస్టెరాన్ ద్వారా నియంత్రించ బడుతుంది. ఇది కిడ్నీలో వాస్కులార్ మృదుకండర కణాల్లో పనిచేస్తుంది. ఉప్పు సున్నితత్వంలో ఎసిఇ, ఎన్ఒఎస్3, ఎజిఐ జన్యువులు పాల్గొంటాయి. ఇది ఆహారానికి రుచిని, శరీరానికి తేమ కల్గిస్తాయి. ఇది అయానిక్ సమ్మేళనం అని చెప్పవచ్చు.


**కారణాలు :** నోరు పొడారిపోవడం, డీహైడ్రేషన్, కాల్షియం, జింక్‌లోపం, పోషకాహారలోపం, బి 12 లోపం, సైనస్ ఇన్ఫెక్షన్స్, ఎలర్జీలు, పోస్ట్ నాసల్ డ్రిప్‌కి కారణమవుతాయి. కావడం, నోటి ఇన్ఫెక్షన్స్, నోటి పుండ్లు రావడం విటమిన్ సి లోపం గర్భధారణ, మెనోపాజ్‌లో హార్మోన్ల ఇంబాలెన్స్, ఫోలేట్ లోపం ఉన్నప్పుడు శస్త్రచికిత్స నోటిలో రక్తం కారడం, (చిగుళ్ళవాపు, హెచ్‌పివి) ఉన్న ఎలర్జీలు, హైపో థైరాయిడిజమ్, షుగర్, కాలేయం, మూత్రపిండాల వైఫల్యం ఏర్పడినా, డయూరిటిక్స్, సెడెటివ్స్, పెయిన్‌కిల్లర్స్, ఆంటి హిస్టమైన్స్ అంటి డిప్రెసెంట్స్, కేన్సర్ చికిత్సకుపయోగించే కీమోథెరపీ మందులు, కేడియేషన్ థెరపీ వల్ల జలుబు ఫ్లూ మందుల, ఆంటి బయాటిక్స్ మొదలైన మందులు కూడా ఉప్పు రుచికి తోడ్పడతాయి. స్ట్రోక్, హెచ్ఐవి, ఆల్జీమర్స్ డిసీజ్. ఆటో ఇమ్యూన్ డిపస్ఆర్డర్స్ అయిన ల్యూపస్, రుమాటాయిడ్ ఆర్థ్రయిటిస్, స్జొగ్రెన్స్ సింద్రోమ్‌లో కూడా ఉప్పు రుచి ఏర్పడుతుంది.

# చిరస్థాయిగా నిలిచిపోయే చిత్రరాజం



ఈనెల 25 నుంచి ఈటీవీ విన్‌లో! తాళ్ళూరి రామేశ్వరి టైటిల్ పాత్ర పోషించిన "గొల్ల రామవ్వ" తెలుగువారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని ఈ చిత్ర ట్రైలర్ ఆవిష్కరణ వేడుకలో పాల్గొన్న ముఖ్య అతిధులు పేర్కొన్నారు. స్వర్గీయ భారత ప్రధాని పి.వి.నరసింహారావు రాసిన తెలంగాణ సాయుధ పోరాట గాథకు దృశ్యరూపంగా ముళ్లపూడి వరా దర్శకత్వంలో తెరకెక్కిన ఈ రోమాంచిత వీరగాథను సుచేత డ్రీమ్ వర్క్స్ ప్రొడక్షన్ వర్మ డ్రీమ్ క్రియేషన్స్ పతాకాలపై రామ్ విశ్వాస్ హనూర్కర్ రాఘవేంద్రవర్మ (బుజ్జి) సంయుక్తంగా నిర్మించారు. యువ ప్రతిభాశాలి అజహర్ షేక్ ఈ చిత్రానికి కార్యనిర్వాహక నిర్మాతగా కీలక బాధ్యతలు నిర్వహించడంతోపాటు సాహిత్యం సమకూర్చడం విశేషం!! ఇంతకుముందు ఈటీవీ విన్ కోసం "మౌనమే నీ భాష" చిత్రాన్ని నిర్మించి, వీక్షకుల నుంచి విశేష ఆదరణ పొందిన టీమ్ నుంచి వస్తున్న "గొల్ల రామవ్వ" ఈనెల 25 (జనవరి 25) నుంచి ఈటీవీ విన్‌లో స్ట్రీమింగ్ కానుంది. "తెలుగు సీతామాలక్ష్మి" తాళ్ళూరి రామేశ్వరి టైటిల్ పాత్రలో తెరకెక్కిన ఈ చిత్రం ట్రైలర్ లాంచ్ వేడుకలో పి.వి. నరసింహారావు తనయులు పి.వి.ప్రభాకరరావు, తనయ బారాస ఎమ్.ఎల్.సి. సురభి వాణీదేవి, ప్రముఖ గీత రచయితలు కాసర్ల శ్యామ్, మోనశ్రీ మల్లిక్, ప్రముఖ నటులు రాజీవ్ కనకాల, "రజాకార్" దర్శకులు యాటా సత్యనారాయణ, సీనియర్ దర్శకులు ఉదయ భాస్కర్ పాల్గొని చిత్ర దర్శకుడు ముళ్ళపూడి వరా, నిర్మాతలు రామ్ విశ్వాస్ హనూర్కార్, రాఘవేంద్రవర్మలను అభినందించారు. మా నాన్నగారు రాసిన గొప్ప కథల్లో ఒకటైన "గొల్ల రామవ్వ"ను ఎంతో గొప్పగా తెరకెక్కించారని వాణీదేవి ప్రశంసించారు. చిత్రబృందం పెద్ద సంఖ్యలో ఈ వేడుకలో పాలు పంచుకుని ఈ సినిమాకి పనిచేసే అదృష్టం లభించడం పట్ల గర్వం వ్యక్తం చేశారు. ఈనెల 25 నుంచి ఈటీవీ విన్‌లో ప్రసారం కానున్న ఈ చిత్రం తెలుగువారి గుండెల్లో శాశ్వత స్థానం దక్కించుకుంటుందని పేర్కొన్నారు!

# 'కానిస్టేబుల్ కనకం కాల్ ఘాట్ చాప్టర్ 3 ' సూపర్ హిట్ అవుతుంది



వర్ష బొల్లమ్మ ప్రధాన పాత్రలో నటించిన బ్లాక్ బస్టర్ సిరీస్ కానిస్టేబుల్ కనకం. ప్రశాంత్ కుమార్ దిమ్మల దర్శకత్వం వహించారు. మేఘ లేఖ, రాజీవ్ కనకాల, శ్రీనివాస్ అవసరాల కీలక పాత్రలు పోషించారు. కోవెలమూడి సత్య సాయిబాబా, వేమూరి హేమంత్ కుమార్ నిర్మించారు. ఈ సిరీస్‌కి వచ్చిన రెండు సీజన్స్ బ్లాక్ బస్టర్ హిట్‌అయ్యాయి. తాజాగా మేకర్స్ బిగ్ అనౌన్స్ మెంట్ చేశారు. కానిస్టేబుల్ కనకం చాప్టర్ 3 కాల్ ఘాట్ సినిమాగా థియేటర్స్‌లో రిలీజ్ చేయబోతున్నారు. అలాగే రెండు సీజన్స్ కలిపి థియేటర్స్‌లో సినిమాగా రిలీజ్ చేయబోతున్నారు. కాల్ ఘాట్ చాప్టర్3 గ్లింప్స్‌ని ప్రముఖ దర్శకుడు రాఘవేంద్రరావు, నిర్మాత అశ్వినిదత్ లాంచ్ చేశారు. బిగ్ అనౌన్స్మెంట్ ప్రెస్ మీట్‌లో దర్శకేంద్రుడు కె. రాఘవేంద్రరావు మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. నేను అశ్వినిదత్ కలిసి ఫస్ట్ ప్రిన్స్ మహేష్ బాబుని పరిచయం చేశాం. దానికి సాయిబాబానే ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా ఉన్నారు.. తన అనుభవాన్ని అంతా కలబోసి కానిస్టేబుల్ కనకం అనే సక్సెస్ఫుల్ ఫిల్మ్ చేశారు. ఈ వేడుకలో వారిని కలుసుకోవడం చాలా ఆనందంగా ఉంది. మళ్ళీ వెనక్కి తిరిగి చూసుకోలేదు. వాళ్లిద్దరి ముందు కానిస్టేబుల్ కనకం సక్సెస్‌ని సెలబ్రేట్ చేసుకోవడం చాలా ఆనందంగా ఉంది.

# చిరుతో వర్క్ చేయడం మైండ్‌బ్లోయింగ్‌ఎక్స్‌పీరియన్స్

డైరెక్టర్ అనిల్ రావిపూడి



మెగాస్టార్ చిరంజీవి, హిట్ మెషిన్ అనిల్ రావిపూడిల ఇండస్ట్రీ బ్లాక్ బస్టర్ 'మన శంకర వర ప్రసాద్ గారు'. విక్టరీవెంకటేష్ కీలక పాత్రలో అలరించారు. షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లపై సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మించిన ఈ చిత్రంలో నయనతార కథానాయిక నటించారు. అర్చన ఈ చిత్రాన్ని ప్రజెంట్ చేశారు. సంక్రాంతి కానుకగా ప్రపంచ వ్యాప్తంగా జనవరి 12న విడుదలైన ఈ చిత్రం మెగా బ్లాక్ బస్టర్ సక్సెస్‌ని అందుకొని రికార్డ్ బ్రేకింగ్ కలెక్షన్స్‌తో హౌస్ ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా డైరెక్టర్ అనిల్ రావిపూడి విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**పవన్ కళ్యాణ్ చిత్రాన్ని అభినందించారు.. ఎలా అనిపించింది?**

కళ్యాణ్ అభినందించడం చాలా ఆనందాన్నిచ్చింది. ఈసక్సెస్‌ని ఇండస్ట్రీ సెలబ్రేట్ చేసుకోవడం చాలా హ్యాపీనెస్ ఇచ్చింది.

**చిరంజీవికి ఈ కథ చేసినప్పుడు మీ ప్రిపరేషన్ ఏమిటి?**

చిరంజీవితో కచ్చితంగా సినిమా చేయాలనే కాన్ఫిడెన్స్‌తో ఎక్స్ట్రా ఎఫర్ట్ పెట్టి ఈ కథని సిద్ధం చేశాను. నా కెరీర్ లో చాలా ఫాస్ట్‌గా రాసిన స్క్రిప్ట్ ఇది.

**మీ పదో సినిమాకి ఎంత జాగ్రత్త తీసుకోబోతున్నారు?**

నిజానికి ఇది నాకు కాస్త కృషియల్ ఫేజ్. నెక్స్ట్ ఏం చేయాలనే దానికి గురించి ఒక రెండు పాజ్ ఇచ్చాను. మొన్న ఒక ఐడియా క్రాక్ చేసాము. ఈసారి టైటిల్ అనౌన్స్మెంట్ నుంచి ఒక విచిత్రమైన జర్నీ స్టార్ట్ కాబోతోంది.

**సినిమా కలెక్షన్స్ 300 కోట్లు దాటింది నెక్స్‌టార్గెట్ 400కో?**

అది అవ్వాలని కోరుకుంటున్నా.

# 'నారీ నారీ నడుమ మురారి' ఈవెంట్‌లో చార్మింగ్ స్టార్ శర్వా

సంక్రాంతి బ్లాక్ బస్టర్ 'నారీ నారీ నడుమ మురారి'. రామ్ అబ్బరాజు దర్శకత్వంలో ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్ ప్రై. లిమిటెడ్‌తో కలిసి అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మించారు. సంయుక్త, సాక్షి వైద్య కథానాయికలుగా నటించారు. జనవరి 14న విడుదలైన ఈ చిత్రం బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకుని సంక్రాంతి విన్నర్‌గానిలిచి హౌస్ ఫుల్ గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ సంక్రాంతి విన్నర్ బ్లాక్ బస్టర్ ఈవెంట్‌ని గ్రాండ్‌గా నిర్వహించారు. ఈ వేడుకలో టీం అందరినీ షీల్డ్స్ అందించారు. సంక్రాంతి విన్నర్ బ్లాక్ బస్టర్ ఈవెంట్‌లో చార్మింగ్ స్టార్ శర్వా మాట్లాడుతూ, అందరికి నమస్కారం. మీడియా మిత్రులకు, ఈ సినిమాని అద్భుతంగా ఆదరించిన ప్రేక్షకులకు, ఈ టైటిల్ ఇచ్చి ముహూర్తం పెట్టిన మా బాలయ్య బాబుకి హృదయపూర్వక ధన్యవాదాలుఆరేళ్ల తర్వాత మళ్లీ ఈ సక్సెస్‌కి షీల్డ్స్ ఇవ్వడమనేది నాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. ఇది అందరూ మెచ్చిన బ్లాక్ బస్టర్ సినిమాగా ప్రశంసలు అందుకోవడం ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. శర్వా ఈ సినిమా బ్లాక్ బస్టర్ అవుతుందని మొదటి నుంచి నమ్మకంగా చెప్పారు. ఆ నమ్మకం నిజమైంది. నెక్స్ట్ సంక్రాంతికి ఆయన మళ్లీ వస్తున్నారు. ఆయన రావాలని అందరు కోరుకుంటున్నారు. ఆయన సీన్స్‌కి థియేటర్స్‌లో పడి పడి నవ్వుతున్నారు. . ఈ సినిమా విజయం మా టీంకి అంకితం చేస్తున్నాను.



తెర

# లవ్ స్టోరీ' ఫిబ్రవరి 14న రీ రిలీజ్



యువ సామ్రాట్ నాగ చైతన్య కెరీర్‌లో మరపురాని మైల్ స్టోన్ మూవీ లవ్ స్టోరీ. ఈ చిత్రంలో నాగ చైతన్య తెలంగాణ గ్రామానికి చెందిన ఫోక్ డాన్సర్‌గా పూర్తిగా కొత్త పాత్రలో కనిపించి అందరినీ ఆకట్టుకున్నారు. దర్శకుడు శేఖర్ కమ్ముల చైని అద్భుతంగా ప్రజెంట్ చేశారు. ఈ చిత్రంలో చై తన నటనలోని భావోద్వేగాల అందరినీ హత్తుకున్నాయి. ఆయన నటనకు విమర్శకులు, ప్రేక్షకులు, అభిమానులు ప్రశంసల వర్షం కురిపించారు. హీరోయిన్‌గా సాయిపల్లవి అద్భుతమైన నటనతో ఆకట్టుకున్నారు. చైతన్య-సాయి పల్లవి మధ్య కెమిస్ట్రీ, కుల-వర్గ భేదాలను దాటిన ప్రేమ కథను మరింత హృదయాన్ని తాకేలా చేసింది. గ్రామీణ తెలంగాణ జీవనశైలిని నిజాయితీగా, సున్నితంగా తెరపై ఆవిష్కరించారు. ఇప్పుడు, మేకర్స్ ఈ ఆల్ టైమ్ క్లాసిక్ రొమాంటిక్ సాగా ఫిబ్రవరి 14న ప్రేమికుల దినోత్సవం సందర్భంగా రీరిలీజ్ చేస్తున్నారు. ఇప్పుడు వాలెంటైన్స్ డే రోజున లవ్ స్టోరీ మళ్లీ థియేటర్లలో సందడి చేయనుంది. చైతన్య- సాయి పల్లవి అభిమానులు సినీ ప్రేమికులు ఈ ఆల్‌టైమ్ క్లాసిక్ ని మరోసారి బిగ్ స్క్రీన్ పై ఆస్వాదించేందుకు గెట్ రెడీ.

# ఫిబ్రవరి 6న 'శ్రీ చిదంబరం గారు' విడుదల

చింతా వరలక్ష్మి సమర్పణలో శ్రీ చక్రాస్ ఎంటర్టైన్మెంట్ బ్యానర్ మీద చింతా వినీష రెడ్డి, చింతా గోపాల కృష్ణా రెడ్డి నిర్మాతలుగా చింతా రాజశేఖర్ రెడ్డి సహ నిర్మాతగా వినయ్ రత్నం తెరకెక్కించిన చిత్రం శ్రీ చిదంబరం. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాత వంశీ నందిపాటి థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నారు. వంశీ తుమ్మల, సంధ్యా వశిష్ట జంటగా నటించిన ఈ చిత్రం నుంచి ఇటీవల టీజర్‌ను విడుదల చేశారు. టీజర్‌కు వచ్చిన అనూహ్య స్పందన గురించి తెలిసిందే. కాగా ఈ చిత్రంలో ప్రముఖ సంగీత దర్శకుడు ఎమ్ఎమ్ కీరవాణి ఆలపించిన వెళ్లేదారిలో అనే ఓ పాట బ్యూటిఫుల్ పాటను ఇటీవల విడుదల చేసిన సంగతి తెలిసిందే. చందు, రవి సంగీతం అందించిన ఈ పాటకు చంద్రశేఖర్ సాహిత్యాన్ని సమ కూర్చారు. ఈపాట ట్యూన్‌తో పాటు లిరిక్స్ అందరి హృదయాలను హత్తుకుంటున్నాయి. ముఖ్యంగా కీరవాణి గాత్రం ఈ పాటకు ప్రాణం పోసింది. కాగా ఈ పాట సక్సెస్ సెలబ్రేషన్స్‌తో పాటు చిత్ర విడుదల తేది ప్రకటన ప్రెస్‌మీట్ శుక్రవారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా చిత్రాన్ని ఫిబ్రవరి 6న ప్రపంచ వ్యాప్తంగా థియేట్రికల్ విడుదల చేస్తున్నట్లుగా ప్రకటించారు మేకర్స్. ఈ సందర్భంగా ఈ వేడుకకు ముఖ్య అతిగా విచ్చేసిన ఆర్‌పీ పట్నాయక్ మాట్లాడుతూ, యంగ్ టీమ్ చేసిన బ్యూటిఫుల్ సినిమా ఇది. ఈ రోజు వేదిక మీద ఇంత మంది మ్యూజిక్ డైరెక్టర్లును చూస్తుంటే ముచ్చటగా ఉంది. ఈ రోజు రవి, చందులు కీరవాణి లాంటి గొప్ప సంగీత దర్శకుడిని ఒప్పించి పాడించడం ఎంతో ఆనందంగా ఉంది. చాలా మెచ్యూర్డ్ అండ్ ఇన్‌స్పిరేషన్ స్టోరీతో రాబోతున్న సినిమా ఇది. నేటి సమాజానికి ఎంతో అవసరమైన కథ ఇది అని అన్నారు.



# టీమిండియాలోకి రీఎంట్రీ కష్టమే

## ఈ యేడాది ఐదుగురు ప్లేయర్లు రిటైర్







**న్యూఢిల్లీ:** సీనియర్ స్టార్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ టెస్ట్ క్రికెట్ నుండి వైదొలిగిన తర్వాత ఇదే ట్రెండ్ టీమిండియాలో కొనసాగుతోంది. టీమిండియాలో ఓ వెలుగు వెలిగిన చాలా మంది స్టార్ క్రికెటర్లు ఆటకు గుడ్‌బై చెప్పనున్నారు. ఈ ఏడాది ఐదుగురు భారత ప్లేయర్లు అంతర్జాతీయ క్రికెట్ నుంచి వీడ్కోలు పలుకనున్నారు. వారిలో టీమిండియా ఫాస్ట్ బౌలర్, పేస్ బౌలర్లకు కీలక పాత్ర పోషించిన ఇషాంత్ శర్మ 2007లో అరంగేట్రం చేశాడు.

2021లో తన చివరి అంతర్జాతీయ మ్యాచ్ ఆడిన ఇషాంత్ మళ్లీ టీమ్‌లో రాలేదు. ప్రస్తుతం ఇషాంత్ వయసు 37 ఏళ్లు. టెస్టుల్లో 311 వికెట్లు, వన్డేల్లో 115 వికెట్లు, 8 టి20 వికెట్లు తీసిన అతడు ఐపిఎల్, దేశీయ సర్క్యూట్‌లలో మెంటర్ లాంటి పాత్రలోకి మారాడు. ఇతడు అన్ని ఫార్మేట్లకు ఈ ఏడాది గుడ్‌బై చెప్పనున్నాడు. అలాగే గబ్బా హీరో, భారత్ అత్యుత్తమ స్లిప్ క్యాచర్లలో అజింక్యా రహానే అంతర్జాతీయ మ్యాచ్‌లో రీఎంట్రీ కోసం ఇప్పటికీ శ్రమిస్తున్నాడు. ముంబై తరపున దేశవాళీలో ఆడుతూ టెస్టుల్లో స్థానం కోసం ఎదురుచూస్తున్నాడు. 85 టెస్టులు, 90 వన్డేలు, 20 టీ20 మ్యాచ్‌ల్లో టీమిండియాకు ప్రాతినిధ్యం వహించాడు. 2023లో పునరాగమనం చేసినా ప్రస్తుత టెస్ట్ సెటప్‌లో చోటు సంపాదించడానికి రహానే చాలా కష్టపడ్డాడు. అతను దేశీయ క్రికెట్‌లో ముంబై జట్టుకు నాయకత్వం వహిస్తూనే ఉన్నప్పటికీ, అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో అవకాశం రావడంలేదు. ఈ ఏడాది ఎప్పుడైనా అతను ఆట నుండి నిష్క్రమించనున్నాడు.

ఐపిఎల్‌లో సెంచరీ చేసిన తొలి భారతీయుడిగా మనీష్ పాండే చరిత్రలో తన పేరును లిఖించుకున్నా అతని అంతర్జాతీయ కెరీర్ ఎప్పుడూ అంత ఎత్తుకు చేరుకోలేదు. టీమిండియా తరుపున 20 వన్డేలు, 39 టీ20 మ్యాచ్‌లు ఆడిన మనీష్ ఐపిఎల్ మాత్రమే ఆడుతున్నాడు. ఈ సీజన్‌లో దేశవాళీకు కూడా దూరమైన అతడు ఈ ఏడాది రిటైర్‌మెంట్ ప్రకటించనున్నాడు.

ఫాస్ట్ బౌలర్ ఉమేష్ యాదవ్‌ను సెలక్టర్లు అసలు పరిగణలోకి తీసుకోవడం లేదు. దేశవాళీలో విదర్భ తరపున కొన్ని మ్యాచ్‌లు ఆడాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో టీమిండియా తరపున 288 వికెట్లు తీసిన ఉమేష్ ఒకప్పుడు అత్యంత వేగవంతమైన బౌలర్‌గా కొనసాగాడు. 38 ఏళ్ల ఉమేష్ యాదవ్ రీఎంట్రీ ఇవ్వడం కష్టమే. టీమిండియాకు ప్రధాన స్పిన్నర్‌గా అదరగొట్టిన యుజ్వేంద్ర చాహల్ ప్రస్తుతం జట్టుకు దూరంగా ఉన్నాడు. 2024 టీ20 ప్రపంచ కప్ గెలిచిన జట్టులో చాహల్ సభ్యుడు.

2026 సీజన్ కోసం ఇటీవలే ఇంగ్లాండ్‌లో ఆడేందుకు ఒప్పందంపై సంతకం చేసినప్పటికీ సెలెక్టర్లు రవి బిష్ణోయ్, కుల్దీప్‌యాదవ్ వంటి యువ స్పిన్నర్ల వైపు మళ్లడంతో అతడికి అవకాశం రాలేదు. ఐపీఎల్‌లో అద్భుత ప్రదర్శన చేస్తే చాహల్ రీఎంట్రీ ఇచ్చే అవకాశం ఉంది. లేదంటే టీమిండియా దారులు దాదాపు క్లోజ్ అయినట్లే.



వరల్డ్ టేబుల్ టెన్నిస్ కంటెండర్‌లో..

# ఫైనల్స్‌కు దియా జోడీ

**న్యూఢిల్లీ:** వరల్డ్ టేబుల్ టెన్నిస్ కంటెండర్-2026 మస్కట్‌లో భారత్ మిక్స్‌డ్ డబుల్స్ జోడీ దియా చిటాలే-మనుష్ షా చిరస్మరణీయమైన విజయాన్ని సాధించి ఫైనల్‌కు చేరుకుంది. పురుషుల డబుల్స్‌లో మనుష్-మానవ్, మహిళల డబుల్స్‌లో యశశ్విని-ఐహిక జోడీ సెమీస్‌కు చేరుకున్నాయి. మిక్స్‌డ్ డబుల్స్‌లో అత్యున్నత ర్యాంక్‌లో ఉన్న దియా, మనుష్ ద్వయం తొలి గేమ్‌లలో ఫ్రెంచ్ క్వాలిఫయర్లు థిబాల్ట్ పోరెట్-షార్లెట్ లూట్జ్ చేతిలో ఓడిపోయి 2-0 ఆధిక్యంలోకి వెళ్లింది. సెమీఫైనల్ నిష్క్రమణ తరుణంలో దియా-షా తిరిగి జట్టు కట్టి, తదుపరి మూడు ఆటలను గెలిచి 3-2 తేడాతో విజయం సాధించి టైటిల్ పోరులో తమ స్థానాన్ని బుక్ చేసుకున్నారు. 45 నిమిషాల పాటు జరిగిన ఈ హోరాహోరీ పోరులో దియా, షా జోడీ 10-12, 8-11, 11-8, 11-8, 11-8 ఆధిక్యంలో నిలిచింది. అలాగే పురుషుల డబుల్స్ ద్వయం మానవ్ ఠక్కర్-మనుష్ షా, మహిళల డబుల్స్ ద్వయం యశస్విని ఘోర్పడే-ఐహికా ముఖర్జీ కూడా వారి వారి ఈవెంట్లలో సెమీఫైనల్‌కు చేరుకున్నారు. మూడో సీడ్ థక్కర్-షా 3-1 తేడాతో నోషాద్ అలామియన్-నవిద్ షమ్స్‌ను ఓడించగా, ఘోర్పాడే-ముఖర్జీ అదే స్కోరుతో చైనీస్ తైపీ ద్వయం త్సాయ్ యున్‌ఎన్-హువాంగ్ యుజీని ఓడించారు. మరోవైపు, మరో భారత మహిళల డబుల్స్ తనీషా కోటేచా-స్వస్తిక ఘోష్ క్వార్టర్ ఫైనల్స్‌లో 0-3 తేడాతో ఓడిపోగా, మిక్స్‌డ్ డబుల్స్‌లో సత్యన్ జ్ఞానశేఖరన్-ఘోర్పడే జత కూడా 2-3 తేడాతో ఓడి క్వార్టర్ ఫైనల్ నుంచి నిష్క్రమించింది. ఇక పురుషుల సింగిల్స్‌లో మనుష్ షా ప్రీక్వార్టర్స్‌లో ఐదో సీడ్ డార్కో జోర్జిక్ చేతిలో 0-3 తేడాతో ఓడిపోయాడు. మహిళల సింగిల్స్‌లో సీనియర్ మణికా బాత్రా కూడా రౌండ్ ఆఫ్ 16లో చైనాకు చెందిన టాప్ సీడ్ షి జున్యావో చేతిలో 2-3 తేడాతో ఓడిపోయింది.

# గెలిచినా క్వాలిఫై కాని సూర్మా

## 6-1తో ఎస్జీ పైపర్స్ ఓటమి

**న్యూఢిల్లీ:** పురుషుల హాకీ ఇండియా లీగ్-2026లోని తమ చివరి గ్రూప్ దశ మ్యాచ్‌లో సూర్మా హాకీక్లబ్ ఎస్జీ పైపర్స్‌ను 6-1 తేడాతో ఓడించినా క్వాలిఫయర్స్‌కు చేరుకోలేకపోయింది. క్వాలిఫయర్ 2లో తమ స్థానాన్ని పదిలం చేసుకోవడానికి 7 గోల్స్‌తో కూడిన విజయం అవసరమైన సమయంలో, సూర్మా జెరెమీ హేవార్డ్ (2వ నిముషం, 7,34,45) డ్రాగ్ ఫ్లిక్‌లు, లూకాస్ మార్టినెజ్ (11) చేసిన ఎదురుదాడి స్ట్రైక్‌తో హైఇంటెన్సిటీ ఆరంభాన్ని ఇచ్చింది. ఆ తర్వాత నికోలస్ కీనన్ (47) చివరి క్వార్టర్‌లో సూర్మా అర్హత సాధించేందుకు సహాయంచేశాడు. హేవార్డ్ ఫ్లిక్‌ను పంపి సూర్మాకు అద్భుతమైన ఆరంభాన్నిచ్చాడు. కొన్ని క్షణాలకే మరో పెనాల్టీ కార్నర్‌తో హేవార్డ్ మరోసారి పైపర్స్ ఆధిక్యాన్ని రెట్టింపు చేశాడు. పైపర్స్ సూర్మాను అడ్డుకునే ప్రయత్నం చేసినా, గుర్జంత్ సింగ్ బంతిని లూకాస్ మార్టినెజ్‌కు అందించగా, అతను ఓపెన్ గోల్ చేసి స్కోరును 3-0తో ముగించాడు. రెండో క్వార్టర్‌లో సూర్మా గోల్ పొజిషన్‌లో ఆధిపత్యం చెలాయించడం కొనసాగించింది. మూడో క్వార్టర్ ముగిసే సమయానికి పైపర్స్ అరుదైన గోల్స్ సాధించింది. పవన్ చేసిన ఫౌల్ కారణంగా సూర్మాకు చివరిలో నాలుగు గోల్స్ ఆధిక్యంలోకి తెచ్చాడు. నాల్గవ క్వార్టర్‌లో మ్యాచ్ చివరి క్షణాలకు చేరుకునే వరకు రెండు జట్లు తీవ్రంగా కృషి చేస్తూనే ఉన్నాయి. కానీ సూర్మ 6-1 తేడాతో విజయం సాధించడంతో పైపర్స్‌కు ఓటమి తప్పలేదు.

# ఆస్ట్రేలియా ఘన విజయం

## 58 రన్స్‌కే కుప్పకూలిన శ్రీలంక



**న్యూఢిల్లీ:** అండర్19 ప్రపంచ కప్-2026లో భాగంగా జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఘనవిజయం సాధించింది. నమీబియాలో శుక్రవారం జరిగిన తమ చివరి గ్రూప్ (ఎ) మ్యాచ్‌లో శ్రీలంకను 18.5 ఓవర్లలో 58 పరుగులకే కుప్పకూల్చి ఒక్క వికెట్ కోల్పోయి 9 వికెట్ల తేడాతో కేవలం 12 ఓవర్లలోనే 62 పరుగులు చేసి విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ స్వల్ప లక్ష్యాన్ని ఆస్ట్రేలియా సునాయాసంగా అధిగమించింది. ఆసిస్ ఓపెనర్ విల్ మలాజ్‌చుక్ 5 బంతుల్లో 4 పరుగులకే రాసిత్ నిమ్‌సారా చేతిలో ఔటయ్యాడు. మరో ఓపెనర్ నితీష్ శామ్యూల్ 40 బంతుల్లో 19 పరుగులు చేసి అజే యంగా నిలవగా, స్టీవన్ హోగన్ నాటౌట్‌గా 27 బంతుల్లో 28 పరుగులు చేసేటప్పటికే ఆస్ట్రేలియా స్కోరు 51కి చేరింది. వీటికి తోడు అదనంగా మరో 11 పరుగులు చేరేటప్పటికి ఆసిస్ స్కోరు 62కి చేరుకుని శ్రీలంకపై గెలుపొందింది. అంతకు ముందు మ్యాచ్ ప్రారంభంలో టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న ఆస్ట్రే లియా పేసర్ విల్ బైరోమ్‌చెలరేగడంతో 18.5 ఓవర్లలో 58 పరుగులకే ఆలౌట్ అయింది. బైరోమ్‌కు జతగా ఛార్లెస్ లచ్‌మండ్ (5-1-19-2), కేసీ బార్టన్ (4-0-13-2). హేడెన్ షిల్లర్ (3-0-11-1) కూడా రాణించారు. ఆస్ట్రేలియా బౌలర్ల ధాటికి లంక ఇన్నింగ్స్‌లో కవిజ గమగే(10), చమిక హీనతగల(14) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. మిగిలిన వారంతా సింగిల్ డిజిట్ స్కోర్లకే పరిమితమయ్యారు.



ఇండోనేసియా మాస్టర్స్‌లో..

# సింధు ఓటమి

**అధికారుల పట్ల దుష్ప్రవర్తనకు రెడ్ కార్డ్**

**న్యూఢిల్లీ:** ఇండోనేషియా మాస్టర్స్‌లో భారత్ స్టార్ షట్లర్ పివి సింధు ఘోర ఓటమి పాలైంది. దీనికి తోడు అధికారులతో వాగ్వాదం చేయడంతో ఆమెకు రెడ్ కార్డు జారీ అయింది. ఇస్టోరా సెనాయన్‌లో శుక్రవారం జరిగిన 2026 ఇండోనేషియా మాస్టర్స్ సూపర్ 500 క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో భారత డబుల్ ఒలింపిక్ పతక విజేత సింధు చైనాకుచెందిన టాప్ సీడ్ చెన్ యు ఫీ చేతిలో 13-21, 17-21 తేడాతో ఓడిపోయింది. రెండో గేమ్‌లో సింధు 12-11తో ఆధిక్యంలో ఉన్నప్పుడు, చెన్ యు ఫీనుండి వచ్చిన షాట్‌ను లైన్ అంపైర్ ఆమె ఫోర్‌హ్యాండ్ వైపునుండి ఇన్ చేయడంతో కథ మొదలైంది. ర్యాలీలో ఇంతకు ముందు తన ఏకైక సవాలును కోల్పోయిన సింధు ఈ నిర్ణయంపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. కానీ ఎటువంటి సాక్ష్యాలు, ఆధారాలు లేకపోవడంతో ఆమె రిఫెరల్‌కోసం అడగలేకపోయింది. దీంతో అధికారులతో వ్యవహరించిన తీరు, దుష్ప్రవర్తనకు సింధుకు పసుపుకార్డు లభించింది. కొన్ని నిమిషాల తర్వాత సింధు 12-16తో వెనుకబడినప్పుడు, ఆట ఆలస్యం చేసినందుకు చైర్ అంపైర్ ఆమెకు రెడ్ కార్డ్ చూపించాడు. ఈ సమయంలోనే సింధు ఆ నిర్ణయం పట్ల విసుగు చెంది మ్యాచ్ అధికారులను మధ్యలోకి పిలిపించడంతో పరిస్థితులు వేడెక్కాయి. సింధు విషయంలో, ఆమెకు చూపించబడిన దుష్ప్రవర్తనకు పసుపు రంగు కార్డు మరియు ఆలస్యానికి సంబంధించిన ప్రశ్నార్థకమైన కార్డు రెండూ కలిపి ఎరుపు రంగు కార్డును ఇచ్చాయి. ఒక షట్లర్‌కు రెడ్ కార్డ్ చూపిస్తే, ప్రత్యర్థికి ఒక పాయింట్ ఇవ్వబడుతుంది, ఈ సందర్భంలో కూడా అదే జరిగింది. దీంతో 12-16తో వెనుకబడిన సింధు చివరికి పోటీ నుండి నిష్క్రమించింది.

# కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు

## రూ.6లక్షల కోట్ల టర్నోవర్ నష్టం




**ముంబయి,జనవరి 23:** దేశీయ స్టాక్ మార్కెట్లు వారాంతంలో భారీ నష్టాలను చవిచూశాయి. శుక్రవారం ఉదయం గ్లోబల్ సానుకూల సంకేతాలతో లాభాల్లో ప్రారంభమైనప్పటికీ విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా అమ్మకాలకు మొగ్గుచూపడంతో సూచీలు కుప్పకూలాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 769 పాయింట్లు నష్టపోయి 81,537 వద్ద స్థిరపడగా, నిఫ్టీ 241 పాయింట్లు కోల్పోయి 25,048 వద్ద ముగిసింది. స్టాక్స్ 1.5 శాతానికి పైగా నష్టపోయాయి. ఈ భారీ స్టాక్ మార్కెట్ పతనం పెట్టుబడిదారులకు రూ.6 లక్షల కోట్ల నష్టం కలిగించింది. బిఎస్ఇ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.458.50 లక్షల కోట్ల నుంచి రూ.452.52 లక్షల కోట్లకు పడిపోయింది. బెంచ్‌మార్క్ సూచీలతో పోలిస్తే మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లలో నష్టాలు తీవ్రంగా ఉన్నాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 1.95 శాతం, స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ 2.06 శాతం మేర పతనమయ్యాయి. ఇక సెక్టార్ల వారీగా చూస్తే అన్ని రంగాలు నష్టాల్లోనే ముగిశాయి. ముఖ్యంగా నిఫ్టీ రియల్టీ 3.42 శాతం, మీడియా 2.79 శాతం, పీఎస్‌యూ బ్యాంక్ సూచీలు 2.43 శాతం మేర డీలాపడ్డాయి. ఆటో, ఆయిల్ అండ్ గ్యాస్ రంగాలు కూడా 1 శాతానికి పైగా నష్టపోయాయి. గ్రీన్‌లాండ్ విషయంలో ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడంతో అంతర్జాతీయ మార్కెట్లు సానుకూలంగా ఉన్నప్పటికీ, దేశీయంగా పరిస్థితులు ప్రతికూలంగా మారాయని నిపుణులు విశ్లేషించారు. ముడి చమురు ధరల పెరుగుదల, కంపెనీల మిశ్రమ త్రైమాసిక ఫలితాలు మార్కెట్‌ను దెబ్బతీశాయి. దీనికి తోడు రూపాయి విలువ భారీగా పతనం కావడం ఇన్వెస్టర్లను ఆందోళనకు గురిచేసింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ ఇంట్రాడేలో ఏకంగా 41 పైసలు తగ్గి 91.99కి చేరింది. రాబోయే కేంద్ర బడ్జెట్, అమెరికా ఫెడ్ వడ్డీ రేట్ల నిర్ణయాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారని మార్కెట్ వర్గాలు తెలిపాయి. అమెరికా ఎస్ఇసి ఆదాని కంపెనీ ప్రతినిధులకు సమన్లు జారీచేసేందుకు యుఎస్ కోర్టులో పిటిషన్ దాఖలుచేసిందన్న వార్త మార్కెట్లను కుదిపివేసింది. ఒక్క ఆదాని గ్రూప్‌షేర్లే 1.4 లక్షలకోట్లమేర నష్టం వాటిల్లింది. అదానీ ఎంటర్‌టైన్‌మెంట్, ఆఫ్కాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్, అక్జో నోబెల్ ఇండియా లిమిటెడ్, అదానీ టోటల్, బాటా ఇండియా లిమిటెడ్, బ్లూ జెట్ హెల్త్‌కేర్ లిమిటెడ్ ఒక సంవత్సరం కనిష్ట స్థాయికి చేరుకున్నాయి. ఇదే టైంలో 69స్టాక్‌లు ఈరోజు ఒక సంవత్సరం గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. విదేశీ పెట్టుబడిదారులు స్టాక్ మార్కెట్ నుంచి నిరంతరం పెట్టుబడులు ఉపసంహరించుకుంటున్నారు. బిఎస్ఇ డేటా ప్రకారం విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు (ఎఫ్ఐఐలు) గత సెషన్‌లో నికర ప్రాతిపదికన రూ.2,144.06 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు. దీనికి విరుద్ధంగా, దేశీయ సంస్థాగత పెట్టుబడిదారులు (డిఐఐ) రూ.3,877.78 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేయడం ద్వారా మార్కెట్‌కు కొంత మద్దతు లభించింది.




## ఒక్కరోజులోనే రూ.1.4 లక్షలకోట్ల సంపద ఆవిరి

### అదానీ గ్రూప్ కంపెనీలకు యుఎస్ ఎస్ఇసి ఝలక్

**ముంబయి, జనవరి 23:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎఫెక్ట్‌తో ఇప్పటికే భారత స్టాక్ మార్కెట్ కుదుపులకు లోనయింది. తాజాగా అదానీ గ్రూప్‌లో ఒక్కరోజులో రూ.1.4లక్షల కోట్ల సంపద ఆవిరిఅయింది. వారాంతంలో అదానీ గ్రూప్ షేర్లు భారీగా అమ్ముడయ్యాయి. అదానీ గ్రూప్ సీని యర్ నాయకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి యుఎస్ మార్కెట్ నియంత్రణ సంస్థ, సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ కోర్టు అనుమ తికోరిందన్న వార్త గ్రూప్ షేర్లపై ఒత్తిడికి దారితీసింది, అదానీ కంపెనీకి సుమారు రూ.1.4 లక్షల కోట్ల నష్టం వాటిల్లింది. అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ, ఆయన మేనల్లుడు సాగర్ అదానీలపై లీగల్ నోటీసులు అందించడానికి అనుమతి కోరుతూ ఎస్ఇసి యుఎస్ జిల్లా న్యాయమూర్తిని సంప్రదించింది. న్యూయార్క్‌లోని బ్రూక్లిన్‌లో యుఎస్ న్యాయమూర్తి నికోలస్ గరౌఫిస్ ముందు పిటిషన్ దాఖలు చేశారు. సాధారణ మార్గాల ద్వారా ఈ నోటీసు అందజేయలేకపోతే, ఇతర చట్టపరమైన మార్గాల ద్వారా గౌతమ్, సాగర్ అదానీలకు ఈ విషయాన్ని తెలియజేయడానికి అనుమతి కోరుతున్నట్లు ఎస్ఇసి కోర్టుకు తెలిపింది. భారత ప్రభుత్వం నుంచి పదే పదే సహాయం కోరినప్పటికీ ఇప్పటివరకు అది విఫలమైందని ఎస్ఇసి కోర్టుకు తెలియజేసిందన్న వార్తలొచ్చాయి. రెండు పార్టీలకు చట్టబద్ధంగా అధికారిక నోటిఫికేషన్‌ను అనుమతించే పద్ధతిని అనుసరించడానికి యుఎస్ నియం త్రణ సంస్థ ఇప్పుడు కోర్టు అనుమతిని కోరుతోంది. ఈ మొత్తం వ్యవహారం పెట్టుబడిదారుల సెంటిమెంట్‌ను ప్రభావితం చేసింది. దీంతో శుక్రవారం ట్రేడింగ్ సెషన్‌లో అనేక అదానీ గ్రూప్ స్టాక్‌లు తీవ్ర క్షీణతను చవిచూశాయి. ఈరోజు మార్కెట్‌లో దాదాపు అన్ని అదానీ గ్రూప్ స్టాక్‌లు భారీ అమ్మకా లను చూశాయి. అదానీ గ్రీన్ ఎనర్జీ అత్యధికంగా 7.7 తగ్గి, ఇంట్రాడే కనిష్ట స్థాయి రూ.835కి చేరుకుంది. అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ ఎనర్జీ సొల్యూ షన్స్ రెండూకూడా 5.7తగ్గి వరుసగా రూ.1,968.20, రూ.872.10 కని ష్ట స్థాయిలను తాకాయి. అదానీ పోర్ట్స్ 4.5 తగ్గి రూ.1,351కి చేరుకోగా, అదానీ టోటల్ గ్యాస్ 4.1 తగ్గి రూ.525.60కి చేరుకుంది. అదానీ పవర్ కూడా 3 తగ్గి రూ.136.85 కనిష్ట స్థాయికి చేరుకుంది. సిమెంట్ స్టాక్స్ కూడా ఒత్తిడిలోకి వచ్చాయి. అంబుజా సిమెంట్స్ 2.5, ACC 1.4 పడిపో యాయి. గౌతమ్, సాగర్ అదానీలకు ఇమెయిల్ ద్వారా, అమెరికాలోని వారి న్యాయవాదుల ద్వారా లీగల్ నోటీసులు అందజేయడానికి ఎస్ఇసి యుఎస్‌ఫెడరల్ కోర్టు నుంచి అనుమతి కోరింది. యుఎస్ చట్టాల ప్రకారం సాధారణంగా వ్యక్తికి నేరుగా సమన్లు అందజేయవలసి ఉంటుంది. ఈ కేసు 2020-2024 మధ్య సౌర ప్రాజెక్టుల కాంట్రాక్టులను పొందేందుకు అదానీ గ్రూప్ మొత్తం 250 మిలియన్లకు పైగా లంచం చెల్లించారని నవంబర్ 20, 2024 నాటి ఆరోపణలకు సంబంధించినది. యుఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్ క్రిమినల్ దర్యాప్తు నిర్వహిస్తుండగా, గౌతమ్ అదానీ, సాగర్ అదానీ, అదానీ గ్రీన్ ఎనర్జీ మాజీ సిఇఒ వినీత్ జైన్‌లపై సివిల్ కేసును కొనసాగిస్తోంది.

# ఒక్కరోజే తులం పసిడిపై రూ.5400 పెరుగుదల

## కిలో వెండి కూడా రూ.3.60 లక్షల వద్ద ట్రేడింగ్

### హడలెత్తిస్తున్న ధరలు



**ముంబయి,జనవరి 23:** బంగారం వెండిధరలు రికార్డుస్థాయిలో దూసుకుపోతున్నాయి. తులం బంగారంపై రూ.5,400 పెరిగితే కిలో వెండిపై రూ.15,000 పెరిగింది. కొనుగోలు దారులు ఈ ధరల పెరుగుదలపై హడలెత్తిపోతున్నారు. తులం బంగారంపై రూ.5,400 పెరగడంతో బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,59,710 దగ్గర ట్రేడ్ అయింది. ఇక 22 క్యారెట్ల 10 గ్రాముల ధరపై రూ.4,950 పెరగడంతో రూ.1,46,400 దగ్గర అమ్ముడయింది. ఇక 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధరపైరూ.4,050 పెరగడంతో రూ.1,19,780 దగ్గర ట్రేడ్ అయింది. వెండిధరలు కూడా భారీ గానే షాకిచ్చాయి. శుక్రవారం కిలో వెండిపై రూ.15వేలు పెరిగింది. దీంతో బులియన్ మార్కెట్‌లో కిలో వెండి ధర రూ.3.40లక్షలు దగ్గర అమ్ముడుపోయింది. హైదరాబాద్, చెన్నైలో మాత్రం కిలో వెండి ధర రూ.3.60లక్షలవద్ద ట్రేడ్ అయింది. ఇక ఢిల్లీ, ముంబై, కోల్‌కతాలో మాత్రం కిలో వెండి ధర రూ.3.40లక్షల దగ్గర అమ్ముడవుతోంది. అంతర్జాతీయంగా ఔన్సు బంగారం ధర 4900 డాలర్ల మైలురాయిని దాటగా, వెండి కూడా 96 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. ఈ ప్రభావం నేరుగా స్థానిక మార్కె ట్లపై పడింది. దీంతో రికార్డ్ స్థాయిలో వెండి ధర దూసుకుపోతుంది. అతి త్వరలోనే 4 లక్షల మార్కు దాటేస్తుందని బులియన్ నిపుణులు అంచనాలువేస్తున్నారు.

# రెండేళ్లలో ఎన్బీఎఫ్‌సిల టర్నోవర్ రూ.4 లక్షల కోట్లు

**ముంబయి,జనవరి 23:** దేశంలో బంగారంపై రుణాలు అందించే బ్యాంకింగేతర ఆర్థిక సంస్థల వ్యాపారం రాబోయే రెండేళ్లలో మరింత పెరుగుతుందన్న అంచనాలు పెరిగాయి. 2027 మార్చి నాటికి ఈ సంస్థల నిర్వహణ ఆస్తులు రూ.4 లక్షల కోట్లను అధిగమిస్తాయని రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ రేటింగ్స్ అంచనా వేసింది. గత రెండేళ్లలో 27 శాతంగా ఉన్న వృద్ధి రేటు, రాబోయే రెండేళ్లలో ఏకంగా 40 శాతానికి చేరుతుందని సంస్థ వెల్లడించింది. ఈ భారీ వృద్ధికి పలు కారణాలను క్రిసిల్ విశ్లేషించింది. ముఖ్యంగా, బంగారం ధరలు గణనీయంగా పెరగడం ప్రధాన కారణంగా నిలుస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి తొమ్మిది నెలల్లోనే పసిడి ధరలు సుమారు 68 శాతం పెరిగాయి. దీంతో, అధిక విలువ కలిగిన హామీపై ఎక్కువ రుణాలు ఇచ్చేందుకు సంస్థలకు వీలు కలుగుతోంది. అదే సమయంలో, అన్‌సెక్యూర్డ్ రుణాలపై నిబంధనలు కఠినతరం కావడంతో ప్రజలు ఎక్కువగా సురక్షితమైన గోల్డ్ లోన్ల వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఎన్‌బీఎఫ్ సీలు వినూత్న వ్యూహాలను అనుసరిస్తున్నాయి. పెద్ద ఎన్‌బీఎఫ్‌సీలు తమ బ్రాండ్ ఇమేజ్‌తో ప్రస్తుత శాఖల్లోనే వ్యాపారాన్ని విస్తరిస్తున్నాయి. మరోవైపు, మధ్య తరహా సంస్థలు కొత్త బ్రాంచ్‌లను ఏర్పాటు చేయడంతో పాటు, పెద్దసంస్థలకు, బ్యాంకులకు ఒరిజినేటింగ్ పార్ట్‌నర్‌లుగానూ వ్యవహరిస్తున్నాయని క్రిసిల్ రేటింగ్స్ డైరెక్టర్ అపర్ణా కిరుబాకరన్ వివరించారు. ఈ క్రమంలోనే, ఒక్కో బ్రాంచ్‌కు సగటు నిర్వహణాస్తులు రెండేళ్లక్రితం రూ.10 కోట్లు ఉండగా, ఈఏడాది ప్రథమార్ధంలో రూ.14 కోట్లకు పెరిగింది. దీనికి తోడు, 2026 ఏప్రిల్ 1 నుంచి చిన్న మొత్తాల గోల్డ్‌లోన్లకు సరళీక రించిన లోన్ టువాల్యూ (ఎల్టీవీ)నిబంధనలు అమల్లోకి రానుండటం ఈరంగానికి మరింత ఊతమివ్వనుంది.

## అమెజాన్‌లో భారీ లేఆఫ్‌లు

### 14వేలమందిని తొలగిస్తుందని ఆందోళన




**న్యూఢిల్లీ,జనవరి 23:** ప్రపంచంలోనే ఈ కామర్స్ దిగ్గజాల్లో ఒకటైన అమెజాన్ మరోసారి భారీగా లేఆఫ్స్ ప్రకటించనుంది. వచ్చేవారం నుంచే కం పెనీ రెండో విడత ఉద్యోగాల తొలగింపునకు సిద్ధ మవుతున్నట్లు సమాచారం. మొత్తంగా సుమారు 30వేలమంది కార్పొరేట్ ఉద్యోగులను తగ్గిం చాలనే లక్ష్యంతో అమెజాన్ ముందుకు వెళ్తోంది. ఇందులో భాగంగానే గతేడాది అక్టోబర్‌లోనే అమె జాన్ దాదాపు 14వేల మంది వైట్ కాలర్ ఉద్యో గులను తొలగించింది. ఇప్పుడు జరగబోయే ఈ రెండో విడతలోనూ దాదాపు మరో 14 వేల మందికి ఉద్వాసన పలుకుతోందని ఉద్యోగుల్లో ఆందోళన పెరిగింది. అయితే అమెజాన్ అధికా రికంగా ప్రకటించలేదు. అమెజాన్ ప్రతినిధి స్పందించేందుకు నిరాకరించారు.

## బైక్‌ట్యాక్సీలకు కర్ణాటకలో అనుమతి: రాష్ట్ర హైకోర్టు ఆదేశాలు




**బెంగళూరు,జనవరి 23:** బెంగళూరు సహా రాష్ట్రవ్యాప్తంగా బైక్ టాక్సీలకు అనుమతిస్తూ రాష్ట్ర హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. బైక్ టాక్సీ నడిపే నిరుద్యోగ యువతకు కూడా ఎంతో మేలు చేస్తుంది. బైకులు నడిపే కెప్టెన్లు ఇకపై చట్టబద్ధంగా బైకులు నడుపుకోవచ్చు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ విభు బక్రు, జస్టిస్ సీఎం జోషితో కూడిన ధర్మాసనం శుక్రవారం తీర్పుని చ్చింది. బైకు టాక్సీలు చెల్లుబాటు కావంటూ గతంలో సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును కొట్టివేసింది.

## డాలర్ వర్సెస్ రూపాయి: రికార్డు కనిష్టానికి క్షీణించిన రూపీ



**ముంబయి,జనవరి 23:** డాలరుతో రూపాయి మారకం విలువలు అత్యంత కనిష్టానికి పడిపోయాయి. అమెరికాతో ట్రేడ్ డీల్ వివాదం, వెనిజులా సైనిక చర్య జరిగిన ప్పటినుంచి కూడా రూపాయి పతనం పెరుగుతూనే ఉంది. శుక్రవారం ఒక్కసారిగా 92 రూపాయల కనిష్టానికి చేరి తర్వాత స్వల్పంగా 91.88వద్ద స్థిరపడింది. విదేశీ ఫండ్‌మేనేజర్ల నుంచి మార్కెట్లలో ఎక్కువ విత్‌డ్రాలు ఉండటం, వీటికి చెల్లింపులు డాలర్లలోనే చేయాల్సిరా వడంతో డాలర్ మరింత శక్తివంతం అయింది. విదేశీ కరెన్సీ ట్రేడర్లు మాట్లాడుతూ ఇంటర్‌బ్యాంక్ విదేశీ కరెన్సీ కౌంటర్లలో రూపాయి 91.45 వద్ద ట్రేడింగ్ ప్రారంభం అయింది. ఇంట్రాడేలో 91.41వద్దకు చేరినా తిరిగి 92 రూపాయలకు దూసుకుపోయింది. చివరి నిమిషంలో 91.88వద్ద స్థిరపడిందని ట్రేడర్లు వెల్లడించారు. విదేశీ పెట్టుబడులు అత్యధిక స్థాయిలో విత్‌డ్రా కావడమే ఇందుకు కారణమని మిరాయ్ అసెట్ షేర్‌ఖాన్ ప్రతినిధి అనూజ్‌చౌదరి చెప్పారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.